# 28 జూన్ 2026

# కథానిధి

# ఆదివారం కథలు

సమర్పణ:

కె.ఎ. మునిసురేష్ పిళ్లై, 99594 88088

## కథాక్రమం

| | | | |
|---|---|---|---|
| తెలుగుప్రభ | మరుపురాని కనకవ్వ | ఎండపల్లి భారతి | 93910 06866 |
| ఆంధ్రజ్యోతి ఆదివారం | అంతరం | డా.పార్థసారథి చిరువోలు | 99088 92065 |
| విశాలాంధ్ర | ఒకే రాగం.. (అను.) | కోడీహళ్లి మురళీమోహన్ | 93916 71256 |
| నమస్తే తెలంగాణ బతుకమ్మ | వసంతం | పవన్ కుమార్ దూడం | 83744 03163 |
| సాక్షి ఫన్‌డే | సిమెంట్ సమాధులు | మావూరు విజయలక్ష్మి | |
| నవతెలంగాణ సోపతి | అనన్య | గాజోజి శ్రీనివాస్ | 99484 83560 |
| ప్రజాశక్తి స్నేహ | ఖాళీ కుర్చీ | జ్యోతి మువ్వల | 90080 83344 |
| వార్త | పిల్లలు తెచ్చిన మార్పు | నారంశెట్టి ఉమామహేశ్వరరావు | |
| ప్రజాశక్తి స్నేహ | కాదేదీ వేడుకకు అనర్హం | పిఎల్ఎన్ మంగారత్నం | 97014 26788 |
| వార్త | సంధ్య | కనుమ ఎల్లారెడ్డి | |
| సాక్షి ఫన్‌డే | పిలవని అతిథి | మల్లాది వెంకటకృష్ణమూర్తి | |
| 21.6.26 కథానిధి సమీక్ష | కాలపుగాయాలకు సాంత్వన | భూక్యా గోపి నాయక్ | 99891 59196 |

మరికొన్ని బాలల కథలు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



- కథలు చదవండి.
- చదివే ఆసక్తి ఉన్న మిత్రులకు ఈ పీడీఎఫ్ షేర్ చేయండి.
- కథలు నచ్చితే రచయితలకు మీ స్పందనలు తెలియ జేయండి. మెసేజీ అయినా పెట్టండి.
- కథలు చదివి వదిలే యకండి. మంచి కథల గురించి మీ మిత్రులతో కూడా ముచ్చటించండి. వారికి కూడా చదివే ఆసక్తి పుట్టవచ్చు.
- సాహిత్యప్రియులు *https://kathavasudha.com* లింక్ లోకి వెళ్లిగానీ, దిగువ పేజీలో ఇస్తున్న *QR code* ను స్కాన్ చేయడం ద్వారా గానీ కథావసుధ వెబ్ మేగజైన్ లోని అనువాద కథలు, అనువాద కవితలు, సాహిత్యవ్యాసాలను చదవండి.
- ఆయా దినపత్రికల సౌజన్యంతో

కథా ప్రియులకు నమస్తే..

'తెలుగు ప్రభ' దినపత్రిక కొత్తగా ఆదివారం నాడు కథను ప్రచురించడం ప్రారంభించింది. ఈ వారం నుంచి కథాప్రియులు అదనంగా మరొక కథను కూడా ఆస్వాదించవచ్చు.

ఈ ఆదివారం (28 జూన్ 2026) కథల సంకలనం 42 పేజీల కథానిధి పీడీఎఫ్ లో మొత్తం 11 కథలు, అదనంగా మరికొన్ని పిల్లల కథలు ఉన్నాయి. సావకాశంగా చదవండి.. రచయితలకు మీ అభిప్రాయాలు తెలియజేయండి.

కథానిధి పాఠకులకు గతవారం నాటి కథల సమీక్షను కూడా అందిస్తున్నాము. కథారచయిత భూక్యా గోపి నాయక్ 21 జూన్ 2026 నాటి కథానిధిపై సమగ్ర సమీక్షను 'కాలపు గాయాలకు అక్షరాల సాంత్వన' శీర్షికతో అందిస్తున్నారు. ఈ వారం.. 26వ పేజీ నుంచి ఈ వ్యాసం ఉంటుంది.

ఈ సమీక్ష adarsini.com వెబ్ సైట్ లో కూడా అందుబాటులో ఉంటుంది. టెక్స్టురూపంలో చదవదలచుకున్న వారు.. ఈ కింది లింక్ క్లిక్ చేయడం ద్వారా వెబ్ సైట్ లో చదవవచ్చు.

**21 జూన్ 2026 కథానిధి సమీక్ష కోసం**

21 జూన్ కథానిధి సంకలనం పీడీఎఫ్ అందుబాటులో లేనివారు.. ఈ కింది లింక్ ద్వారా చదవవచ్చు, డౌన్లోడ్ చేసుకోవచ్చు.

**21 జూన్ 2026 కథానిధి సంకలనం కోసం**

కథానిధి వాట్సాప్ గ్రూపులో మీరు నేరుగా మీ మిత్రులను చేర్చవచ్చు. మీరు జాయినింగ్ లింక్ పంపితే వారు కూడా నేరుగా చేరవచ్చు.

మీ

కె.ఎ. మునిసురేష్ పిళ్లె
99594 88088

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# అంతరం

- డాక్టర్ పార్థసారథి చిరువోలు



"అమ్మమ్మా.. నువ్వు ఎవరినైనా ప్రేమించావా?"

పద్దెనిమిదేళ్ల మనవరాలు స్వప్నిక వేసిన ప్రశ్నకు దాక్షాయణి కంగుతింది.

"ఏమిటో ఈ కాలం పిల్లలు. ఏం మాట్లాడుతున్నారో? ఎవరితో మాట్లాడుతున్నారో అన్న వివరం తవరం లేకుండా ఉంది" ఆ ప్రశ్న చికాగ్గా అనిపించినా సర్దుకుంది.

ఎన్నిసార్లు బతిమాలినా రాని మనవరాలు బెంగళూరు నుంచి హఠాత్తుగా ఊడిపడేసరికి ఆమెకు ప్రాణం లేచొచ్చింది. రోజుకో కొత్తరకం పిండి వంట చేస్తూ మురిపెంగా చూసుకుంటోంది. మధ్యమధ్యలో పిచ్చి ప్రశ్నలు వేసినా ఓపిగ్గా భరిస్తోంది.

మనవరాలు వేసుకునే డ్రెస్‌లు ఆమెకు నచ్చలేదు. షార్ట్ అనాలా, అండర్‌వేర్ అనాలో తెలియనంత పొట్టి నిక్కరు, పైన టీ షర్టు. అన్నం తింటున్నా, ఇంకే పని చేస్తున్నా చేతిలో మొబైల్ ఉండవలసిందే. చూపులు దానికి అతుక్కుని ఉంటాయి. చేతివేళ్లు చకచకా కదులుతుంటాయి. అంత చిన్నపిల్లకి అంత ముఖ్యమైన రాచకార్యాలు ఏం ఉంటాయో అనిపించేది.

వచ్చిన రెండో రోజున ఉండబట్టలేక తన మనసులో మాట బయటపెట్టేసింది. మనవరాలు నొచ్చుకోలేదు సరికదా.. "కొంచెం ఫ్రీగా ఉంటుందని ఈ డ్రెస్ వేసుకున్నా అమ్మమ్మా. నీకు ఇష్టం లేకపోతే మార్చేద్దాం దానిదేం ఉంది" అంది తేలిగ్గా. "జీన్స్, టాప్స్ వేసుకోమంటావా? సల్వార్, కుర్తానా? లేకపోతే ఇంకేమైనానా? నీకేది ఇష్టమో చెప్పు" అంది.

"చక్కగా లక్షణంగా లంగా, ఓణీ వేసుకుంటే చూడాలని ఆశగా ఉంది తల్లీ."

"నా దగ్గర లేవు. రేప్పొద్దున షాపింగ్ చేద్దాం.. నీకు నచ్చినవి సెలెక్ట్ చేద్దువుగాని" అని బయలుదేరదీసింది.

ఇంటికి తిరిగి రాగానే కొత్త లంగా, ఓణీ వేసుకుని వచ్చి ఎదురుగా నిలబడింది. దాక్షాయణికి ముచ్చటేసింది.

"ఎంత ముద్దొస్తున్నావే. మీ అమ్మ కూడా నీ వయసులో ఇలాగే మిసమిసలాడుతూ ఉండేది. చూసినవాళ్లు ఎవరైనా కళ్ళు తిప్పుకోలేకపోయే వాళ్లు" అని దగ్గరకు తీసుకుని ప్రేమగా ముద్దాడింది.

"అమ్మమ్మా, ఇంకొకసారి" అని అడిగి మరీ ముద్దు పెట్టించుకుంది స్వప్నిక.

సెల్ఫీ దిగి అమ్మానాన్నలకు పంపింది. ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. "అమ్మమ్మా మనిద్దరి ఫొటోలకు ఎన్ని లైక్స్ వచ్చాయో చూడు" సంబరపడుతూ చూపించింది.

దాక్షాయణికి ఇదంతా కొత్తగా ఉంది. సంతోషంతో ఉక్కిరిబిక్కిరైంది. కూతురికి ఫోన్ చేసి జరిగినదంతా చెప్పింది.

"మంచిదే. నువ్వు దానికి బాగా నచ్చినట్టున్నావు. అది అంత తేలిగ్గా లొంగే రకం కాదు" అంది.

ఆ మాట వినపడగానే చెవిలో అమృతం పోసినట్టనిపించింది.

"నేను ఎన్నిసార్లు వెళ్లమని అడిగినా ఒప్పుకునేది కాదు. ఏ కళనుందో తనే వస్తానంది. పైగా ఈ మధ్య దానికి మగ స్నేహాలు ఎక్కువయ్యాయి. ఎప్పుడు కొంప ముంచుతుందో అని భయపడి చస్తున్నాను. ఈ రకంగానైనా వాతావరణం మారుతుందని నీ దగ్గరకు పంపాను."

కూతురు చెప్పింది వినగానే దాక్షాయణిలో తెలియని ఆందోళన మొదలయ్యింది.

సరిగ్గా అదే సమయంలో.. "అమ్మమ్మా, నువ్వు ఎవరినైనా ప్రేమించావా?" అన్న ప్రశ్న సంధించింది మనవరాలు.

"ఏమిటే ఆ పిచ్చి ప్రశ్నలు. నేను వంట పనిలో ఉన్నాను. విసిగించకు. అవతలకెళ్లి నీ పని చేసుకో. లేకపోతే టీవీ చూడు" అంది చికాకు నటిస్తూ... "తర్వాత నీ వంటలో హెల్ప్ చేస్తాను గానీ, ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పు" అని పట్టు పట్టింది. దాంతో నోరుతెరవక తప్పలేదు.

"మా రోజుల్లో ప్రేమ అనే మాట ఎక్కడుందే. ఆడపిల్లలం నాలుగ్గోడల మధ్యనే ఉండేవాళ్లం" అంది ముక్తసరిగా.

"అలా కాదు. కొంచెం వివరంగా అర్థమయ్యేటట్టు చెప్పు. బాగా సమయం పట్టినా ఫరవాలేదు."

"అప్పట్లో అన్నీ ఉమ్మడి సంసారాలు. ఒక్కో ఇంట్లో ఐదారుగురు పిల్లలు ఉండేవాళ్లు. వాళ్లతో పాటు బాబాయిలు, పిన్నులు, తాతయ్యలు, నానమ్మలు. అప్పుడప్పుడు వచ్చి పోయే మేనత్తలు, మేనమామలు. ఇల్లంతా పెద్ద తిరునాళ్లలా ఉండేది.

బయట మగవాళ్ల సంగతి  దేముడెరుగు. ఇంట్లో కట్టుకున్న వాడితో మాట్లాడటానికే ఆడవాళ్లకు సమయం చిక్కేది కాదు. ఏ రాత్రికో దంపతులకు ఏకాంతం చిక్కేది. పగలంతా ఇంటిపనే. గ్రైండర్లు, మిక్సర్లు లాంటివి ఉండేవి కావుగా.. దంచటం, విసరటం, రుబ్బటం, చిలకటం వంటి పనులు అదనంగా ఉండేవి. ఇల్లే వైకుంఠం.. వంటిల్లే కైలాసం.. అదీ జీవితం" నిట్టూర్చింది.

"అసలు ఒక ఇంట్లో అంత మంది ఎలా ఉండేవాళ్లు? అంత మంది పిల్లల్ని పెంచటం కష్టమయ్యేది కాదా? వ్యక్తుల మధ్య గొడవలు, సర్దుబాట్లు అవీ..?" ప్రశ్నల మీద ప్రశ్నలు వేసింది స్వప్నిక.

సన్నగా నవ్వింది దాక్షాయణి.

"ఆ సంగతి పక్కన పెట్టు. అప్పట్లో ఆడవాళ్లెవరూ తాము కష్టపడుతున్నామని అనుకునేవాళ్లు కాదు. సంసారం పెద్ద బాధ్యత. ఇంటి పని, పిల్లల్ని పెంచటం, ప్రయోజకుల్ని చేయటం తమ ధర్మం అనుకునేవాళ్లు."

స్వప్నిక శ్రద్ధగా వింటోంది.

"అప్పట్లో చిన్నప్పుడే పెళ్లిళ్లు చేసేసేవాళ్లు. ఎక్కువ మంది ఆడవాళ్లు సొంత ఆలోచనలు చేసేవాళ్లు కారు. భర్త నీడలో జీవితం హాయిగా సాగిపోతే అంతే చాలు అనుకునేవాళ్లు. పెళ్లికాకముందు నాన్న, తర్వాత భర్త వాళ్లకు సంబంధించిన అన్ని నిర్ణయాలు తీసుకునేవాళ్లు. ఆశ్చర్యపడవలసిన విషయం ఏమిటంటే చాలా మందికి జీవితం పట్ల అసంతృప్తి ఉండేది కాదు. మీ అమ్మ రోజులకొచ్చేసరికి కొంత మార్పు ప్రారంభమైంది."

"భలే భలే చెప్పు అమ్మమ్మా? అమ్మ ఎలా ఉండేది? తనకు ప్రేమకథలు ఏమైనా ఉన్నాయా?" ఎగిరి గంతేసింది స్వప్నిక.

"ముందు భోజనం చెయ్యి. ఆ తర్వాత మాట్లాడుకుందాం" విషయాన్ని తప్పించే ప్రయత్నం చేసింది. ఆ తర్వాత చిన్న కునుకు తీసింది. నిద్రలేచిన వెంటనే స్వప్నిక మళ్లీ వెంట పడింది.

"అమ్మమ్మా! మధ్యాహ్నం అమ్మ గురించి చెబుతానన్నావుగా. ముందు ఆ విషయం చెప్పు."

ఇద్దరూ పెరట్లో కూర్చున్నారు. వేసవి సాయంత్రం కావటంతో చల్లగాలి వీస్తోంది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

## ఈ వారం కథ




అమ్మమ్మ అందించిన సున్నుండలు, కారప్పూస వున్న ప్లేటును అందుకుని తినటం మొదలుపెట్టింది.

"మీ అమ్మ మిగతా పిల్లల్లాగా కాదు.. ఎవరితోనూ కలివిడిగా ఉండేది కాదు. ఇతరులతో అంతగా మాట్లాడేది కాదు. స్కూలుకు వెళ్లటం, రావటం, హోంవర్కు చేసుకుని పడుకోవటం అంతవరకే. బానే చదివేది. పరీక్షల్లో మంచి మార్కులే వచ్చేవి.

పదో తరగతికి వచ్చేసరికి తనలో ఊహించని మార్పు వచ్చింది. ఒక్కసారిగా చురుకుతనం వచ్చింది. ఖోఖో, టెన్నిస్ వంటి ఆటల్లో పాల్గొనటం మొదలుపెట్టింది. ఒకటి రెండుసార్లు బహుమతులు కూడా వచ్చాయి. దాంతో మాకు ఆశ్చర్యమే కాదు. ఆనందం కూడా కలిగింది.

కానీ ఇంట్లో ఒకరోజు సాయంత్రం ఊహించని సంఘటన చోటుచేసుకుంది. స్కూలు నుంచి అప్పుడే వచ్చిన మీ అమ్మ బ్లేడుతో చేయి నరాలను కోసుకుంది. బొటా బొటా రక్తం కారుతూండగా నేను చూశాను. వెంటనే రిక్షాలో డాక్టర్ దగ్గరకు తీసికెళ్లాను. ప్రాణాపాయం తప్పింది.

'మీ అమ్మాయి ఆత్మహత్యాకు ప్రయత్నించింది. మీరేమైనా అన్నారా?' అని డాక్టర్ అడిగాడు.

'అదేం లేదు' అన్నాను.

'ప్రేమ వ్యవహారం లాంటిది ఏమైనా...?'

నేను వినకూడని మాట విన్నట్టు గట్టిగా చెవులు మూసుకున్నాను. 'అలాంటివి మా ఇంటా వంటా లేవు డాక్టర్ గారూ' అన్నాను.

'తల్లిదండ్రులకు పిల్లలు ఎప్పుడూ చిన్న పిల్లల్లానే అనిపిస్తారు. కానీ పిల్లల ప్రపంచం వేరు. వాళ్ల ఆలోచనలు వేరు. ఇంటికి వెళ్లి విచారించండి. అసలు విషయం తెలుస్తుంది' చెప్పాడాయన.

ఇంటికి వచ్చిన తర్వాత ఎంత ఒత్తిడి చేసినా తను నోరు తెరవలేదు. స్కూలు కెళ్లి ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. నలుగురికి తెలిస్తే పరువు పోతుందని భయపడి మాట్లాడకుండా ఊరుకున్నాం."

"ఇంతకీ అసలేం జరిగింది? తర్వాతయినా నీకు తెలిసిందా?" ఆత్రంగా అడిగింది స్వప్నిక.

"వెంటనే తెలియలేదు. కొన్నేళ్ల తర్వాత.. అదీ పెళ్లికి ముందు.. ఏదో సందర్భంలో చెప్పింది. స్కూల్లో ఆటలు నేర్పే కోచ్‌ను తను బాగా ఇష్టపడిందట. అతనికి అప్పటికే పెళ్లయిన విషయం తెలిసి ఆత్మహత్యకు ప్రయత్నించానని చెప్పింది. తను చెప్పింది విన్నాక ఆశ్చర్యం కలిగింది. ఏ రోజూ ఇల్లుదాటి బయటకు వెళ్లి ఎరగని పిల్లకు ఇలాంటి ఆలోచనలు ఎలా వచ్చాయో అర్థం కాలేదు. బయటకు వెళ్లింది లేదు, కోచ్‌తో ఒంటరిగా గడిపింది లేదు. అప్పట్లో పోటీలు కూడా ఇక్కడే జరిగేవి. ఇతర స్కూళ్ల వాళ్లే ఇక్కడకు వచ్చినట్టు గుర్తు. స్కూలులో చదివే పిల్లలు తమను బాగా ప్రోత్సహించే టీచర్లను ఎక్కువగా ఇష్టపడతారని ఎక్కడో విన్నాను.. బహుశా అలాంటిదే ఇదేమో అని సరిపెట్టుకున్నాను".

"మరి... ఆ తర్వాత?"

"ఏం ఉంటుంది? పదో తరగతి పరీక్షలు రాసి కాలేజీలో చేరింది. పాత విషయాలు మరిచిపోయి తన పని చేసుకుంటూ ఉండేది. ఓ రోజున కాలేజీకి వెళ్లనని మొండికేసింది. ఏమయ్యిందోనని తెగ కంగారుపడిపోయాను.

కాలేజీలో సీనియర్ ఎవరో తన వెంట పడుతున్నాడని.. ప్రేమించమని వేధిస్తున్నాడని చెప్పింది. నాకేం చేయాలో తెలియలేదు. నాల్రోజులు కాలేజీ మానెయ్యమని చెప్పాను. ఈలోపు నేను గుడికి వెళ్లినప్పుడు వాళ్ల ఇంగ్లీషు మేడమ్ కనిపిస్తే విషయం చెప్పాను. ఆమె ఏం చేసిందో తెలియదు కానీ సమస్య తొలగిపోయింది. పోలీసుస్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసే ధైర్యం చెయ్యలేకపోయాం. పరువు పోతుందేమోనన్న భయంతో."

ఈ మాటలు వినగానే స్వప్నికకు నిరాశ కలిగింది.

"నేనయితే వాడి తాట తీసేదాన్ని. ఇంకే అమ్మాయిని వేధించకుండా బుద్ధి చెప్పేదాన్ని. అమ్మ మరీ ఇంత పాత చింతకాయపచ్చడిలా ఉందేంటి అమ్మమ్మా?"

"ఒబ్బిడిగా పెరిగిన నా కూతురిని పట్టుకుని నువ్వు అలా అనటం నాకేం నచ్చలేదే మనవ రాలా? ఏ సమస్య పెంచుకోకూడదనేది తన తత్వం. అదీకాకుండా అప్పట్లో ఆడపిల్లలు అలాగే ఉండేవాళ్లు".

"ఆ తర్వాత ఇలాంటి పోరంబోకులెవరూ తగలలేదా? ఎవరిపైనా ప్రేమ లాంటిది కలగలేదా?" అంది ప్లేటులో మిగిలిపోయిన కారప్పూస పలుకుల్ని నోట్లో వేసుకుంటూ.

"ఊహూ.. తను చక్కగా చదువుకుంది. డిగ్రీ చివరి సంవత్సరంలో ఉండగా రుక్మిణీ కల్యాణం పారాయణం చేసింది. 'మీ అమ్మాయి కొంప తీసి ప్రేమ వ్యవహారాలు నడుపుతోందేమో చూసుకోండి' అని బంధువులావిడ అనేసరికి నా గుండెల్లో రాయిపడింది. రుక్మిణి తనను ప్రేమించిన కృష్ణుడిని ఆరాధిస్తూ అతనినే భర్తగా కోరుకోవటమే రుక్మిణీ కళ్యాణం సారాంశం కదా. అందుకే అంతగా భయపడ్డాను?"

"అప్పుడేమయ్యింది?"

"ఆ విషయం మీద నిలదీశాను. అలాంటిదేమీ లేదని గట్టిగా చెప్పింది."

"నువ్వు ఆ మాటలను నమ్మావా?"

"మోసం చేయటం, అబద్ధాలు చెప్పటం నా కూతురు స్వభావం కాదు. అందుకే నమ్మాను. అదీ కాక అందుకు కారణం కూడా చెప్పింది."

"ఏమిటది?"

"రుక్మిణీ కల్యాణం చదివితే యోగ్యుడయిన వరుడు దొరుకుతాడని మా ఫ్రెండ్ చెప్పింది, అందుకే చదువుతున్నా. నాకు మంచి భర్త దొరకాలి. మీరు కూడా అబ్బాయిని వెతకటానికి ఇబ్బంది పడకూడదని భగవంతుడిని వేడుకుంటున్నా అంది. ఇలాంటి కూతురు దొరకటం ఎంత అదృష్టం చెప్పు."

"ఆ తర్వాత.?"

"ఇంకేం ఉంది. డిగ్రీ అయ్యాక టీచర్ ట్రైనింగ్ చేసి మంచి టీచరయ్యింది. ఏదో పెళ్లికి వెళితే దూరపు బంధువుల అబ్బాయి అదే మీ నాన్న దాన్ని చూశాడు. కాణీ కట్నం లేకుండా పెళ్లి చేసుకోవటానికి ముందుకు వచ్చాడు. తనకు చక్కటి భర్త దొరికాడు. అంతా సుఖంగా ఉంది. కానీ వాళ్లకు మాత్రం ఒక అల్లరి పిల్ల పుట్టింది అదే సమస్య" మనవరాలి నెత్తిమీద మొట్టింది ప్రేమగా.

ఇద్దరు పడీ పడీ నవ్వుకున్నారు.

ఆ రాత్రి దాక్షాయణికి ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. పక్కగదిలో లైటు వెలుగు తోంది. మనవరాలు ఇంకా మెలకువగానే ఉన్నదని అర్థం అయ్యింది. .

"నాకు నిద్రపట్టటం లేదురా.. ఈ రాత్రికి నీ పక్కన పడుకుంటా."

"అలాగే అమ్మమ్మా.. రా"

మంచం మీద పడుకుని ల్యాప్‌టాప్‌లో పని చేసుకుంటున్న స్వప్నిక పక్కకు జరిగి అమ్మమ్మకు చోటిచ్చింది. మనవరాలు ఏం చేస్తోందో తెలుసుకోవాలనిపించింది. ఆసక్తిగా తొంగిచూసింది.

స్వప్నిక ఏ మాత్రం ఇబ్బంది పడలేదు. తను చేస్తున్న పని ఏమిటో వివరంగా చెప్పింది. "ఆడవాళ్లు ఎలాంటి బట్టలు వేసుకోవాలో అని ఈ దేశంలో ఓ చట్టం చేస్తున్నారు. దానికి వ్యతిరేకంగా మేం ఆన్‌లైన్‌లో పిటిషన్లు మొదలుపెట్టాం. ఇప్పటికే 18 వేల మందికి పైగా సంతకాలు చేశారు. ప్రభుత్వం దీనిని ఉపసంహరించే వరకూ వెంటాడతాం."

దాక్షాయణికి ఇదంతా కొత్తగా అనిపించింది.

"చాలా దేశాల్లో ఇలాంటి ఆంక్షలున్నాయి. ఏం దుస్తులు వేసుకోవాలి? ఎలా నడుచుకోవాలి అన్నది ప్రభుత్వమే నిర్దేశిస్తుంది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ల పాలన మాదిరిగా వాళ్ల జీవితాలు నరకప్రాయంగా మారుతున్నాయి. ఇలాంటి ఇష్యూస్ పైన మేం పోరాడతాం."

"అంటే అక్కడకు వెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు, పికెటింగ్‌లు, రాస్తారోకోలు లాంటివి చేస్తారా?"

"లేదు. ఇక్కడ నుంచే మా నిరసనలను పంపుతాం."

"... ... ..." ఆశ్చర్యంగా వింటోంది

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

దాక్షాయణి.

"పరాయిదేశాల గురించి వదిలిపెట్టు అమ్మమ్మా.. మన దేశంలో కూడా ఇలాంటివి ఉన్నాయి. మొన్నా మధ్య చెన్నైలో ఓ ఉద్యోగిని ఒకరు తను లిప్‌స్టిక్ వేసుకున్నందుకు ట్రాన్స్‌ఫర్ చేశారని గగ్గోలు పెట్టింది తెలుసా?

ఆవిడ మహిళా మార్షల్. 15 ఏళ్లుగా చెన్నై కార్పొరేషన్‌లో పనిచేస్తోంది. మూడేళ్ల క్రితం కొత్తగా తొలి దళిత మహిళా మేయర్ రక్షణ బాధ్యతలను ఆమెకు అప్పగించారు. మేయర్‌కి ఇష్టం లేకుండా ఆమె కార్పొరేషన్ నిర్వహించిన ఫ్యాషన్ పరేడ్‌లో పాల్గొన్నదట. దాంతో మేయర్ వ్యక్తిగత సిబ్బంది తనను లిప్‌స్టిక్ వేసుకురావద్దని వేధించారని తను వినక పోవటంతో బదిలీ చేశారని గొడవ చేసింది. దీని పైన సామాజిక మాధ్యమాల్లో పెద్ద చర్చ రేగుతోంది. మేం కూడా ప్రజాభిప్రాయాన్ని సేకరించాం."

స్వప్నిక మాటలు ప్రవాహంలా సాగుతున్నాయి.

"బెంగుళూరులో ఓ ప్రయివేటు స్కూలు భారీగా ఫీజులు పెంచినందుకు నిరసనగా ఆందోళన చేశాం. ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలకు ప్రభుత్వం గట్టిగా మద్దతు ఇచ్చినా మేం పోరాడాం. నెల రోజుల పాటు ఇంటి పట్టున లేకుండా టెంట్లోనే గడిపాం. పోలీసులు వచ్చి బెదిరించినా దీక్షలు కొనసాగించాం. కొందరు విద్యార్థులను సస్పెండ్ చేశారు. వారికి ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించకుండా బ్లాక్ చేశారు. చివరికి మా దెబ్బకు ప్రభుత్వం దిగొచ్చి కార్పొరేట్ స్కూళ్ల ఫీజులకు సంబంధించి పరిమితి విధించింది" గర్వంగా చెప్పింది.

స్వప్నిక మాట్లాడటం ఆపి ల్యాప్‌ట్యాప్‌లో ఫొటోల విభాగంలోకి వెళ్లింది.

"మొన్న వయనాడ్‌లో వరదలొచ్చి కొండ చరియలు విరిగిపడి చాలామంది చని పోయారు కదా.. అక్కడ సహాయ చర్యలకు మేమంతా వెళ్లాం. ఓ నెల్రోజుల పాటు మేం చేతనైనంత పని చేశాం" అంది. పాతిక, ముప్పై మంది.. మగ, ఆడ.. అందరూ ఒకే రకమైన డ్రెస్ వేసుకుని ఉన్నారు.

దాక్షాయణికి చిత్రంగా అనిపించింది. ఆ ఫొటోల్లో మనవరాలు ఎక్కడ ఉందో ఓ నిముషం పాటు వెతికి చివరకు గుర్తుపట్టి సంతోషంగా చెప్పింది. స్వప్నిక కూడా జత కలిసింది.

"ఇవేమిటి?"

"వీళ్లంతా సైన్యంలో పనిచేస్తూ వీరమరణం పొందిన సైనికుల భార్యలు అమ్మమ్మా. ఇప్పుడు పేదరికంలో అలమటిస్తున్నారు. యుద్ధంలో ఉన్నత స్థానాల్లో పనిచేసే వారి పరిస్థితి వేరు. వారికి దొరికే గుర్తింపు, సౌకర్యాలు సామాన్యులకు ఉండవు. ఇలాంటి వారిని ఆదుకోవటానికి ఓ ఫండ్ రైజింగ్ క్యాంపెయిన్ ప్రారంభించాం. పది రూపాయల నుంచి ఎంత మొత్తమైనా విరాళంగా ఇవ్వవచ్చు. దానిని బాధిత కుటుంబాలకు అందించే ఏర్పాటు చేస్తాం."

మనవరాలి మాటలు వింటుంటే కొత్త ప్రపంచంలోకి అడుగుపెడుతున్న భావన కలిగింది.

"ఇదంతా మీ కాలేజీవాళ్లే చేయిస్తున్నారా?" అర్థం కానట్టుగా అడిగింది.

"లేదమ్మమ్మా. మా స్వచ్ఛంద సంస్థ పేరు 'యూత్ వాయిస్'. ఇందులో నేను వలంటీర్‌గా పనిచేస్తున్నాను. ఇంకా చెప్పాలంటే బెంగళూరు విభాగానికి సెక్రటరీని. బాలికలు, మహిళలకు ఎలాంటి అన్యాయం జరిగినా మేం స్పందిస్తాం. వ్యక్తిగత స్వేచ్ఛను కాకుండా బలవంతంగా అభిప్రాయాలను రుద్దుతూ ఇలాగే ఉండాలని శాసించే మోరల్ పోలీసింగ్‌ను వ్యతిరేకిస్తాం. ప్రకృతి విపత్తులు లాంటివి సంభవించి నప్పుడు, ఇంకేదైనా మానవతా సాయం అవ




సరం పడినప్పుడు మేం రంగంలోకి దిగుతాం."

దాక్షాయణికి గర్వంగా అనిపించింది. స్వప్నిక మాట్లాడుతూనే ఉంది. ఇంతకు ముందులా ప్రశాంతంగా కాదు. చాలా ఆవేశంగా.

"మీ రోజుల్లో అమ్మాయికి వంట వస్తే చాలు. ఇంటిని చక్కదిద్దుకునే నేర్పుంటే చాల నుకునేవారు. సంగీతం పాడటం, డ్యాన్సు చేయటం వంటివి అదనపు అర్హతలుగా పరిగణించేవారు. ఉద్యోగాలు చేయాలా, ఊర్లు ఏలాలా... నాలుగు అక్షరం ముక్కలు వచ్చి మొగుడికి ఉత్తరం రాసుకుంటే చాలనుకునే తరం ఉండేది. పాడీపంట, గొడ్డూ గోదా సమృద్ధిగా ఉన్న కుటుంబాల నుంచి వచ్చిన మగపిల్లల్ని ఎంచుకుని పెళ్లిళ్లు చేసేసేవాళ్లు. ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవాడయితే అది ఎంత చిన్నదయినా సంబరపడిపోయేవాళ్లు. కొన్ని తరాల పాటు ఇది కొనసాగింది.

అమ్మ తరంలో ఆడవాళ్లు ఉద్యోగాలు చేయటం ప్రారంభించారు. పూర్తిగా కాక పోయినా, కొంతవరకు తమకు నచ్చినట్టు జీవించారు. ఈ రోజుల్లో ఆ అర్హతలు సరిపోవు అమ్మమ్మా? చదువుకునే రోజుల నుంచి పోటీ ప్రారంభమవుతోంది. ఇంట్లోనూ, బయటా పోరాటం తప్పటం లేదు. నిలదొక్కుకోవటానికి చాలా సాహసాలే చేయవలసి వస్తోంది."

మనవరాలి మాటల్లో ఎంతో నిజం ఉందనిపించింది.

ఇప్పటి ఆడపిల్లలు నిజంగా అన్నింటిలోనూ పోటీ పడి బాగా రాణిస్తున్నారు. సొంత వ్యక్తిత్వం కోసం ఆరాటపడుతున్నారు. ఈ సందర్భంగా అవమానాలు, అపనిందలను భరిస్తున్నారు. వైవాహిక జీవితంలో అపశ్రుతు లను ఎదుర్కొంటున్నారు. సమాజం వారిని అర్థం చేసుకోవటం లేదు. తీర్పులు చెబుతోంది. ఈ తరం చెడిపోయింది అని సులువుగా అనేస్తోంది.

టీనేజీలో ఉన్న పిల్లలనయితే మరీ.. తనకు కూడా వాళ్లమీద దురభిప్రాయం ఉండేది. బాధ్యతగా ఉండరని, శరీరం మీద మోజుతో విపరీతంగా అలంకరించుకుని ఇతరులను ఆకర్షించటానికి ప్రయత్నిస్తారని, పరాయి వాళ్లతో రాసుకుపూసుకు తిరుగుతారని.. ఇలా ఏవేవో అనుకునేది. జీవితం లోతుపాతులు తెలియవనే చులకన భావంతో ఉండేది.

అది తప్పని దాక్షాయణికి ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది.

16ఏళ్ల తన మనవరాలిలో వయసుకు మించిన పరిణతిని, సామాజిక బాధ్యతను ప్రత్యక్షంగా చూస్తోంది. ఈ ప్రపంచాన్ని మార్చటానికి తన వంతుగా ఏదో చెయ్యాలన్న తపనను ఆమెలో గమనిస్తోంది.

చాలా ఫొటోల్లో తన మనవరాలు అబ్బాయిల మధ్య నిలబడి ఉంది. అందులో అబ్బాయిలు, అమ్మాయిలు చాలా సన్నిహితంగా ఒకరి భుజాలమీద మరొకరు చేతులు వేసుకుని కనిపిస్తున్నారు. బహుశా ఈ ఫొటోలు చూసే తన కూతురు స్వప్నికను అపార్థం చేసుకుని ఉండొచ్చనిపించింది.

స్వప్నిక శరీరాన్ని ప్రేమించే వ్యక్తి కాదు. మేధను ప్రేమిస్తోంది.

తను మనసుతో మాత్రమే ఆలోచించటం లేదు. బుద్ధిని ఉపయోగిస్తోంది.

విచ్చలవిడితనం కోరుకోవటం లేదు. సాటి మనిషి స్వేచ్ఛ.. ప్రగతి కోసం పరితపిస్తోంది.

అలాంటి వ్యక్తి గురించి తప్పుగా ఆలోచించటం, నిందాపూర్వకమైన వ్యాఖ్యలు చేయటం ఆమె వ్యక్తిత్వాన్ని కించపరచటమే కాదు. ఆమె ఉన్నత ఆశయాన్ని అవమానపరచటమే అవుతుందనిపించింది.

దాక్షాయణికి మనవరాలు హిమాలయం అంత ఎత్తులో కనిపించింది.

అదే సమయంలో ఆమె ఊహలు మరి కొంచెం లోతుకు వెళ్లాయి.

భర్త తప్ప మరో మగవాడి ఆలోచన లేని తన తరానికి, మగవాళ్లతో భయం భయంగా అంటీముట్టకుండా ఉండే తన కూతురు తరానికి, మగవాళ్ల మధ్యనే గడుపుతూ తమ ఉనికిని చాటుకోవటానికి అడుగడుగునా పోరాడుతున్న తన మనవరాలి తరానికి మధ్య ఉన్న అంతరం గురించి ఆలోచించసాగింది.

రేపు తన మనవరాలికి కూతురు పుడితే అది ఎలా ఉంటుందో?

ఆ తరంలో ఎన్ని మార్పులొస్తాయో?

ఆ రాత్రంతా దాక్షాయణి ఆలోచిస్తూనే ఉంది.

99088 92065

SUNDAY
విశాలాంధ్ర
ఆదివారం అనుబంధం
4 | 28 ఆదివారం, జూన్ 2026



డైరీని టేబుల్ మీద పెట్టిన సుమిత్ర ఏదో ఆలోచనలో పడింది. సంబంధాల నిజమైన లోతును అర్థం చేసుకోకుండా, అపరిపక్వతతో, నేటి కాలంలో సంబంధాల లోతు తెలియని అపరిపక్వత పెరిగిపోయింది. కాలంతో పాటు మారని జీవిత విలువలను గుర్తించే తీరిక ఎవరికీ లేదు. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో ఆడంబరమైన పోస్టులు, కృత్రిమమైన మెచ్చుకోలు మాటలే జీవితం అనుకునే ఈ రోజుల్లో... యాభై ఏళ్లుగా జీవన సహచరులుగా ఉండి, ఆ బంధాన్ని పవిత్రంగా గౌరవించుకుంటూ, తమ సుదీర్ఘ ప్రేమానుబంధాన్ని ఒక్క గులాబీ పువ్వుతోనే సంబరంగా జరుపుకోవాలనుకున్న తాతయ్య-నానమ్మల నిరాడంబర జీవనం సుమిత్రకు అద్భుతమనిపించింది!

'తాతయ్యా, మీరు నానమ్మకు 'ఐ లవ్ యూ' అని చెప్పి ఈ పువ్వు ఇవ్వండి,' అంటూ అక్కడున్న గులాబీలను తీసుకుని, ఒక పువ్వును శ్యామరావు చేతిలో పెట్టి సుమిత్ర బలవంతం చేసింది. ఆ క్షణంలో కొంచెం తడబడిన తాతయ్య, మనవరాలి ఒత్తిడికి తలొగ్గాడు.

'ఐ లవ్ యూ,' అని సుభద్ర చేతిని పట్టుకుని శ్యామరావు గులాబీ పువ్వు ఇచ్చినప్పుడు, ముడతలు పడిన అతని చేయి వణికింది. కళ్ళలో ఏదో తెలియని మెరుపు! నానమ్మ ఎడమ చేతిలో ఒక పువ్వు పెట్టి దాన్ని తాతయ్యకు ఇవ్వమని చెప్పినప్పుడు, మంచంపై పడుకున్న సుభద్ర గుంతలుపడ్డ కళ్ళలోనూ అదే మెరుపు కనిపించింది! వారిద్దరూ ఒకరి చేతిని ఒకరు పట్టుకున్న ఆ క్షణంలో, కింద డ్రాయింగ్ రూమ్‌లోని టీవీ నుండి ఒక భావగీతం వినిపించింది.

ఇదే నేను...అదే నీవు స్వరాలమై ఒకే రాగంలో కలిసిపోవాలి. శృతిలయల మధుర గానమై మన బతుకు పాటగా మ్రోగిపోవాలి.

అనువాద కథ

# ఒకే రాగం...

కన్నడ మూలం: సరితా నవలి
తెలుగు అనువాదం:
కోడీహళ్ళి మురళీమోహన్
9391671256

'సుమీ, తాతయ్య వాకింగ్‌కు వెళ్లారా? మరో కప్పు టీ కావాలని అడిగారు.' వంటగది నుంచి గేటు చప్పుడు విన్న అమ్మ గట్టిగా అడిగింది. డ్రాయింగ్ రూమ్ సోఫాలో కూర్చున్న సుమిత్ర, 'వెళ్లారమ్మా... పేపర్ చదువుతూ ఏదో గుర్తుకొచ్చి లేచి వెళ్లారు, బహుశా మెడికల్ షాపుకు వెళ్లారేమో?' అంటూ దినపత్రిక పేజీలు తిప్పసాగింది.

స్కూల్ బస్సు కోసం ఎదురుచూస్తున్న తమ్ముడు ఆదిత్య, టీవీ రిమోట్ పట్టుకుని ఛానల్స్ మారుస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. క్షణక్షణానికీ మారుతున్న ఆ శబ్దాలకు విసిగిపోయిన సుమిత్ర, 'ఆదిత్యా! అలా ఛానల్స్ మార్చడం ఆపి ఏదో ఒకటి చూడొచ్చుగా?' అని కోప్పడింది.

'నువ్వు కూడా అంతే కదా, అలా పేజీలు తిరగెయ్యడం మానేసి!' అని వాడు బదులిచ్చాడు.

'పోరా వెధవా!' అని తిట్టుకుంటూ సుమిత్ర లోపలికి వెళ్లింది.

సుమిత్ర కాలేజీలో ఆరోజు డిగ్రీ చివరి ఏడాది విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం ఉంది. ఆమె ముందురోజే గ్రీటింగ్ కార్డ్స్, చాక్లెట్లు, ఎరుపు-పసుపు రంగు గులాబీ పూల గుచ్ఛాలను తెచ్చి పెట్టుకుంది. ఆదిత్య కంట పడకుండా చాక్లెట్లను దాచి, గులాబీలను ఒక చిన్న బకెట్ నీళ్లలో ఉంచింది. వాటిలో ఏవైనా మొగ్గలు విచ్చుకున్నాయేమో చూడాలని వెళ్లిన సుమిత్రకు, ఎర్ర గులాబీల గుచ్ఛం కనిపించకపోయేసరికి ఆశ్చర్యం వేసింది. ఈ మధ్య ఆదిత్యకు ఫేస్‌బుక్‌లో అమ్మాయిలే ఎక్కువగా ఫ్రెండ్స్ అయ్యారన్న విషయం గుర్తొచ్చి, వాడే తీసుకెళ్లాడేమో అని అనుమానం వచ్చింది. వాడిని అడుగుదామని బయటకు వచ్చేసరికి వాడు బస్సు ఎక్కి స్కూల్‌కి వెళ్లిపోయాడు.

కోపంతో మెట్లు ఎక్కి తన గదిలోకి వెళ్తున్న సుమిత్ర వంటింటి నుంచి వినిపిస్తున్న అమ్మ పిలిచిన పిలుపునూ పట్టించుకోలేదు... అప్పుడు తాతయ్య-నానమ్మల గది తలుపు సగం తెరిచి ఉండటం, లోపల టేబుల్ మీద ఆ ఎర్ర గులాబీల గుచ్ఛం ఉండటం ఆమె కంట పడింది. ఆశ్చర్యం వేసి, శబ్దం చేయకుండా తలుపు నెట్టి మెల్లగా లోపలికి వెళ్లింది. టేబుల్ పక్కన ఉన్న మంచం మీద అనారోగ్యంతో మంచాన పడ్డ ఆమె నానమ్మ సుభద్రమ్మ పడుకుని ఉంది. నానమ్మ తల నిమిరి, దుప్పటి సరిచేసి టేబుల్ వైపు తిరగగా, పూల గుచ్ఛం పక్కన ఒక డైరీ కనిపించింది. మొదటి పేజీలో 'శ్యామరావు' అని తాతయ్య పేరు రాసి ఉంది. కుతూహలంతో ఆ డైరీ పేజీలు తిప్పే ముందు, 'తాతయ్య డైరీ చదవడం సరైనదేనా?' అని తనని తాను ప్రశ్నించుకుంది సుమిత్ర. ఒకటి రెండు క్షణాలు ఆగి, 'నేను తాతయ్య ముద్దుల మనవరాలిని కదా!' అని తనకు తానే సమాధానం చెప్పుకుని, నిద్రిస్తున్న నానమ్మను ఒకసారి చూసి, పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని డైరీ చదవడం ప్రారంభించింది. ఆ డైరీలో శ్యామరావు, సుభద్రల జీవిత విశేషాలు సుమిత్ర కళ్లముందు ఆవిష్కృతమయ్యాయి.

మేనమామ కూతురైన వినోద పెళ్లి కోసం ధార్వాడ్ నుంచి సవణూరికి తల్లి గోదూబాయితో కలిసి వెళ్లాలని నిర్ణయించుకునే ముందు, అక్కడికి వెళ్లడానికి శ్యామరావు వెనుకాడాడు. దానికి బలమైన కారణం కూడా ఉంది. చిన్నప్పటి నుంచి



తాతయ్య ఇంట్లో శ్యామరావు, వినోద కలిసి ఆడుకుంటూ పెరిగారు. వయసులో ఆరేడు ఏళ్లు పెద్దవాడైన శ్యామరావు ధార్వాడ్‌లోని కర్ణాటక కాలేజీలో బి.ఎ. పాసై ప్రభుత్వ ఉద్యోగంలో చేరినప్పుడు, గోదూబాయి తన వదిన కూతురైన వినోదనే తమ ఇంటి కోడలిగా రావాలని ఆశపడింది. ఈ విషయం గురించి మాట్లాడటానికి ఒకటి రెండు సార్లు సవణూరికి వెళ్లినా, ప్రస్తావించడానికి వీలుకాలేదు. తన కొడుకుకి కూడా వినోద అంటే ఇష్టమేనని సునిశితంగా గమనించిన గోదూబాయి, హోలీ పూర్ణిమ సమయంలో జరిగే శ్రీ సత్యబోధ స్వామి ఆరాధన కోసం కొడుకును కూడా తీసుకుని సవణూరికి వచ్చి వదిన గారి ఇంట్లో విడిది చేసింది. మరదలికీ, మేనల్లుడికీ ఎంతో మర్యాదలు చేసిన రాధాబాయి దగ్గర, వినోద తమ ఇంటి కోడలిగా రావాలనే తన కోరికను గోదూబాయి బయటపెట్టింది. ఆమె తన భర్త, కూతురితో మాట్లాడతానని చెప్పి మళ్లీ ఆ మాటను కొనసాగించలేదు. మూడు రోజుల ఆరాధన మహోత్సవం ముగించుకుని ధార్వాడ్‌కు బయలుదేరడానికి సిద్ధమవుతున్న శ్యామరావుకు, వంటగదిలో మేనత్త రాధాబాయి మాట్లాడుతున్న మాటలు స్పష్టంగా వినిపించాయి.

'అబ్బాయి చాలా మంచివాడే. కానీ మన గోదూబాయిగుణం ఎటువంటిదో మీకు తెలియదా ఏంటి? బంధువులంతా ఆమెను 'గయ్యాళి గోదూబాయి' అని పిలుస్తారు. ఇక ఆమె చేతి కింద మన వినోద కాపురం చేసినట్టే!'

భార్య మాటలకు అడ్డుతగులుతూ మేనమామ, 'అదేంటి...నామాట కొంచెం విను...అబ్బాయికి ప్రభుత్వ ఉద్యోగంఉంది...' అని సర్ది చెప్పబోయాడు.

'మీరు ఊరుకోండి. నేను ఏదో ఒకమాట చెప్పి పంపిస్తాను. సంసారం అంటే సరదా కాదు సుమా!' అంటూ భర్త మాటను మధ్యలోనే తుంచేసి రాధాబాయి వరండా వైపు నడిచింది.

ఈ మాటలన్నీ విన్న శ్యామరావు ధార్వాడ్‌కు తిరిగి వచ్చిన తర్వాత, తనకు వినోదను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని గోదూబాయికి తేల్చి చెప్పాడు. ఇప్పుడు అదే వినోద పెళ్లికి వెళ్లడం ఎందుకని అతడు తటపటాయిస్తూ ఉంటే గోదూబాయి, 'అలా అనకూడదు, చుట్టరికం వదులుకోకూడదు. ఒకరి ఇంటికి ఒకరు వెళుతూ ఉండాలి. ఆ పెళ్లిఇంట్లో నీకు ఎవరైనా అమ్మాయి నచ్చవచ్చు' అని నచ్చజెప్పి కొడుకును బయలుదేర దీసింది.

వినోద పెళ్లిలో వియ్యాలవారి గుంపులో సుభద్రను చూసిన గోదూబాయి, వారి ఇంటి పెద్దలతో మాట్లాడి ఆమెను తమ ఇంటి కోడలిగా చేసుకోవాలని నిర్ణయించుకుంది. పెళ్లి ఇంట్లో చిన్న చిన్న పనుల్లో సహాయం చేస్తూ చురుగ్గా తిరుగుతున్న సుభద్రను చూసి గోదూబాయి, 'అమ్మాయి చాలా లక్షణంగా ఉంది, పని మంతురాలిలా కనిపిస్తోంది. మా శ్యాము గనుక ఒప్పుకుంటే నుగ్గికేరి హనుమప్ప (ఆంజనేయ స్వామి)కి నెయ్యి దీపం వెలిగిస్తాను' అని మొక్కుకుంటూ కొడుకుతో ఈ విషయం కదిపింది.

మొదట తల్లి మాటలను పెద్దగా పట్టించుకోని శ్యామరావు, పెళ్లివేడుకలో అప్పగింతల సమయంలో సుభద్ర 'నమ్మ మనె అంగళది బెళెదొందు హూవన్ను నిమ్మ మడిలొళగిరలు తందిరువవు (మా ఇంటి పెరటిలో పెరిగిన పూవును మీ ఒడిలో ఉంచడానికి తెచ్చాము...)' అని కళ్లలో నీళ్లు నింపుకుని మధురంగా పాడుతుండటం చూసి, ఆమెను పెళ్లి చేసుకోవడానికి వెంటనే ఒప్పుకున్నాడు. తమ ఇద్దరి మధ్య ఏదో తెలియని ఒక భావోద్వేగ బంధం ఏర్పడినట్లు అతనికి అనిపించింది. ఉమ్మడి కుటుంబానికి చెందిన సుభద్ర కూడా, ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి చూడటానికి సినిమా నటుడు దేవానంద్‌లా ఉన్న శ్యామరావును పెళ్లి చేసుకోవడానికి ఎటువంటి అభ్యంతరం లేకుండా ఒప్పుకుంది. పెద్దల సమక్షంలో శ్యామరావు, సుభద్రల నిశ్చితార్థం, వివాహం ఘనంగా జరిగాయి. పెళ్లి కార్యక్రమాలన్నీ సాంగోపాంగంగా ముగిసి సుభద్ర కోడలిగా గడప తొక్కినప్పుడు, గోదూబాయికి తనపై ఉన్న ఒక పెద్ద బాధ్యత తీరిపోయినట్లు అనిపించింది.

ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తాగా పని చేస్తున్న శ్యామరావు భార్యగా సంసారం ప్రారంభించిన సుభద్రకు, అత్తగారు గోదూబాయి గయ్యాళితనం తెలిసొచ్చింది. కోడలు చేసే ప్రతి

(మిగతా 5వ పేజీలో)

# ఒకే రాగం...

(కథ-4వ పేజీ తరువాయి)

పనిలోనూ ఏదో ఒకతప్పు వెతికి ఎత్తిపొడవడం, నోరు పారేసుకోవడమే గోదూబాయి పనిగా మారింది. అయితే, ఈ విషయమై భర్తకు చాడీలు చెప్పి ఇంటిని రణరంగం చేయకుండా, అత్తగారి ఎత్తిపొడుపులను సహిస్తూ సుభద్ర తన పని తాను చేసుకుపోయేది. జీవితంలోని కష్టాలు, సంఘర్షణలే గోదూబాయిని ఇంత కఠినంగా మార్చాయని శ్యామరావు చెప్పినప్పుడు, సుభద్ర ఆ మాటను మరింత పెంచకుండా మౌనం వహించింది. ధార్వాడ్‌లోని సాహిత్య వాతావరణం, బెంద్రే గారి కవితల ప్రభావంతో శ్యామరావు, భార్యాభర్తల అనుబంధాన్ని తెలిపే కవితలను చదవమని భార్యకు చెప్పేవాడు. ఈ చదువుతో పాటు, పెళ్లికి ముందు మధ్యలో ఆగిపోయిన తన విద్యాభ్యాసాన్ని కొనసాగించాలనే కోరికను భర్త దగ్గర వ్యక్తపరిచినప్పుడు, శ్యామరావు కాదనకుండా ప్రోత్సహించాడు. దీనికి సుభద్ర ఎంతో సంతోషించింది. కానీ గోదూబాయి దీనికి మనస్ఫూర్తిగా అంగీకరించలేదు. ఇంటి పనులు చేస్తూ, అత్తగారి మెప్పు పొందే ప్రయత్నంలోనే కష్టపడి సుభద్ర బి.ఏ. పూర్తి చేయడంతో శ్యామరావుకు భార్యపై ఎంతో గర్వం కలిగింది. ఉద్యోగం చేయడానికి అత్తగారు నిరాకరించడంతో, సుభద్ర కొడుకు ఆలనాపాలనా చూసుకుంటూనే, ఇరుగుపొరుగు పిల్లలకు పాఠాలు చెబుతూ, ఎంబ్రాయిడరీ వంటివి నేర్పిస్తూ సంసార బాధ్యతల్లో ఆసరాగా నిలిచింది. నెలచివర్లో చేతిలో డబ్బులు లేనప్పుడు, ఉదయాన్నే ఆఫీసుకి వెళ్లేముందు తన షర్టు జేబులో భార్య ఉంచే కొద్దిపాటి డబ్బును చూసి, శ్యామరావు మనసులోనే ఆమెకు కృతజ్ఞతలు చెప్పుకునేవాడు. ఆ సమయంలో అతనికి గుర్తొచ్చే కవితా పంక్తులు: 'నేను పేదరాలిని, అతడు పేదవాడు.. ప్రేమే మా బతుకు, పంచుకున్నదే మాకు సర్వస్వం.'

రెండవ బిడ్డ పుట్టినప్పుడు, రాత్రంతా ఏడ్చే బాబును ఓదార్చడానికి సుభద్ర పడుతున్న కష్టం చూసి, శ్యామరావే స్వయంగా రాత్రంతా మేల్కొని బాబును చూసుకోవడం మొదలుపెట్టాడు. ఇదే అలవాటును సద్వినియోగం చేసుకోవాలని భావించిన సుభద్ర, భర్తను శాఖాపరమైన పరీక్షలు రాయమని సలహా ఇచ్చింది. శ్రమకు తగినట్లు శ్యామరావుకు పదోన్నతి వచ్చి, భార్యాపిల్లలతో సుఖసంసారాన్ని గడిపాడు. పిల్లలు పెరుగుతున్న కొద్దీ వారికి ఉన్నతవిద్యతోపాటు మంచి సంస్కారం, జీవిత విలువలను అలవడేలా చేయడంలో సుభద్ర, శ్యామరావులు కృషి చేశారు. అభిప్రాయ భేదాలకు తావు ఇవ్వకుండా, పిల్లలను అతిగా గారాబం చేయకుండా, అలాగని అతిగా శిక్షించకుండా వారి అవసరాలను తీర్చడంలో ఇద్దరూ ఆరితేరారు. తమ సొంత సామర్థ్యాలను పక్కన పెట్టి ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించుకునేవారు. సుభద్ర పుట్టింటిపై అతిగా వ్యామోహం చూపకుండా, అత్తగారింటి గురించి చిన్నచూపులేకుండా తనదైన వ్యక్తిత్వాన్ని అలవర్చుకోగా, శ్యామరావు స్వభావంకూడా దానికి తగినట్లే ఉండేది. ఆర్థికపరిస్థితినిబట్టి సంసారంలో పొదుపుగా ఉన్నప్పటికీ, సుభద్ర కోరుకున్న వస్తువులను కొనివ్వడానికి శ్యామరావు ఎప్పుడూ వెనుకాడలేదు. వ్యక్తిగత ప్రతిష్ఠల కంటే తమ అనుబంధానికే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చిన వీరిని చూసి స్నేహితులు, బంధువులు ఎంతో మెచ్చుకునేవారు.

"సంసారాన్ని సారవంతం చేసుకోవడం మన చేతుల్లోనే ఉంటుందని మీ శ్యామ, సుభద్రలను చూస్తే అనిపిస్తుంది మరదలా! మా వినోద కూడా మీ ఇంటికి ఇంత చక్కగా సరిపోయేదో లేదో అని స్వయంగా రాధాబాయే గోదూబాయితో అన్నప్పుడు, శ్యామరావుకు తన సంసారం పట్ల ఎంతో అభిమానం కలిగింది. పిల్లలిద్దరూ ఉన్నత



చదువులు పూర్తిచేసి, మంచిఉద్యోగాల్లో స్థిరపడి, పెళ్లిళ్లు చేసుకునే సమయానికి శ్యామరావు ఉద్యోగం నుంచి రిటైరై బెంగళూరుకు వచ్చి స్థిరపడ్డాడు. పెద్దకొడుకు దూరంగా డెహ్రాడూన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు, అక్కడి చలి శ్యామరావు ఆరోగ్యానికి పడదని ఇక్కడే తమ సొంత ఇంట్లో చిన్న కొడుకుతో కలిసి నివసించసాగారు. అయితే, చిన్న కోడలు వీరితో సరిగ్గా ఇమడలేకపోయింది. ఒకటి రెండుసార్లు మాటల యుద్ధం జరిగినప్పుడు, డెహ్రాడూన్‌కు వెళ్లిపోదామన్న శ్యామరావు నిర్ణయాన్ని సుభద్ర అంగీకరించలేదు. కోడలి నడవడిక తమ స్వాభిమానానికి సరిపోవట్లేదని ఆలోచిస్తుండగానే, ఒకరోజు కోడలు శ్యామరావు చేసిన ఒక చిన్న తప్పును చాలా పెద్దది చేయడమే కాకుండా, అతని రిటైర్మెంట్ జీవితాన్ని అవమానించేలా మాట్లాడింది. పాతకాలమైనా, ఇప్పటికాలమైనా... సర్దుబాటు లేనిదే సంసారం సుఖంగా ఉండదని సుభద్ర నమ్మకం. కానీ కోడలిలో ఆ గుణం లేకపోవడమే కాకుండా అహంకారం, బాధ్యతలేని మాటలే కనిపిస్తున్నాయని గ్రహించి కొడుకును పిలిచి, అతను తన భార్యతో కలిసి వేరే ఇంటికి వెళ్లాలని ఖరాఖండిగా చెప్పింది. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు ఎన్నోసార్లు వారి తప్పులను వెనుకేసుకొచ్చిన సుభద్ర, ఆరోజు కొడుకు-కోడలికి వ్యతిరేకంగా నిలబడి తన భర్త శ్యామరావును సమర్థించింది.

'తల్లినీ కొడుకునీ ఇలా వేరు చేయడం సరికాదేమో కదా?' అని శ్యామరావు సందేహం వ్యక్తం చేశాడు.

'రెక్కలు బలపడ్డాక పక్షిపిల్ల స్వతంత్రంగా ఎగిరిపోదా ఏంటి?' అని సుభద్ర బదులిచ్చింది.

రెక్కలు వచ్చిన పక్షి గూటి నుంచి ఎగిరిపోవడమంత సులభంకాదు మనిషిబతుకు అని వారిద్దరికీ తెలుసు. ఆ పక్షిపిల్ల తన గూడు తాను కట్టుకున్నట్లే, పెరిగిన పిల్లలు కూడా తల్లిదండ్రుల నుంచి దూరమై తమదైన ప్రపంచాన్ని నిర్మించుకుంటారు. అయితే, గూటిలో నోటికి మేత అందించి పిల్లలను పెంచే పక్షులకూ, జీవితాన్ని ధారపోసే మనుషులకూ...జీవశాస్త్రంలో చదువుకునే శారీరక నిర్మాణ వ్యత్యాసాల కంటే, భావోద్వేగ ఎదుగుదలలో ఉండే వ్యత్యాసం చాలా పెద్దది కదా? అంటే, మనం సర్దుకుపోవడం ఇష్టం లేక, దానికి ప్రయత్నించనప్పుడు...మనశ్శాంతి కోసం వెతుక్కునే ఒక పలాయన మార్గంలా ఇది అనిపించడం లేదూ?

సుభద్ర అన్న మాటలకు ఏమి తోచక శ్యామరావు మౌనంగా ఉండిపోయాడు. అడపాదడపా సుభద్ర పిల్లలగురించి అతిగా ఆందోళన పడుతున్నప్పుడు, అది పిల్లలకు చిరాకుతెప్పించి వారు కోప్పడితే...తానూ భార్యకే మద్దతుగా నిలిచి పిల్లలకు బుద్ధిచెప్పినరోజులు ఆయనకు గుర్తొచ్చాయి. వయసుమళ్లిన తల్లిదండ్రులను వదిలి వెళ్లడానికి మనసు అంగీకరించకపోయినా, తల్లి మాటకు ఎదురు చెప్పలేక చిన్న కొడుకు వేరే కాపురం పెట్టుకుని వెళ్లిపోయాడు.

డైరీ చదవడం ఆపి నానమ్మ వైపు చూసింది సుమిత్ర. ఆమె ప్రశాంతంగా నిద్రపోతోంది. ఒకసారి తాతయ్యను తలచుకుని చిరునవ్వు నవ్వి, మళ్లీ డైరీ పేజీలపై తన దృష్టిని సారించింది.

పెద్ద ఇంట్లో ఇప్పుడు సుభద్ర, శ్యామరావు ఇద్దరే ఉండటం మొదట్లో బిక్కు బిక్కుమనిపించినా, రోజులు గడిచేకొద్దీ అలవాటైపోయింది. శ్యామరావుకు వచ్చే పెన్షన్ ప్రశాంతంగా బతకడానికి ఆసరాగా నిలిచింది. పొదుపుగా ఉండటం, అనవసరమైన వస్తువుల వెనుక పడకపోవడం, ఇంకా కొద్దిపాటి పొదుపు... ఈ వయసులో వారు పిల్లలపై ఆధారపడకుండా ఉండటానికి దోహదపడ్డాయి. ముసలితనంలో శక్తి తగ్గుతున్నా, ఆరోగ్య సమస్యలున్నా జీవితంపై ఆసక్తి తగ్గకూడదని భావించి, వారిద్దరూ కలిసి ఎన్నో దేవాలయాలను, యాత్రా స్థలాలను దర్శించుకున్నారు. సభలు, సమావేశాలకు వెళ్లడం, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక పుస్తకాలు చదవడం వారికి అలవాటుగా మారింది. అంతేకాకుండా, టీవీలో వచ్చే ఎన్నో ధారావాహికలు వారికి కాలక్షేపానికి తోడయ్యాయి. సెలవుల్లో ఇంటికి వచ్చే పిల్లలను, మనవలను ఎంతో గారబంగా చూసుకునేవారు. ఒకరి ఆరోగ్యంపై ఒకరు ఎంతో శ్రద్ధ తీసుకున్నప్పటికీ, ఒకరోజు సుభద్రకు పక్షవాతం వచ్చి శరీరంలోని కుడిభాగం స్వాధీనం తప్పడమే కాకుండా, మాట కూడా పడిపోయింది. చికిత్సలు ఫలితం ఇవ్వక మంచానపడ్డ సుభద్రను చూసి శ్యామరావుకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగినా, అది బయట పడనీయకుండా భార్య సేవలో నిమగ్నమయ్యాడు.

డైరీలోని తరువాతి పేజీలన్నీ ఖాళీగా ఉన్నాయి. అయినా కొన్ని పేజీలు తిరగేసిన సుమిత్రకు, నానమ్మ అనారోగ్యంతో మంచాన పడినప్పటి నుంచి తాతయ్య డైరీ రాయడం ఆపేశారని అర్థమైంది. అంతేకాకుండా, నానమ్మ అనారోగ్యం కారణంగా తన తండ్రి డెహ్రాడూన్‌లోని ఉద్యోగం వదిలి ఇక్కడికి తిరిగి రావాలని నిర్ణయించుకున్నప్పుడు, అమ్మ దానికి ఒప్పుకోవడం ఆమెకు గుర్తొచ్చింది. డైరీని మూసి పక్కన పెడదామనుకునే లోపు, అక్కడ ఆనాటి తేదీ వేసి ఏదో రాసి ఉండటం సుమిత్ర గమనించింది. 'బరువుదేనె నెప్పిగె, కూడిదొంద తప్పిగె, ఏనో ఏనో నూతవు, బదుకినెళగె జోతెవు. ఇబ్బగెగూ సోతవు, ఆసరాగి ఆతవు బరువుదేనె నెప్పిగె...' (జ్ఞాపకాలు వస్తున్నాయి... మనం కలిసిన ఆ వేళ... బతుకు పోగుల్లో పెనవేసుకున్న మన ప్రాణం... ఒకరి కోసం ఒకరం ఓడి... ప్రేమై గెలిచాం... నేడు ఒకరికొకరం ఆసరాగా నిలిచాం) – ఇవి ప్రసిద్ధ కవి బేంద్రే గారి కవితా పంక్తులు. ఆ తేదీని మళ్లీ చూసినప్పుడు ఆమెకు గుర్తొచ్చింది, ఆ రోజే తాతయ్య-నానమ్మల 50వ పెళ్లి రోజు. మళ్లీ డైరీ పేజీలు తిప్పుకుంటూ వెళ్తుంటే, చివరి పేజీలో పెద్ద అక్షరాలతో రాసిన ఒక వాక్యం సుమిత్ర కంట పడింది: 'బదుకు మాయెయ మాట' (బతుకు మాయాజాలం). అది శ్యామరావుకు ఎంతో ఇష్టమైన పద్యం. తన అమ్మ అప్పుడప్పుడు పాడుతుంటే సుమిత్ర కూడా ఆ పాటను నేర్చుకుంది. తాతయ్య కూడా

- మిగతా 7వ పేజీలో

## విశాలాంధ్ర

-బాబ్జీ



పల్లవి:

ఇదిగిదిగో ఇదేనండి విశాలాంధ్ర పత్రిక
ఇది ప్రజల కొరకు ప్రభవించిన వాస్తవాల వేదిక
ధనవంతుల జట్టుకట్టి జేజేలు పలుకకుండా
ప్రభుత్వాల పంచచేరి కరపత్రం కాకుండా
జనం కొరకు ఎగరేసిన ఆశయాల కేతనం
నిజం జర్నలిజం అంటు నినదించిన కీర్తనం ॥ఇదిగిదిగో॥

చరణం:1

మన హక్కుల పత్రంపై దొంగ సంతకాలు
మన అన్నం మెతుకులపై దోపిడీ హస్తాలు
ఎవరివి...అవి ఎవరివని
ప్రశ్నించే పాశుపతం- విశాలాంధ్ర పత్రిక
మన ఆలోచనల చుట్టు ఆంక్షల సంకెళ్లు
మన పెదవుల గుమ్మంలో లాఠీ తూటాలు
ఎందుకు...అసలెందుకని
నిలదీసే నిప్పుకణం- విశాలాంధ్ర పత్రిక
ఇది సగటు మనిషి గుండె చప్పుడు
ఇది సమర సమయ డప్పుల దరువు ॥ఇదిగిదిగో॥

చరణం:2

మన కన్నుల లోగిలిలో ముసిరిన భవితవ్యం
మన కలాల గళాలపై రాజ్యం దౌర్జన్యం
ఏమిటి... ఇది ఏమిటని
నిగ్గదీసే ధర్మాక్షరి- విశాలాంధ్ర పత్రిక
మన అడుగు జాడలలో రక్తపు కళ్లాపులు
మన ఆశల సౌధంపై నయవంచక దాడులు
ఎన్నాళ్లు...ఎన్నేళ్లని
గర్జించే సింహధ్వని- విశాలాంధ్ర పత్రిక
ఇది జర్నలిజం జంగ్ సైరను
ఇది అక్షరాల యుద్ధ కవాతు ॥ఇదిగిదిగో॥

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

(5వ పేజీ తరువాయి)

# ఒకే రాగం...

ఒకటి రెండుసార్లు ఆమెతో ఆ పాటను పాడించుకున్నారు. ఆ పాటను గుర్తుచేసుకుంటూ, తాను మెట్లు ఎక్కి వస్తున్నప్పుడు 'సాయంత్రం కాలేజీ నుంచి త్వరగా రావాలి' అని అమ్మ చెప్పిన మాటను తలచుకుని ఆమెలో సంతోషం కలిగింది.

కింద తలుపు తెరిచిన శబ్దం విని, నానమ్మను చూసుకోవడానికి నర్సు వచ్చింది కాబోలు అని, డైరీని చేత్తో పట్టుకుని తలుపు వైపు వెళ్తున్న సుమిత్రకు మెట్లు ఎక్కి వస్తున్న తాతయ్య శ్యామరావు కనిపించాడు. డైరీ ఉన్న చేతిని వీపు వెనుక దాచుకుని సుమిత్ర తాతయ్య వైపు చూసింది; ఆయన చాలా అలసిపోయినట్లు కనిపించాడు. 'ఏమైంది తాతయ్యా, అంత నీరసంగా ఉన్నారు? ఎక్కువదూరం వాకింగ్ చేశారా?' అని అడిగింది.

'నువ్వు తెచ్చిన గులాబీ పూల గుచ్ఛాన్ని నేనే తీసుకున్నాను. ఈరోజు మీ కాలేజీలో 'ఫేర్‌వెల్ పార్టీ' ఉందని చెప్పావు కదా, నువ్వు కాలేజీకి బయలుదేరేలోపు కొత్త పూలు తెచ్చి పెట్టాలని వెళ్లాను. ఇదిగో తల్లీ, తీసుకో,' అంటూ తాను తెచ్చిన గులాబీ గుచ్ఛాన్ని ఆమెకు ఇచ్చాడు. 'టీ కూడా తాగకుండా వెళ్లారు కదా తాతయ్యా, అలసిపోయినట్లు ఉన్నారు. నడక ఎక్కువైందా?' అని సుమిత్ర ఆందోళనగా అడిగింది. తాతయ్య మనవరాలిని ప్రేమగా చూస్తూ...

'అవునమ్మా, నడక కొంచెం ఎక్కువైంది. ఇక్కడ రోడ్డు పక్కన పూలు అమ్మే అమ్మాయి దగ్గర ఎర్ర గులాబీలు అయిపోయాయి, అందుకే మార్కెట్‌దాకా వెళ్లాల్సి వచ్చింది.'

'రండి తాతయ్యా, కూర్చోండి' అంటూ శ్యామరావు చేతిని పట్టుకుని గదిలోని కుర్చీ వరకు నడిపించింది సుమిత్ర. అప్పుడే నిద్రలేచిన సుభద్ర, మనసులోని ఆందోళననే కళ్లలో ప్రశ్నగా మార్చుకుని ఎడమచేత్తో సైగ చేసింది. భార్య వైపు తిరిగి శ్యామరావు, 'ఏమీ కాలేదు, కొంచెం ఎక్కువ దూరం నడవడంతో అలసటగా ఉందంతే' అన్నాడు. ఒంట్లో శక్తి లేకపోయినా, తన సంతోషం కోసం అంత దూరం మార్కెట్ వరకు వెళ్లి పూలు తెచ్చిన తాతయ్యను చూసి సుమిత్ర కళ్లలో నీళ్లు తిరిగాయి.

డైరీని టేబుల్ మీద పెట్టిన సుమిత్ర ఏదో ఆలోచనలో పడింది. సంబంధాల నిజమైన లోతును అర్థం చేసుకోకుండా, అపరిపక్వతతో, నేటి కాలంలో సంబంధాల లోతు తెలియని అపరిపక్వత పెరిగిపోయింది. కాలంతో పాటు మారని జీవిత విలువలను గుర్తించే తీరిక ఎవరికీ లేదు. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో ఆడంబరమైన పోస్టులు, కృత్రిమమైన మెచ్చుకోలు మాటలే జీవితం అనుకునే ఈ రోజుల్లో... యాభై ఏళ్లుగా జీవన సహచరులుగా ఉండి, ఆ బంధాన్ని పవిత్రంగా గౌరవించుకుంటూ, తమ సుదీర్ఘ ప్రేమానుబంధాన్ని ఒక్క గులాబీ పువ్వుతోనే సంబరంగా జరుపుకోవాలనుకున్న తాతయ్య-నానమ్మల నిరాడంబర జీవనం సుమిత్రకు అద్భుతమనిపించింది!

'తాతయ్యా, మీరు నానమ్మకు 'ఐ లవ్ యూ' అని చెప్పి ఈ పువ్వు ఇవ్వండి,' అంటూ అక్కడున్న గులాబీలను తీసుకుని, ఒక పువ్వును శ్యామరావు చేతిలో పెట్టి సుమిత్ర బలవంతం చేసింది. ఆ క్షణంలో కొంచెం తడబడిన తాతయ్య, మనవరాలి ఒత్తిడికి తలొగ్గాడు.

'ఐ లవ్ యూ,' అని సుభద్ర చేతిని పట్టుకుని శ్యామరావు గులాబీపువ్వు ఇచ్చినప్పుడు, ముడతలు పడిన అతని చేయి వణికింది, కళ్ళలో ఏదో తెలియని మెరుపు! నానమ్మ ఎడమచేతిలో ఒక పువ్వు పెట్టి దాన్ని తాతయ్యకు ఇవ్వమని చెప్పినప్పుడు, మంచంపై పడుకున్న సుభద్ర గుంతలు పడ్డ కళ్ళలోనూ అదే మెరుపు కనిపించింది! వారిద్దరూ ఒకరి చేతిని ఒకరు పట్టుకున్న ఆ క్షణంలో, కింద డ్రాయింగ్ రూమ్‌లోని టీవీ నుండి ఒక భావగీతం వినిపించింది.

ఇదే నేను...అదే నీవు స్వరాలమై ఒకే రాగంలో కలిసిపోవాలి. శృతిలయల మధుర గానమై మన బతుకు పాటగా మ్రోగిపోవాలి.

నానమ్మ-తాతయ్యల ప్రేమలోని ఆ సుందర క్షణాన్ని ఆస్వాదిస్తున్న సుమిత్ర, 'ఆదిత్య, ఛానల్ మార్చకురా!' అని గట్టిగా అరిచింది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# వసంతం

పవన్ కుమార్ దూడం
83744 03163

గవర్నమెంట్ మర్కజీ హైస్కూల్లో ఫస్టు బెల్లు మోగింది. అంటే టైం తొమ్మిదిన్నర అయింది. పది గంటలకల్లా ఫ్యాక్టరీకి పోకపోతే.. ఓనర్‌తోని తిట్ల దండకమే! సైకిల్ తాళం తీసి, ఎక్కి తొక్కబోతుంటే చెయిన్ పడ్డది. మనం ఎంత తొందరపడినా.. ఈ సైకిల్ చెయిన్‌లా పరిస్థితులు అప్పుడప్పుడూ మనల్నిట్ల వెనక్కు లాగుతుంటయ్. గ్రీజు మరకలు చేతులకు అంటకుంట కట్టెపుల్లతో తంటాలు పడుతూ వేస్తుంటే.. నా జేబులున్న నోకియా ఫోన్ మోగింది. ఎవరై ఉంటారో అనుకుంటూ ఫోన్ ఎత్తిన.

''హలో హుషిలాల్''.. అవతలివైపు నుంచి.

''కోన్ చీ (ఎవరు)?''

''మ భూక్యా వాతేఖరోచు
(నేను భూక్యను మాట్లాడుతానా)''

''క బియా.. కతాచి
(చెప్పు అన్న.. ఎక్కడున్నవ్)''

''రేడియోల వార్తలిన్నవా?'' భూక్య గొంతులో ఏదో గుబులు. నా మనసు కల్లిబిల్లి అయింది.

''లేదు బియా''

''నిన్న.. ఎన్ ఎన్.. కౌం టరు'' అని ఒక్కో అక్షరం కూడబలుక్కుని అన్నడు భూక్య.

అది వినంగనే నా చేతుల్లోంచి ఫోన్ జారిపడ్డది. కాళ్ల కింద భూమి చీలి అందులో కూరుకపోయినట్లు అనిపించింది.

''యాడీ...! (అమ్మా!)'' అని అప్రయత్నంగానే గట్టిగా అరిచిన.

పరిగెత్తుకుంటూ వెళ్లి, పాన్‌షాపుల న్యూస్‌పేపర్ కొన్నా. భయపడుకుంటూ ఒక్కో వార్త చూస్తున్నా.

'జలయజ్ఞం పనులపై ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సమీక్ష' అని హెడ్‌లైన్. దాని పక్కనే.. 'ఖమ్మం జిల్లాలో ఎన్‌కౌంటర్-నలుగురు మావోయిస్టులు మృతి' అని ఉంది.

'10 ఏప్రిల్ 2007 (ఖమ్మం) : నిన్న సోమవారం తెల్లవారుజామున ఖమ్మం జిల్లా అడవుల్లో పోలీసు బలగాలు చేపట్టిన కూంబింగ్ ఆపరేషన్‌లో నక్సలైట్లకు, పోలీసులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో తారక్క(43) అలియాస్ మంగ్యా..'

మిగతా వార్త చదవబుద్ధి కాలే! ఆ తారక్క మా అమ్మే. పేపర్ ముఖానికి పెట్టుకుని గుండెలవిసేలా ఏడ్చిన. వెంటనే బ్యాగు సర్దుకుని బస్టాండ్‌కు పోయి మహబూబాబాద్ బస్సెక్కిన. ఏడుపు కనపడకుండా దస్తీ కట్టుకుని వెనకాల సీట్లో కూచున్న.

మా యాడీ అంటే నాకు చిన్నప్పటి నుంచి మస్తు కోపం. నాకు ఏడాది వయసున్నప్పుడే నన్ను అమ్మమ్మకాడ వదిలేసి అడవుల్లోకి పోయింది. మాది మహబూబాబాద్ దగ్గర చిన్న తండా. తండాల అందరూ అయినవాళ్లే ఉన్నా.. అమ్మ లేని లోటును ఎవరూ పూడ్చలేక పోయిండ్లు. హన్మకొండల ఎస్టీ హాస్టళ్ల చదువుకున్నా. హాస్టళ్ల ఉన్నప్పుడు నా దోస్తుగాళ్లను చూసేటందుకు వాళ్ల అమ్మ-నాయనలు ఊకూకే వచ్చేవాళ్లు. నాకోసం మాత్రం ఎవలూ రాకపోయేది.

'ఒరే.. వీనికి అమ్మ ఉన్నా వదిలేసి పోయిందట' అని నన్ను ఎక్కిరించేటోళ్లు. ఆ మాటలు నన్ను హాస్టళ్ల ఒంటరిని చేసినయి. మా యాడీ మీద కోపంతోని సదువు మీద శ్రద్ధ పెట్టలేదు. సార్లతోని తిట్లు తినుకుంటూ, దెబ్బలు పడుకుంటూ పదో తరగతి పాసైన. హన్మకొండలనే గవర్నమెంటు కాలేజీలో ఇంటర్ చేసిన. డిగ్రీ కూడా ఇక్కడనే. ఈ సదువులు ఎందుకో నాకెక్కేది కాదు. అవి పనికి మాలినవని అనుకునేటోన్ని.

అందుకే డిగ్రీ అయిపోంగనే హన్మకొండ లష్కర్ బజార్‌లో రూమ్ తీసుకుని, బట్టల ఫ్యాక్టరీలో పనికి పోతానా. నెలకు ఐదు వేలు జీతం.

గతుకు రోడ్లపై బస్సు తూలుతూ కదుల్తోంది. అమ్మ ఆలోచనలు నన్ను తిర్గమర్గం చేస్తున్నయి. అమ్మను చివరిసారి కలిసినప్పుడు తన రూపాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా. మూడేళ్ల కిందట 2004లో నేను డిగ్రీ మొదటి సంవత్సరం సదువుతున్నప్పుడు ఓసారి నన్ను చూడ్డానికి అమ్మ వచ్చింది. అప్పుడు హైదరాబాద్‌లో చర్చలు జరిపేటందుకు నక్సలైట్లను ప్రభుత్వం ఆహ్వానించింది. అదే టైంలో మా యాడి నన్ను కలిసింది. చీకట్లో మా తండావోళ్లు నలుగురైదుగురు వెంటరాగా.. నా అడ్రసు తెలుసుకుని నాకాడికి వచ్చింది. ఆమె మా అమ్మేనని నేను గుర్తు పట్టలేకపోయిన. ఏ కొడుకుకు-తల్లికి రాకూడని దుస్థితి కదా ఇది! అమ్మ నన్ను కౌగిలించుకుని ముద్దు పెట్టుకున్నది. నా గుండె చెరువైంది. అమ్మ మీద కోపం కూడా వచ్చింది.

''ఎట్లున్నవ్ బిడ్డా!? మంచిగ సదువుకుంటున్నవా!?''

''మంచిగనే ఉన్న. గిప్పుడు యాదికొచ్చిననా?''

''అది కాదు బిడ్డా''

''నీ అసోంటి కసాయి తల్లిని నేను సూడలే''

అమ్మ గొంతు నుంచి మాట రాలేదు. ఏడుస్తున్న శబ్దం మాత్రం వినిపిస్తోంది.

''ఇప్పుడు ఎందుకు వచ్చినవ్'' అని నా కోపాన్నంత వెళ్లగక్కిన.

''గట్లంటవేందిరా హుషి.. మీ అమ్మ నిన్ను కలవడానికి కష్టపడి వస్తే..'' అని ఎవరో కసురుకున్నరు.

''మరి ఏం చేయమంటవ్. నీ పాటికి నువ్వు పోయి అడవులల్ల తిరుగు! నేను సచ్చిన్నో బతికిన్నో నీకెందుకు'' నా కళ్ల నుంచి సుడులు తిరుగుతూ నీళ్లు రాలినయ్.

''అది కాదు కొడుకా'' అని నా చేతులు ముట్టుకోడానికి ప్రయత్నించింది.

నేను ఏడుస్తూనే ఛీదరించుకున్న.

''ఇగో కొడుకా! గివ్వి ఉంచుకో.. పుస్తకాలు గిట్ల ఏమన్నా కొనుక్కో'' అని రెండు వంద నోట్లు నా చేతుల్ల పెట్టింది. నేను వాటిని విసిరికొట్టిన. ఎవరో.. 'తీసుకో బిడ్డా!' అని నా జేబులో కుక్కారు. అప్పుడే పోలీసుల పెట్రోలింగ్ సైరన్ వినపడ్డది.

''సరే ఇగ.. ఆలస్యం చేస్తే ఎవలికన్నా తెలుస్తది. అందరికీ ప్రమాదం. వెంటనే పోదాం'' అన్నరు.


''సరే బిడ్డ.. నీకు నా మీద ఎంత కోపం ఉన్నా.. సదువు మీద సూయించకు బిడ్డ. మంచిగ సదువుకో'' అని నా గదవకు ఐదువేళ్లు ఆనిచ్చి ముద్దుచుకుంటూ చెప్పింది. మల్ల మల్ల చూసుకుంటూ చీకట్లో కలిసిపోయింది. ఆ పది నిమిషాలే అమ్మను చివరిసారి చూడటం. మళ్లీ కనపడలే!

* * *

నేను తండాకు పోయేసరికి చాలామంది వచ్చున్నరు.

''తారక్క కొడుకు వచ్చిండు!'' అని ఎవరో అనంగనే.. నా చుట్టూ చాలామంది గుమిగూడిన్రు.

''నువ్వేనా మా తారక్క



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కొడుకువు. ఎంత గొప్ప మాతల్లి తారక్క. ఆయవ్వ కడుపున పుట్టినోడివి. పుణ్యాత్ముడివి'' అని నన్ను కౌగిలించుకుని ఏడ్చింది ఓ ముసలామె.

ఆమె ఎవలో నాకు తెలవదు. మా గుడిసె ముందు టెంట్ వేసిర్రు. అమ్మ (శవం) ఇంకా రాలేదు. పోలీసులతో మాట్లాడి తీసుకురావడానికి మా తండాల పెద్ద మనుషులు వెళ్లారట.

జనం చాలామంది వస్తూ ఉన్నరు. వాళ్లలో చాలామంది ఎరుపు చొక్కాలు, ఎరుపు చీరలే కట్టుకున్నరు. గొంగడి వేసుకుని, తలకు ఎర్ర రుమాల్ సుట్టుకుని, గజ్జెలు కట్టుకుని కళాకారులు పాటలు అందుకున్నరు.

'ఓ అరుణ పతాకమా..
చేగొనుమా రెడ్ సెల్యూట్!
శ్రమ జీవుల కేతనమా..
ఇదిగిదిగో రెడ్ సెల్యూట్!
మృతవీరుల త్యాగ ఫలితమే..
నీ వర్ణం ఎరుపయ్యింది!
నీ రెపరెపలను వీక్షిస్తుంటే..
మా రక్తం ఉప్పొంగింది!'

* * *

పోస్టుమార్టం జరిగాక మధ్యాహ్నం మూడు గంటలకు అంబులెన్సులో అమ్మ నిర్జీవంగా ఇంటికి వచ్చింది. అమ్మను దింపగానే ఏడుపులతో తండా అంతా ఘొల్లుమంది.

''తారక్క.. అమర్ రహే'' నినాదాల నడుమ తండా వాతావరణమంతా ఎరుపెక్కింది. ఎవరో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు అంట.. ఆయనొచ్చి అమ్మకు నివాళులు అర్పించిండు. నాకాడికొచ్చి నన్ను దగ్గరకు తీసుకుని..

''ధైర్యంగుండు తమ్ముడా! నీకు మేమున్నం!'' అన్నడు. మీడియా ముందుకు వెళ్లి..

''చర్చలకు అని పిలిచిన ప్రభుత్వం.. చర్చలను సఫలం చేయలే కానీ, అన్నలొచ్చిన దారిని పహారా కాసి, ఒక్కలొక్కళ్లను కాల్చుకుంటూ పోతాంది. నిర్బంధం ఎక్కువైంది. ఈ మూడేళ్లలో ప్రభుత్వం చేస్తున్న హత్యల్లో మరో తార రాలిపోయింది. పౌర హక్కులను కాలరాస్తూ బూటకపు ఎన్‌కౌంటర్లను చేస్తోంది'' అని ఆవేశంగా మాట్లాడిండు. ఆయన ఏం మాట్లాడుతున్నడో నాకప్పుడు అర్థం కాలేదు. ఒక్క 'తార రాలిపోయింది' అన్న మాట తప్ప. ఆ తార మా యాడీనే. నా కళ్ల నీళ్లు ఆగలే.

ఓ టీవీ ఛానల్ జర్నలిస్టు మైకు పట్టుకుని నా దగ్గరికొచ్చి..

''జనం గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే తారక్క కొడుకు ఇతనే'' అంటూ నన్ను చూపెడుతున్నడు. నాకు లోలోపల ఏదో పెద్ద పాపం చేసినట్లు అనిపించసాగింది. అమ్మ ఎందరికో గుండె ధైర్యం. ఒక విప్లవ జ్యోతి. ఒక ఉద్యమకారిణి. కానీ, నాకు మాత్రం నన్ను విడిచి వెళ్లిపోయిన ఓ క్రూరురాలు. తండ్రిలేని బిడ్డనొదిలి తన దారి తాను చూసుకున్న ఓ ద్రోహి. అట్లాంటి మా అమ్మ గురించి అందరూ ఇంత గొప్పగా మాట్లాడుతున్నారేంది? వీళ్లు ఎందుకు ఇంతలా ఆరాధిస్తున్నరు? ఆమె ఏం చేసింది? కన్న బిడ్డను పట్టించుకోని మహిళ.. వీళ్లకు ఎందుకు దేవతయింది? ఈ ప్రశ్నలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేసినయ్.

అమ్మను చివరిసారి కలిసినప్పుడు నా ప్రవర్తన నాకిప్పుడు వాంతి కలిగిస్తాంది. అమ్మ గురించి పూర్తిగా తెలుసుకోవాలని నాలో నేను గట్టిగా అనుకున్నా. అంతకుమునుపు అమ్మమ్మను అడిగితే..

'మీ నాయన సచ్చిపోయిండు. మీ అమ్మ అడువుల్లోకి పోయింది' అని చెబుతుండేది. అంతకు మించి ఆ ముసల్ది నాకు ఏం చెప్పకపోతుండే.

ఆకాశంలో సూరీడు పడమర దిక్కుకు తరులుతుండగా.. అమ్మ అంతిమయాత్ర మొదలైంది. సుట్టుపక్కల తండాలతోపాటు, మిగతా ఊర్ల నుంచి మస్తుమంది వచ్చిర్రు. ఇసుకేస్తే రాలేదేమో అన్నట్లుగా జనం, మధ్యలో పోలీసులు. పాటలు పాడుకుంటూ, డప్పులు కొట్టుకుంటూ, నినాదాలు చేసుకుంటూ.. యాడీని శ్మశానానికి తీసుకుపోయిర్రు. మా ఆచారం ప్రకారం.. ఎవరు చనిపోయినా పూడ్చిపెడతం. కానీ, మా అమ్మ తనను కాల్చేయాలని అడవిలో ఉన్నప్పుడు ఊకే అంటూ ఉండెనట. ఇదే ముచ్చట ఏవో కాగితాల్లో కూడా రాసుకుంటుండెనట. ఈ విషయం చెబుతూ ఓ కవర్‌ను నా చేతుల పెట్టింది ఒకామె. ఆమె పేరు శాంతక్క. మాజీ నక్సలైట్. గతంలో అమ్మతోని కలిసి అడవుల్లో తిరిగిందట. ఆరోగ్యం సహకరించక ఐదేళ్ల కిందటన్నే పోలీసులకు లొంగిపోయింది. ఇప్పుడు ఆమె హక్కుల కార్యకర్త.

''దీంట్ల మీ అమ్మ వస్తువులున్నాయి'' అన్నది శాంతక్క. అసంకల్పితంగానే దాన్ని గుండెలకు అద్దుకున్నా.

* * *

సంధ్య వెలుగులను మింగేస్తూ చీకట్లు ముసురుకుంటుండగా.. అమ్మ శరీరం చితి నిప్పుల్లో కాలిపోయింది. చివరి చూపుకోసం అన్నట్లు ఆకాశంలో నక్షత్రాలు ఆరోజు ఎందుకో మరింత చిక్కగా మెరిసినట్లు కనిపించినయ్. అమ్మ కోసం వచ్చినోళ్లంతా ఎవలింటికి వాళ్లు వెళ్లిపోయిండ్రు. శాంతక్క మాత్రం తండాలనే ఉన్నది.

''పెద్దమ్మా.. మా యాడీ అన్నలల్లకు ఎందుకు పోయింది. నేను ఆమె కొడుకును. కానీ, నాకు మా అమ్మ గురించి ఏం తెల్వది. నువ్వన్నా చెప్పు'' అని చేయి పట్టుకుని శాంతక్కను అడిగిన.

''చెప్తా బిడ్డా.. చెప్తా! మీ అమ్మ గురించి నువ్వు తెలుసుకోకపోతే ఎట్లా'' అని మంచంలో కూసొని చెప్పడం మొదలుపెట్టింది పెద్దమ్మ.

* * *

''మీ అమ్మానాయిన మంగ్యా-కిషన్. సూడ సక్కని సుక్కసొంటి జంట. మీ నాయిన మంచి మాటకారి. మీ అమ్మ.. మీ నాయినకు మేన మరదలే. ఆమెది కూడా ఇదే తండానే అయేసరికి పెళ్లి చేసిండ్లు. మీ అమ్మ చాలా సిగ్గరి పిల్ల. తక్కువ మాట్లాడేది. మీ అమ్మానాయినలిద్దరూ తండాల అందరినీ మనోళ్లే అనుకునేటోళ్లు. ఎవలికేం ఆపద వచ్చినా అర్సుకునేటోళ్లు. చేతనైనంత సాయం చేసే



'నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీపీఠం'
సంయుక్తంగా నిర్వహించిన
'కథల పోటీ-2025'లో రూ.2వేల
బహుమతి పొందిన కథ.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

టోళ్లు. వాళ్లకు పెళ్లయిన రెండేళ్లకు నువ్వు పుట్టినవు.

తాతల నుంచి వస్తున్న ఐదెకరాల భూమిని సాగు చేసుకుంటూ.. ఉన్నదో లేదో అన్నట్లు బతుకు తుండేటోళ్లు. అది 1986. ఎన్టీయార్ ముఖ్య మంత్రిగా ఉన్న సమయం. నక్సలైట్లే నిజమైన దేశ భక్తులని పీఠమెక్కి.. ఆ నక్సలైట్ల మీదనే విరుచుకు పడుతున్న ఘడియలవి. తండాలకు ఆఫీసర్లు వచ్చిండ్లు. ఏవో పత్రాలు సూపెట్టిండ్లు.

'మీరు సాగు చేసుకుంటున్న భూములు.. దొర భూములు. వెంటనే ఇడిసి పోవాలి' అన్నరు.

తండోళ్లకు ఏమర్థం కాక నోళ్లు ఎల్లబెట్టిండ్లు.

'అట్లంటే ఎట్ల సారూ.. గీ భూములను మా అవ్వయ్యల కాలం సంది సాగు చేసుకుంటూ రాబడ్తిమి' అన్నరు.

'అవ్వన్నీ దొంగముచ్చట్లు.. నిజాం కాలంల ఈ భూములన్నీ దొరోళ్లయే ఉండే! సాయుధ పోరాటం అని కబ్జా చేసిండ్లు' అన్నరు.. దొర లంచం సొమ్ము తిన్న అధికారులు.

మాటా మాటా పెరిగింది.

'దొర లేడు! ఎవ్వడు లేడు! మేం భూములు వదిలే ముచ్చట్నే లేదు' తెగేసి చెప్పిండు కిషన్.

'ఏం వాగుతున్నవ్రా..' అని దొర తన చెప్పును మీదికిసిరిండు.

గంతే.. తన చేతులున్న కర్రతోని దొర తలమీద కొట్టిండు కిషన్. నెత్తురు చిమ్మింది.

'మీ ముందే నన్ను సంపడానికి సూసిండు.. వాణ్ని వదలద్దు'.. పోలీసులతోని అన్నడు దొర.

కిషన్‌ను అరెస్టు చేసి పట్టుకపోయిండ్లు. దొర పగ.. పాము పగ కన్నా ఎక్కువ అంటుండే! పారి పోతుండగా ఎన్‌కౌంటర్ చేసినమని కిషన్ శవాన్ని తండాకు పంపిండ్లు. పుట్టెడు శోకంతో మీ అమ్మ.. విధవరాలైంది. తండాలంతా భయం జొచ్చింది.

అప్పటికి అయిపోలే.. కొన్నిరోజులకే మళ్లా తండాలకు పోలీసులను తోలిండ్లు.

దొరికినోళ్లను దొరికినట్లు కుక్కను కొట్టినట్లు కొట్టి.. భూములు వదిలి వెళ్లమన్నరు. అంతల్నే.. ఈ సంగతి అన్నల దాకా ఎట్ల పోయిందో ఏమో.. రానే వచ్చిండ్లు. పట్నం పోతున్న దొరను కాల్చి చంపిండ్లు. దొర దగ్గరి పత్రాలను తెచ్చి తండాల కాలబెట్టిండ్లు.

'మీకు మేమున్నం భయపడొద్దు' అన్నరు.

అప్పుడే మీ అమ్మ.. 'నేను మీతోని వస్తానన్న' అని అన్నలతోని బయలెల్లింది.

భూస్వాముల చేతుల్లో చిక్కుకున్న నిరంకుశ రాజ్యంలో విముక్తి కావాలంటే సాయుధులవ్వడమే మార్గమని నమ్మింది. నోటి మాట బయటకు రాని మంగ్యా అలియాస్ తారక్క.. అరుణ వర్ణం పులు ముకున్న మహా విప్లవమైంది. అడవి బాటలో ఆయుధం చేతపట్టింది. తన తండాలాగా దోపిడీకి గురవుతున్న వర్గాలకోసం పోరాడాలని నిశ్చయిం చుకుంది. ఏడాది బిడ్డను పుట్టింట్లో వదిలి స్వేచ్ఛ కోసం అడుగులు వేసింది. అడివిలనే చదువు నేర్చు కుంది. 1 ఆఫ్ 70 లాంటి చట్టాలున్నా అమలుకు నోచుకోని చోట బందూకై పేలింది. పీడిత వర్గాల గొంతులో విప్లవగీతమై నినదించింది.

ఓ మామూలు దళ సభ్యురాలిగా చేరిన తారక్క.. దళ కమాండర్‌గా, రాష్ట్ర కమిటీ మెంబర్‌గా చేసింది. అనేకసార్లు శత్రువుతో పోరాడి ప్రాణాలతో బయట పడింది. గిరిజనుల, ఆదివాసుల భూములు గుంజు కోవడానికి చూసిన భూస్వాములకు పీడకలైంది. ఎంత చేసినా.. అన్ని రోజులు మనవే అవ్వవు కదా బిడ్డా..! అలాంటి చెడ్డరోజు రానే వచ్చింది. ఇన్ ఫార్మర్ల కుట్రతో నిన్న అన్నల స్థావరంపై 'శత్రువు' దాడి చేయగా.. మీ అమ్మ తారక్క అమరురా లైంది'' అని చెప్పి నా వంక చూసింది శాంతక్క. అప్పటికే నా కళ్లు ఊటబాయిలైనయి.

''నువ్వు అనుకున్నట్లు మీ అమ్మ కసాయిది కాదు బిడ్డా.. అత్యంత ప్రేమగల్లది. గందుకనే కదా..! అన్నీ ఇడిసిపెట్టి, గుట్టలపుట్టల బాట పట్టింది'' అంది.

అప్పుడే అమ్మ రాసుకున్న కాగితాలు చదివిన.

'బిడ్డా..!

నువ్వు నా కడుపులో పడ్డప్పుడు మీ నాయినా, నేను ఎంతో సంబురపడ్డం. నెత్తురు పూసుకున్న ఎర్రని మందార పువ్వోలే నువ్వు నా ఒడిలో చేరిన ప్పుడు.. మా ఆనందం అలుగులై పారింది. నీ భవిష్యత్తుపై ఎన్నో కలలను కట్టుకున్నం. మీ నాయిన ఉసురు తీసి, మా కలలన్నింటినీ బూడిద చేసింది దోపిడీ రాజ్యం. నువ్వు ఈ రాతల్ని చదివే సమయానికి నేను కూడా రాజ్యపు కుట్రలకు బలై పోయుంటానని నాకు తెలుసు.

కానీ బిడ్డా.. ఇది గుర్తుపెట్టుకో..

ఎక్కడైతే హక్కులు కాలరాయబడుతాయో..

ఎక్కడైతే అసత్యం సత్యంగా వర్ధిల్లుతుందో..

ఎక్కడైతే సమన్యాయం కొరవడుతుందో..

ఎక్కడైతే నీతిలేని విధానాలు విశృంఖలత్వాన్ని ప్రదర్శిస్తాయో.. అక్కడ అశాంతితో రగిలిన హృద యాలు.. కన్నీటి నావను దాటి, ఏనాటికైనా పోరాట పంథా తొక్కుతయి. స్వేచ్ఛా వాయువులు అందించడానికై ఆరాటపడతయి. అలా ఆరాటపడ్డ నన్ను అడవితల్లి 'రావే బిడ్డ' అని పిలిచింది. నీ ఆలనా పాలనా చూడాల్సిన వేళ నిన్నొదిలి తుపాకీ భుజానికెత్తిన. తల్లి ప్రేమకు నోచుకోక నా ఒక్క బిడ్డ పడే బాధ కన్నా.. ఈ పేదోళ్లందరి బతుకులు మారా లని ఆశపడ్డ. అందుకే నిన్ను ఒంటరిని చేసిపో యిన. బిడ్డా.. నన్ను క్షమించు. ఈ తల్లిని క్షమించు. అడవిబిడ్డల మీద జులుం చేసే ఈ దోపిడీగాళ్లు.. మన దగ్గర చదువు లేదని విర్రవీగుతరు. నువ్వు బాగా చదువుకోవాలె. చదువే మన బతుకుల్ని మారుస్తది. మన గోసల్ని తీరుస్తది..

– మీ యాడి'

అది చదివినంక నా కళ్లలో ఉబికిన నీళ్లు కాయి తాలపై పడినయ్. నలిగిపోతదని దాన్ని నా అంగికి ఇంకేటట్టు ఒత్తిన. నోటితో ఉఫ్‌మని ఊదిన. ఆ సమయంలో నా తల్లీతండ్రి సావుకు కారణమైన 'రాజ్యం' మీద పట్టరానంత కోపమొచ్చింది. పళ్లు పటపటమని కొరికిన. నా కళ్లలోంచి బయటికొ స్తున్న సెగ నాకే భగ్గుమని తగిలింది. అమ్మ రాసు కున్న మాటలు నా చెవుల్లో మళ్లీ మళ్లీ మోగినయ్.

''ఇదంతా నీకు తెలిస్తే నీ మనసు నొచ్చుకుంట దని గీ ముచ్చట్లేవీ ఎక్కువ చెప్పొద్దని మీ అమ్మమ్మ తోని మీ అమ్మ మాట తీసుకున్నది. గందుకే.. ఆ ముసలామె నీకు ఏం చెప్పలేక పోయింది'' అని నా గదువ పట్టుకుని చూసింది పెద్దమ్మ.

''అవు బిడ్డా!'' అమ్మమ్మ ఏడ్సుకుంటా అన్నది.

శాంతక్కను చూస్తూ..

''మా యాడీబావు (అమ్మానాన్న) సావుకు కార ణమైన ఈ వ్యవస్థను మార్చాలి'' అన్నాను.

''ఏంది బిడ్డా? నువ్వు కూడా అడవుల్లోకి పోత నంటవా ఏంది?'' అనుమానంగా అడిగింది.

''లేదు. నేను చదువుకుంటా. ఈ అసమానత లను అరికట్టేందుకు గన్నులతో ఇప్పుడు పనిలేదు. నాకిప్పుడు పుస్తకం కావాలి. నేను ఐఏఎస్ అవుతా. చట్టాలను సక్రమంగా అమలు చేసే అధికారిని అవుతా. ప్రభుత్వ పథకాలను అట్టడుగు ప్రజలకు చేరేటట్లు చూస్తా. లంచగొండులను తూర్పార పడతా. గిరిజన ఆదివాసీ జీవితాల్లో వసంతం తీసు కొస్తా!'' అని చెప్పిన.

నా మాటల్లో తీవ్రతను గమనించిందేమో..

''శెభాష్ బిడ్డా!'' అని నా భుజం తట్టింది శాంతక్క. అమ్మ కవర్లో నుంచి పెన్నును తీసి నా చేతికిచ్చింది.

''విప్లవం'' అని పిడికిలి ఎత్తింది.

''వర్ధిల్లాలి'' అని నేనూ.. పెన్నెత్తి అన్నా!

* * *

మూడేళ్ల తర్వాత..

''ఇదిగోండి ఇదే ఆ పెన్ను''.. అంటూ, యూపీ ఎస్సీ సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూ ప్యానెల్ ముందు టేబుల్‌పై పెన్ను పెట్టాడు ధరావత్ హుషిలాల్ నాయక్. 'మారుమూల తండా నేపథ్యం నుంచి ఢిల్లీ వరకు రావడానికి గల ప్రేరణేంటి?' అని అడి గిన ప్రశ్నకు సమాధానంగా.. తన ప్రయాణాన్ని ఈ విధంగా చెప్పుకొచ్చాడు అతను. అప్పుడే.. తన మనసు లోతుల్లో 'అమ్మా! నీకు వందనం' అని ప్రణమిల్లాడు. ■

## పవన్ కుమార్ దూడం



పీడిత ప్రజల పక్షాన పోరాడే మహిళా మావోయిస్టుకు కొడుకు ఉంటే.. అతని మనఃస్థితి ఎలా ఉంటుంది? భవిష్యత్తులో అతను ఎలాంటి మార్గంలో పయనిస్తాడు? అనే రచయిత ఆలోచనకు అక్షర రూపమే.. 'వసంతం' కథ. రచయిత పవన్ కుమార్ దూడం. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని కట్కూరు ఈయన సొంతూరు. 2020లో పాత్రికేయ రంగంలోకి వచ్చారు. ప్రస్తుతం ఓ ప్రముఖ మీడియా సంస్థలో ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. బాల్యం నుంచే వివిధ పత్రికల ఆదివారం అనుబంధంలో వచ్చే కథలను చదివి, వాటి మీద ఇష్టం పెంచుకున్నారు. అలా సాహిత్యరంగం లోకి అడుగుపెట్టారు. సామాజిక మాధ్యమాల్లో చిన్నచిన్న కథలు రాస్తుంటారు. నమస్తే తెలంగాణ ఇ-ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీలో బహుమతి గెలుచుకోవడం ఇది రెండోసారి. అంత కుముందు 2022లో రాసిన 'పిల్లి' కథకు ప్రత్యేక బహుమతి అందుకున్నారు.


ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఈవారం కథ



• మావూరు విజయలక్ష్మి

# సిమెంట్ సమాధులు



ఆకాశహర్మ్యాల మధ్య 'స్వర్ణ విహార్' అపార్ట్‌మెంట్ ఒక ఆధునిక కోటలా నిలబడి ఉంది. 'బొయ్...'మంటూ సైరన్ మోగుతూ అపార్ట్‌మెంట్ గేటు ముందు ఆగింది అంబులెన్స్. స్ట్రెచర్ మీద డెబ్బై ఏళ్ల రామారావు నిర్జీవ శరీరం నిశ్చలంగా నిద్రపోతున్నట్టుగా ఉంది. తన కష్టం, సుఖం, బాధ, భయం, కోపం, దుఃఖం అన్నిటికీ వేదిక అయిన తన ఇంటిని కడసారి చూసుకోడానికా అన్నట్టు... పూర్తిగా మూసుకుపోకుండా అరమోడ్పులుగా ఉన్నాయి ఆయన కనులు.

కన్నీళ్లు తుడుచుకుంటూ అంబులెన్స్ దిగాడు రవి– రామారావు గారి కొడుకు. అతనితో పాటు ప్రాణంలేని బొమ్మలా నీళ్ళింకిపోయిన కళ్ళతో రామారావు గారి భార్య, మరో ఇద్దరు బంధువులు, అంబులెన్స్ సిబ్బంది కలిసి రామారావు దేహాన్ని అపార్ట్‌మెంట్ గేట్ లోపలకు తీసుకొచ్చే ప్రయత్నంలో ఉండగానే, వీళ్ళ కోసమే కాచుకొని ఉన్నట్టు గబగబా ఎదురొచ్చాడు సెక్యూరిటీ గార్డు.

''సార్... అది... అయ్యగారి శవాన్ని లోపలకు తీసుకురానివ్వద్దని కమిటీ వాళ్ళు చెప్పారండి'' నెమ్మదిగా అన్నాడు.

మొదట అతనేం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు రవికి. అర్థమైన తరువాత నోట మాట రాలేదు. అతని కూడా వచ్చిన బంధువులే తేరుకొని, ''అదేంటయ్యా! ఇదెక్కడి విడ్డూరం! అతని బాడీని అతనింటికి తీసుకురాకుండా ఎక్కడకు తీసుకెళ్ళమంటారు?'' అన్నారు.

''ఏమో సార్! ప్రెసిడెంట్ గారు చెప్పమన్నదే చెప్పాను...'' అన్నాడు గార్డ్.

ఇంతలోనే అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజశేఖర్, మరికొందరు సభ్యులు కలిసి వచ్చారు.

''చూడు రవి, మాకు విషయం తెలిసింది. బాడీని లోపలికి తీసుకురావడానికి వీల్లేదు.'' కచ్చితంగా చెప్పారు.

''ఏం మాట్లాడుతున్నారు సార్? ఇది నా ఇల్లు. నా తండ్రి పార్థివ దేహాన్ని నా ఇంట్లోకి తీసుకురావడానికి మీరెందుకు అడ్డం పెడుతున్నారు?'' బాధ, కోపం, ఉక్రోషం, నిస్సహాయత కలగలిసిన గొంతుతో అన్నాడు రవి.

''ఇది నీ ఒక్కడి ఇల్లు కాదు రవి. ఈ కాంపౌండ్ లో ఇరవై కుటుంబాలు ఉన్నాయి. ఇంతమంది ఉన్న దగ్గర శవాన్ని తీసుకొచ్చి ఇంట్లో పెడితే అందరికీ ఇబ్బందికరంగా ఉంటుంది. వచ్చే పోయే వాళ్ళందరికీ అపశకునంగా, అశుభంగా, సెంటిమెంట్‌గా భావిస్తారు'' అన్నారు వాళ్ళు.

అందేంటి సార్ అలా మాట్లాడతారు!? ఇన్నేళ్ళు మీతో కలిసి, మెలిసి తిరిగిన మనిషి. ఇప్పుడు ప్రాణం పోయేసరికి అతని శరీరం అంత భయంకరం, అపశకునం అయిపోయిందా? అన్నారు బంధువులు.

''ఏమోనండి! అవన్నీ మీరడక్కూడదు. మా అపార్ట్‌మెంట్‌కి కొన్ని రూల్స్ ఉన్నాయి. దాని ప్రకారం నడుచుకోవలసిందే. సెంటిమెంట్లు పక్కన పెట్టినా, ఇళ్ళ మధ్యలో ఇలాంటివి జరిగితే ఇంటి విలువ పడిపోతుంది. అసలే ఇప్పుడు ఇద్దరు ముగ్గురు ఇళ్ళను అమ్ముకోడానికి బేరం పెట్టుకున్నారు. ఈ సమయంలో ఇలాంటివి ఇక్కడ జరిగితే అశుభంగా భావించి ఆ ఇళ్ళు చెల్లుబాటు కావు. పైగా వచ్చే నెలలో ఇక్కడ ముగ్గురు పెళ్లిళ్లు పెట్టుకున్నారు. వాళ్లకు కూడా అపశకునంగా ఉంటుంది...'' మానవత్వం అన్నది ఏ కోశానా లేకుండా అన్నారు వాళ్ళు.

''మరీ అలా మాట్లాడకండి సార్. సెల్లార్‌లో ఒక పక్కన కాస్త టెంట్ అడ్డంగా కట్టేసి, ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా బాడీని పెట్టుకుంటే తప్పేంటి? ఇంత పెద్ద సెల్లార్‌లో ఇటు చివర బాడీని పెట్టుకుంటాం. జనమంతా అటు పక్కనుంచి తిరుగుతారు. దానివలన ఎవరికేం ఇబ్బంది కలుగుతుంది. అపశకునం కలుగుతుంది? వచ్చే బంధువులందరికీ చివరి చూపయినా దక్కాలి కదా. పోయినాయనకు కాస్త స్నానం, పూజలాంటి కార్యక్రమాలు, ఆచారాలు నిర్వహించాలి కదా!'' వాదనకు దిగారు చనిపోయినాయన బంధువులు.

''ఏమో... అదంతా మాకు తెలీదండి. కావాలంటే గేట్ లోపలకు తీసుకురాకుండా ఈ బిల్డింగ్ ముందే రోడ్డు మీద టెంట్ వేసి పెట్టుకోండి. లేదంటే పక్కనే ఉన్న ఖాళీ స్థలం ఉంది కదా అందులోనో లేదా శ్మశానం షెడ్డులోనో ఉంచండి. అంతేగాని గేట్ లోపలి తీసుకురావడానికి మాత్రం కుదరదు'' మూర్ఖత్వానికి పరాకాష్ఠగా అన్నారు కమిటీ వాళ్ళతో పాటు మరో ముగ్గురు నలుగురు.

''అన్యాయంగా మాట్లాడకండి. శవాన్ని గేట్ బయట పెట్టడమేంటి? ఉన్నప్పుడు సంబంధాలు కొనసాగించడమే కాదు. పోయిన తరువాత ఆ నిర్జీవ శరీరాన్ని కూడా అంతే గౌరవంగా పంపించాలని చెబుతున్నాయి మన శాస్త్రాలు. పవిత్రత గురించి, శకునాల గురించి, ఆచారాల గురించి ఇంతలా చెబుతున్నారు. మీకు ఆ మాత్రం తెలీదా? ఒక శవానికి జరగవలసిన సంస్కారాలు, ఆచారాలు జరగనివ్వకపోతే ఆ పాపం కూడా చుట్టుకుంటుంది.'' చివరి అస్త్రంగా అన్నారు బంధువులు.

ఈ చివరి మాటతో కాస్త తగ్గారు బిల్డింగ్ పెద్దలు. కాని తాము పట్టిన పట్టు మాత్రం వదల్లేదు.

ఇక్కడిలా వాదన జరుగుతుంటే, అప్పటికే తమకు ఆలస్యమవుతుందని విసుక్కుంటున్న అంబులెన్స్ వాళ్ళు, ''సార్! ఈ గొడవ ఎప్పుడు తేలుతుందో... మేం వెళ్ళాలి సార్!'' అని చెప్పి,

ఒకప్పుడు ఆ పరిసరాలన్నీ యథేచ్ఛగా తిరిగి, గార్డెన్‌లో ఎక్కడ ఏ మొక్క వంగినా, వాలినా దానిని సరిచేసి; ఎక్కడ ఏ గోడకి, గచ్చుకి చిన్న పెచ్చూడినా వెంటనే సరిచేసి, తీర్చిదిద్దిన రామారావుగారి దేహాన్ని అక్కడే రోడ్డు మీద దించేసి వెళ్ళిపోయారు.

''నాన్నా.. నన్ను క్షమించు నాన్నా... బ్రతికి ఉన్నంత కాలం,నువ్వు అద్దంలా తీర్చిదిద్దిన ఈ భూమ్మీద నీ చివరి స్పర్శ ఇవ్వలేకపోతున్నాను'' అని రవి ఏడుస్తుంటే... అపార్ట్‌మెంట్ ఇళ్ళలోంచి వస్తున్న టీవీల శబ్దాలు, ఎవరి పనుల్లో వాళ్ళు వెళ్ళిపోతున్న హడావిడిలో నిశ్శబ్దంగా కలిసిపోయింది రవి ఆక్రోశం.

'అయ్యో! బతికున్నంతకాలం హాయిగా అందరితో ఎంతో ఆత్మీయంగా బతికిన నీకు, ప్రాణం పోయిన తరువాత ఈ అవమానమేంటయ్యా! ఒకప్పుడు పార్వతీ పరమేశ్వరుల్లా ఉన్నారంటూ నీ కాళ్ళంటి ఆశీర్వాదాలడిగిన వీళ్ళకు నీ నిర్జీవ శరీరం అపశకునం అయిపోయిందా!? భగవంతుడా... ఏంటీ ఘోరం!' నిశ్శబ్దంగా కుమిలిపోతోంది రామారావు గారి భార్య.

ఇంతలో... జరుగుతున్న ఘోరం చూడలేని ప్రకృతి విలపిస్తున్నట్టు భోరుమని వర్షం మొదలయింది. బంధువులు రామారావు శరీరాన్ని ఎలాగైనా లోపలకు తీసుకువెళ్లాలని పట్టుదలగా బిల్డింగ్ కమిటీవాళ్ళతో వాదిస్తూనే ఉన్నారు. జరుగుతున్న రగడతో తనకెలాంటి సంబంధం లేదన్నట్టు నిర్జీవంగా, గేటు బయట, రోడ్డు మీద, ఒక బల్ల మీద పడి ఉంది రామారావు శరీరం. ఎవరో ఒక దుప్పటి తీసుకొచ్చి కప్పారు శరీరం మీద వర్షానికి తడవకుండా ఉండడం కోసం. జోరున కురుస్తున్న వర్షంలో తడుస్తూ, తండ్రి దేహాన్ని హత్తుకుని భోరున ఏడుస్తున్నాడు రవి.

'ఒరేయ్... మనుషుల్లా బతకడం నేర్చుకోండిరా! ఈ రోజు నా తండ్రిని బయట పెట్టారు. రేపు మీరు కూడా ఇదే గేటు దాటి బయటికి రావాలి. అప్పుడు మీ ఆత్మలకి శాంతి దొరుకుతుందా? సిమెంట్‌తో కట్టుకున్నది ఇల్లు కాదురా... ప్రేమని పంచుకునేది ఇల్లు. ఇంత పెద్ద స్థలంలో ఇంత పటిష్ఠంగా మీరు కట్టుకున్నది ఇళ్లను కాదు... శ్మశానాలను కట్టుకున్నారు! శ్మశానాలను...' ఈ మాటలు బయటకు అనలేదతను. మౌనంగా మనసులోనే అనుకుంటూ ఆక్రోశిస్తోందతని హృదయం.

జోరున వర్షం కురుస్తోంది. అపార్ట్‌మెంట్ గేటు బయట ఒకవైపు, శవం పక్కన విలపిస్తూ దిక్కుతోచని స్థితిలో అతని భార్యా, బిడ్డలు. మరోవైపు అపార్ట్‌మెంట్ వాసులు 'లోపలికి రానివ్వం' అని భీష్మించుకుని కూర్చున్నారు. గొడవ పెద్దదవుతోంది.

ఇక ఆగలేకపోయారు ఆ అపార్ట్‌మెంట్‌లోనే ఉండే రిటైర్డ్ ప్రొఫెసర్ మూర్తిగారు. అంతవరకు సామరస్యంగా సమసిపోతుందని ఎదురుచూసిన గొడవ ఇంకా ముదురుతుండేసరికి, గంభీరంగా ముందుకు వచ్చారు. ఆయన మాటలకి ఆ ప్రాంతంలో ఒక గౌరవం ఉంది.


''చాలిక ఆపండి ఈ అమానుషాన్ని! ఏం చేస్తున్నారు మీరు? అందరూ చదువుకున్న వాళ్లేగా! లేక రాతి యుగంలో మనుషులా? బాధలో ఉన్నవారికి నీ కష్టంలో మేమూ తోడుంటాం అని భుజం తట్టి ఓదార్చునివ్వడం పోయి, వాళ్ళని మరింత బాధల్లోకి నెట్టేస్తారా!? ఇదేనా మానవత్వం?'' అన్నారు గట్టిగా మూర్తిగారు.

''మూర్తిగారు, మీకు తెలియంది కాదు. ఈ బిల్డింగ్‌లో పెళ్లిళ్లు ఉన్నాయి, ఇప్పుడీ శవాన్ని లోపలకు తీసుకువస్తే బిల్డింగ్ మైల పడుతుంది. దోషం చుట్టుకుంటుంది. ఇది మా ఒక్కరి అభిప్రాయం కాదు. చాలామంది ఇలాగే అభిప్రాయపడుతున్నారు. అందరి క్షేమం కోసమే కదా మేమూ వద్దంటున్నది.'' తనూ తీవ్రంగానే అన్నాడు ప్రెసిడెంట్. దూడూ బసవన్నల్లా అతనికి వంత పాడారు మరికొందరు.

''దోషమా? ఏ శాస్త్రం చెప్పింది రాజశేఖర్ గారు. ఆపదలో ఉన్న పొరుగువాడికి సాయం చేయకపోవడం కంటే పెద్ద దోషం ఇంకోటి ఉంటుందా? మీ ఇంట్లో పెళ్లిళ్లు ఉన్నాయి సరే, ఎప్పుడో నెల రోజుల తరువాత పెళ్లి ఉందని ఇప్పుడు ఆయన శరీరాన్ని లోపలికి తెస్తే బిల్డింగ్ మొత్తం మైల పడిపోతుందా? అయినా ఇక్కడ సెల్లార్‌లో బాడీని పెడితే మీ ఇంట్లో పెళ్ళికి మైల ఎలా అంటుకుపోతుందండీ? ఇది చాదస్తమనుకోవాలా? మూఢనమ్మకాలు అనుకోవాలా? మూర్ఖత్వం అనుకోవాలా? ఇదంతా వదిలేయండి... ఆ మాట నేననకూడదు గాని, రేపు మీ ఇళ్ళల్లో ఎవరికైనా ఇలాంటి కష్టం వస్తే అప్పుడు కూడా ఇలాగే రోడ్డు మీద పడేయమంటారా?'' ఆవేశంగా అన్నారు మూర్తిగారు.

ఆయన ఆవేశానికి, ఆ సమాధానంలేని ప్రశ్నలకు చుట్టూ ఉన్నవాళ్లు సమాధానం చెప్పలేక ఒక్కసారిగా నిశ్శబ్దమయ్యారు. ఆయన మాటలకు వత్తాసుగా కొందరు తలలూపడం మొదలుపెట్టారు.

అప్పటివరకు జరుగుతున్న తతంగం నచ్చకపోయినా, వాళ్ళ పెత్తనానికి మారు



## అలా గా!



ఆస్ట్రియన్ సైనికుల్లోని ఒక బృందం విశ్రాంతి సమయంలో మందు పార్టీ చేసుకున్నారు. కొందరు సైనికుల మధ్య తలెత్తిన వాగ్వాదం కాస్తా ముదిరింది. ఒక సైనికుడు గాల్లోకి కాల్పులు జరిపాడు. శత్రువులైన ఓటమన్ సైనికులు దాడికి వచ్చారేమోనని అనుమానంతో చుట్టుపక్కల గుడారాల్లోని సైనికులంతా తుపాకులు పుచ్చుకుని, కేకలు వేస్తూ బయటకు వచ్చారు. వాళ్లలో నానా భాషలవాళ్లు ఉండటంతో ఒకరి మాటలు ఒకరికి అర్థంకాక కాల్పులు ప్రారంభించారు. దాదాపు పదివేల మంది ఆస్ట్రియన్ సైనికులు నేలకొరిగాక పరిస్థితి సద్దుమణిగింది. ఈ సంఘటన 1788లో జరిగింది.

## కిసుక్కు

**కుంభోదర్:** డాక్టర్! మధ్యాహ్నం ఒక అరటిపండు తిన్నప్పటి నుంచి ఒకటే కడుపునొప్పిగా ఉంది.

**డాక్టర్:** ఒక అరటిపండు తిన్నాక కడుపునొప్పిగా ఉందా? ఆశ్చర్యంగా ఉందే! అసలు ఉదయం నుంచి ఏమేం తిన్నారో చెప్పండి.

**కుంభోదర్:** ఉదయం పదహారు ఇడ్లీలు, పన్నెండు పెసరట్లు ఫలారం చేశానండి. బజారుకెళ్లినప్పుడు తోవలో బేకరీకెళ్లి పది పేస్ట్రీలు తిని కోకాకోలా తాగాను. ఇంటికొచ్చాక మధ్యాహ్నం మటన్ పలావు, మంచూరియా రైస్ తిన్నాను. భోజనం తర్వాత ఒకే ఒక్క అరటిపండు తిన్నాను. అంతే, కడుపునొప్పి పట్టుకుంది!

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

> పండుగ వస్తే అందరికీ స్వీట్లు పంచి, అందరం కలిసిమెలిసి ఉందామన్న తియ్యటి మనసు ఆయనది. అలాంటి ఆయన ప్రాణం పోయాక ఒక 'వస్తువు' అయిపోయారా? ఆయన దేహం అపవిత్రం అయిపోయిందా?

మాట్లాడలేక నోరుమూసుకు ఊరుకున్న మరి కొందరయితే,''నిజమే కదా! ఈ ప్రెసిడెంట్, సెక్రెటరీలు మరీ మూర్ఖులు.''

''అవును... అంతా వీళ్ళ ఇష్టమే అయిపోతోంది. వాళ్ళేం చెప్తే అదే రూల్... బిల్డింగ్ అంతా వీళ్ళదే అన్నట్టు చెలరేగిపోతున్నారు. అడిగేవాళ్ళు లేక...''

''అదే కదా! పాపం ఆ కుటుంబాన్ని చూడండి వీళ్ళ ఆగడాలకు ఎలా కుమిలిపోతున్నారో... ఇంట్లో మనిషి పోయి వాళ్లేడుస్తుంటే, వీళ్ళిలా అవమానించి ఏడిపిస్తున్నారు'' అంటూ గుసగుసలు మొదలుపెట్టారు.

''రామారావుగారు ఈ అపార్ట్‌మెంట్‌లో పదేళ్ల నుంచి ఉన్నారు. మీ పిల్లలు కింద పడితే లేవనెత్తిన చేతులు ఆయనవి. ఎవరికే కష్టం వచ్చినా భుజం తట్టి తోడుగా నిలిచి, మానవత్వం చూపిన మనిషి. పండుగ వస్తే అందరికీ స్వీట్లు పంచి, అందరం కలిసిమెలిసి ఉందామన్న తియ్యటి మనసు ఆయనది. అలాంటి ఆయన ప్రాణం పోయాక ఒక 'వస్తువు' అయిపోయారా? ఆయన దేహం అపవిత్రం అయిపోయిందా? బాబాయ్ గారూ... మామయ్యగారూ... అన్నయ్యగారూ... తాతయ్యా... మీరు ఆశీర్వదిస్తే మాకు 'శుభం' అంటూ ఆయనతో ఎవరెవరు... ఎన్నిసార్లు అన్నారో గుర్తు చేసుకోండి. అలాంటిది ఆయన ప్రాణం పోయేసరికి అశుభంగా మారిపోయారా? ఒక్కసారి మీ మనస్సాక్షిని అడగండి... మీరు చేస్తున్నదేంటో మీకే తెలుస్తుంది. చూడండి... మనం కట్టుకున్న ఈ గోడలు మనల్ని విడదీయకూడదు. ఈ రోజు మనం ఈ గేటు తీయకపోతే, రేపు ఈ అపార్ట్‌మెంట్ కేవలం ఒక 'సిమెంట్ సమాధి'లా మిగిలిపోతుంది. ఇందులో మనుషులు ఉండరు, కేవలం భయం మాత్రమే ఉంటుంది. మన పిల్లలకి మనం నేర్పించే సంస్కారం ఇదేనా? చనిపోయిన మనిషికి గౌరవం ఇవ్వలేని మనం, బతికున్న వారికి ఏం విలువ ఇస్తాం?'' కొట్టినట్టే అన్నారు మూర్తిగారు.

ఆయన మాటల్లోని నిజాయితీ, ఆవేదన అక్కడున్న వారి గుండెల్లో గుచ్చుకుంది. కొందరు తలలు దించుకున్నారు. ప్రెసిడెంట్, సెక్రెటరీ అండ్ గ్రూప్ మౌనంగా ఉండిపోయారు.

స్థిర నిశ్చయంతో ముందుకు కదిలారు మూర్తిగారు. ''నేను వెళ్తున్నాను. నేనే స్వయంగా నా చేతులతో రామారావు గారిని లోపలికి తీసుకొస్తాను. నాతో పాటు మానవత్వం ఉన్నవాళ్లు ఎవరైనా ఉంటే రండి. అడ్డుపడేవాళ్లు ఉంటే... రేపు మీరు కూడా ఒంటరిగా ఇలాగే రోడ్డు మీద నిలబడతారని గుర్తుంచుకోండి.'' అంటూనే మూర్తిగారు ఒక్క అడుగు ముందుకు వేయగానే, మొదట ఒక యువకుడు, ఆ తర్వాత మరో ఇద్దరు మహిళలు ముందుకు వచ్చారు. అలా మెల్లగా ఒక్కొక్కరుగా అందరూ రవి దగ్గరకు వెళ్లారు.

''క్షమించు రవి... భయం, మూఢనమ్మకాలు, ఒక రకంగా చెప్పాలంటే మూర్ఖత్వం మమ్మల్ని గుడ్డివాళ్లను చేసింది. రామారావుగారు మన పెద్దాయన. ఆయన్ని సగౌరవంగా లోపలికి తీసుకెళ్దాం. అన్నీ మేమే దగ్గరుండి జరిపిస్తాం.'' అంటూ తనే ముందు రామారావుగారి పార్థివ శరీరాన్ని పైకెత్తడానికి కదిలాడు రాజశేఖరం.

అందరూ కలిసి రోడ్డు మీద అనాథలాగా పడి ఉన్న రామారావుగారి శరీరాన్ని గౌరవంగా పైకెత్తారు. గేట్లు బార్లా తెరుచుకున్నాయి. వర్షం వెలిసింది. నిముషాల్లో సెల్లార్‌లో ఓ పక్కన అంతా ఖాళీ చేసి, రామారావుగారి దేహాన్ని పెట్టడానికి అన్ని ఏర్పాట్లూ చకచకా చేసేశారు. అపార్ట్‌మెంట్ వాసులందరూ కలిసి పూలు తెచ్చారు, దీపాలు వెలిగించారు. రవి కుటుంబం ఒంటరిది కాదు అని నిరూపించారు అందరూ.

రామారావుగారికి జరగాల్సిన ఆచారాలన్నీ సజావుగా, గౌరవప్రదంగా జరిగాయి. అందరూ కలిసి రామారావు గారిని చివరి ప్రయాణానికి సగౌరవంగా సాగనంపారు. బిల్డింగ్‌లో 'దోషం' పోయి 'ప్రేమ' వెల్లివిరిసింది.

## కథాకళి

FEED ME A STORY

**14.6.2026 ఫన్‌డేలో ప్రచురించిన 'ది డివోర్స్' కథకి పాఠకులు సూచించిన టాప్ 5 పేర్లు.**

మొగుడంటే నువ్వేరా
ధరణికోట శివరామప్రసాద్, హైదరాబాద్

'ఆలి'మనీ
టి. సూర్య కుమారి

ప్రయోజ 'కొడుకు'
రౌతు వినీత్, భూపాలపల్లి

డైవర్సి...టీ
రాపోలు వెంకటేశ్వర్ రావు, కరీంనగర్

బెటర్'హాఫ్'
కందుకూరి భానుకిరణ్, అనంతపూర్

## తీపి రికార్డు!


**తే**నె అంటే చాలామందికి ఇష్టం. కానీ, జర్మనీకి చెందిన ఆండ్రే ఆర్టోల్ఫ్ మాత్రం పిచ్చి! ఎంతంటే, ఒక నిమిషంలో ఏకంగా కిలోకు పైగా తేనె తినేసేంత. అవును, ప్రపంచ రికార్డు కోసం బకెట్ నిండా తేనె ముందు పెట్టుకుని కేవలం 60 సెకన్లలోనే 1,273 గ్రాముల తేనెను గుటకలేసేశాడు. అంటే దాదాపు ఒక పెద్ద తేనె సీసా మొత్తాన్ని






నిమిషంలో ఖాళీ చేశాడు. నీళ్లు తాగినట్టు తేనె తాగడం అంత ఈజీ కాదు. అది చిక్కగా ఉండటంతో గొంతులోకి వెళ్లడమే పెద్ద టాస్క్. అయినా ఆండ్రే మాత్రం స్పూన్ తర్వాత స్పూన్ వేగంగా తింటూ కొత్త ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వైరల్ అవుతోన్న అతని వీడియో చూస్తే 'ఇంత తేనె ఎలా తిన్నాడు?' అనిపించక మానదు. అయితే ఇది ఒక్కరోజులో వచ్చిన విజయం కాదు. విచిత్రమైన తినే చాలెంజ్‌లలో ఇప్పటికే అనుభవం ఉన్న ఆండ్రే, తన వేగం, పట్టుదలతో మరోసారి ప్రపంచాన్ని ఆశ్చర్యపరచాడు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి




# అనన్య

- గాజోజి శ్రీనివాస్, 9948483560

సాయంత్రం 5:15 అవుతోంది. ఆఫీస్ నుంచి బయలుదేరి ట్యాంక్‌బండ్‌కి చేరుకున్నాను. ఎందుకో మనసు బాగోలేదు. కాసింత రిలాక్స్ అవుదామని వచ్చినా, అక్కడ కనిపించిన దృశ్యాలు గడియారం ముళ్లలా నా ఆలోచనలను పరిగెత్తించి మరింత బరువెక్కించాయి. నాకంటే చిన్నవాళ్లు కూడా జంటలుగా కనిపిస్తున్నారు. ఇప్పటివరకు నేను ఒంటరిగా ఉండడం ఎందుకో… జీవితంలో ఒక వ్యక్తి లేకపోవడం నా హృదయాన్ని తొలిచివేస్తుంది.

ఒక బెంచ్ మీద కూర్చుని అలా చూస్తూ ఉండగా, దూరంగా బిర్లా మందిరం కంటపడ్డది. ఆ క్షణంలోనే అక్కడికి వెళ్లాలనిపించింది. వడివడిగా మెట్లెక్కి, ఆ "శ్రీనివాసుడి" ముందర నిలబడి ఒక్కటే ప్రార్థన చేసుకున్నాను

"స్వామీ… తొందరగా నాకు పెళ్లి చేయి. ఈ ఒంటరి జీవితానికి ఒక తోడుని ఇవ్వు".

ఆ మాటలు పెదవుల నుంచి జారిన క్షణంలోనే, తెలియకుండానే నా మనసు లోతుల్లో ఒక చిన్న నమ్మకం చిగురించినట్టు అనిపించింది.

ట్యాంక్‌బండ్ నుంచి ఇంటికి వస్తుంటే రాజేష్ ఫోన్ చేశాడు.

"ఏరా లక్ష్మణ్… మళ్లీ ట్యాంక్‌బండ్ ఏనా?" అన్నాడు.

రాజేష్ నా చిన్నప్పటి స్నేహితుడు. మా ఇద్దరి మధ్యన ఎలాంటి దాపరికాలు లేవు; అన్నీ నిర్భయంగా మాట్లాడుకునే అనుబంధం మాది.

---

నేను చేసే పని రికార్డ్ ట్రేసర్. రోజూ ఎన్నో ఫైల్స్ చూడటం, సంబంధిత సెక్షన్లకు పంపించడమే నా పని. ఆ రోజు ఉదయం కూడా ఆఫీస్ పనిలో మునిగిపోయి ఉన్నాను. అంతలో కమ్మని గులాబీ సువాసన తాకింది. తలెత్తి చూశాను.

కుందనపు బొమ్మలా, అమాయకమైన చూపులతో ఒక అమ్మాయి నెమ్మదిగా నా వైపు వస్తోంది. కొన్ని క్షణాల పాటు నా కనులు రెప్పవేయడం మరిచిపోయాయి. ఆమె నా డెస్క్ దగ్గరకు వచ్చేసరికి గుండెదడ కొంచెం ఎక్కువైంది. చేతిలో ఫైల్, ముఖంలో ఎలాంటి ఆర్భాటం లేని చిరునవ్వు చూస్తున్న కొద్దీ చూడాలనిపించేలా ఉంది ఆమె.

నా పరధ్యానాన్ని భంగం చేస్తూ ఆమె మెల్లగా,

"సార్… ఇది ఆర్.టి సెక్షన్ కదా?" అని అడిగింది.

"అవును," అని చెప్పాను కానీ, నా గొంతులో తెలియని తడబాటు. తన బ్యాగ్ నుండి ఒక కవర్ తీసి నాకు ఇచ్చింది. కవర్ తీసుకుంటుండగా ఆమె వేళ్ల క్షణం నా చేతిని తాకాయి. అంతే… ఆ స్పర్శ ఒక చిన్న అలలా నా మనసును తాకింది.

చుట్టూ అందరూ తమ పనుల్లో మునిగిపోయారు. కానీ నా మనసు మాత్రం నా ఆధీనంలో లేదు. నిన్న బిర్లా మందిరంలో స్వామిని వేడుకున్న మాటలు గుర్తొచ్చాయి.

"ఇదేనా స్వామీ… నీ సమాధానం?" అన్న ఆలోచన నన్ను నేనే చిరునవ్వుతో నవ్వుకునేలా చేసింది.

"ఇక్కడ సైన్ చేయాలి" అని చెప్పాను.

ఆమె పేరు రాస్తూ, "నా పేరు అనన్య," అని మెల్లగా చెప్పింది.

ఆ పేరు నా చెవుల్లో ఏదో సంగీతంలా మోగింది. "అనన్య"… అపూర్వం.

పేరు కూడా ఆమె లాగే మృదువుగా ఉంది.

ఫైల్‌ను రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత సెక్షన్‌కి పంపించాను. పని అయిపోయినట్టే. కానీ మనసులో మాత్రం ఏదో మొదలైన భావన. ఆ రోజు మధ్యాహ్నం లంచ్ టైమ్‌లో కూడా అదే ఆలోచన. ఇలాంటి చిన్న పరిచయం మనసుని ఇంత కలవరపెడుతుందా? అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

"మీరు కొత్తగా జాయిన్ అయ్యారా?" అని అడిగాను.

"అవును. ఈ రోజే. లీగల్ సెక్షన్‌లో," అంది.

"ఓహ్… అలాగా," అని సాధారణంగా స్పందించినా, లోపల మాత్రం ఏదో చిన్న ఆనందం పుట్టుకొచ్చింది. ఆమె ఫైల్ తీసుకుని వెళ్లిపోతూ, ఒకసారి తిరిగి చూసి చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వు వలన నాకు ఆ రోజంతా పని చేసినట్టుకూడా అనిపించలేదు. ఆ రోజు ఆఫీస్ అయిపోయాక కూడా, ఇంటికి వెళ్లినా మనసంతా అనన్య చుట్టూనే తిరిగింది. బిర్లా మందిరం మెట్లు, స్వామి విగ్రహం, నా వేడుకోలు… అన్నీ ఒకదానికొకటి కలిసిపోయాయి.

తరువాతి రోజు ఉదయం ఆఫీస్‌కు కొంచెం ముందుగానే వచ్చాను. ఎందుకో తెలియదు… కానీ నా డెస్క్ వైపు వస్తూ ఆమె కనిపిస్తుందేమో అన్న ఆశ. కొద్దిసేపటికి అడుగుల శబ్దం వినిపించింది. తలెత్తి చూస్తే… అదే గులాబీ సువాసన.

"గుడ్ మోర్నింగ్, సార్," అని ఈసారి ధైర్యంగా చెప్పింది అనన్య.

"గుడ్ మోర్నింగ్," అని నేను కూడా ఈసారి తడబాటు లేకుండా చెప్పగలిగాను.

ఆ రోజు నుంచి చిన్న చిన్న మాటలు మొదలయ్యాయి. ఫైల్ పని పేరుతో, టీ బ్రేక్‌లో, లంచ్ టైమ్‌లో ఒకరికొకరం చూసుకొని కళ్ళతోనే మాట్లాడుకునేవాళ్లం. రోజు రోజుకి మా మధ్య సాన్నిహిత్యం పెరిగింది. డ్యూటీ అయిపోయాక కూడా రాత్రివరకు ఫోన్‌లో మాట్లాడుకునేవాళ్లం, సందేశాలు పంపించుకునేవాళ్లం.

ఒక సాయంత్రం ఆఫీస్ తరువాత ఆమెనే అడిగింది. మనసు ప్రశాంతం కోసం మీరు ఎక్కడికి వెళ్తారు అని. ట్యాంక్ బండ్ అని చెప్పాను.

"ట్యాంక్‌బండ్‌కు అప్పుడప్పుడూ వెళ్తుంటారా?"

నా గుండె ఒక్కసారి బలంగా దడదడలాడింది.

"అవును… నిన్ననే వెళ్లాను," అన్నాను.

"అయితే… రేపు కలిసి వెళ్దామా?" అని అడిగింది, అదే అమాయకమైన చూపులతో.

ఆ క్షణంలో నాకు బిర్లా టెంపుల్ గంటల శబ్దం వినిపించినట్టు అనిపించింది. నేను ఏమీ మాట్లాడకుండా, కళ్లలోనే సమాధానం చెప్పినట్టు నవ్వాను. నా మనసులో మాత్రం ఇదే సమయం, అనన్యకి నా ప్రేమ విషయం చెప్పాల్సిన సమయం.

ట్యాంక్‌బండ్‌పై సాయంత్రం మెల్లగా చీకటి పడుతుంది. హుస్సేన్ సాగర్ నీటిమీద పడుతున్న వీధిలైట్ల ప్రతిబింబం అలలతో కలిసి అల్లకల్లోలంగా కదులుతోంది. చుట్టూ జంటలు నవ్వుకుంటూ నడుస్తున్నారు. ఎవరి ప్రపంచంలో వాళ్లే మునిగిపోయారు. మేమిద్దరం మాత్రం మాటలు లేకుండా పక్కపక్కనే నడుస్తున్నాం. ఆ నిశ్శబ్దం భారం

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కాదు... కానీ ఏదో చెప్పాలనే తొందర, గుండెలో దాచుకున్న మాటలు బయటికి రావాలనే ఆతృత.

కొన్ని క్షణాల తర్వాత ఆగి, ధైర్యం కూడబెట్టుకుని ఆమె వైపు చూశాను.

"అనన్య..." అన్నాను మెల్లగా.

ఆమె నా వైపు చూసింది. ఆ చూపులో ప్రశ్న ఉంది, ఆసక్తి ఉంది, కాస్త భయం కూడా ఉంది.

"నిన్ను చూసిన మొదటి రోజునుంచే నిన్ను ఇష్టపడుతున్నాను," అన్నాను. మాటలు తడబడుతున్నాయి. "ఇది క్షణికమైన భావం కాదు. నీతో జీవితం పంచుకోవాలని ఉంది. పెళ్లి చేసుకుందామనుకుంటున్నాను."

ఆ మాటలు చెప్పగానే నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలైంది. ఆమె సమాధానం ఏమై ఉంటుందో అన్న భయం ఒక్కసారిగా నన్ను చుట్టేసింది.

అనన్య కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. నా వైపు కూడా చూడలేదు. ట్యాంక్‌బండ్ నీళ్ల వైపు చూస్తూ నిలబడి పోయింది.

చివరికి నెమ్మదిగా మాట్లాడింది.

"కానీ నా జీవితం అంత సులభం కాదు," అంది. "నాన్న లేరు. అమ్మ ఉంది. ముగ్గురు చెల్లెల్లు. వాళ్ల చదువులు, పెళ్లిళ్లు... అన్నీ నా భుజాల మీదే ఉన్నాయి. ఉద్యోగం నాకు అవసరం కాదు... బాధ్యత. ఇప్పుడే నా జీవితం గురించి నేను ఆలోచించుకునే స్థితిలో లేను."

ఆమె క్షణం ఆగి, నన్ను చూసింది. ఆ చూపులో బాధ ఉంది, నిజాయితీ ఉంది.

"నన్ను తప్పుగా అర్థం చేసుకోకు," అంది మెల్లగా. "నీవు నాకు చాలా ముఖ్యమైనవాడివి. కానీ... నా కుటుంబం తర్వాతే నేను."

ఆ మాటలు నా గుండెల్లో నిశ్శబ్దంగా దిగిపోయాయి. ప్రేమను తిరస్కరించిన మాటలు కావు అవి, జీవితం విధించిన నిజాలు మాత్రమే. మాటలేకుండా పక్కపక్కనే నడిచాం. ఆ మౌనంలోనే ఒకరికొకరం అర్థమయ్యాం.

---

"ఏమండీ... మీకు ఫోన్..." అంటూ నా భార్య నిఖిల లోపల్నుంచి పిలిచింది.

"ఎవరు?" అన్నాను.

"ఇంకెవరు... మీ ఫ్రెండ్ రాజేష్!"

"చెప్పురా రాజేష్..."

"ఏం లేదురా. నేను ప్రయాగరాజ్ కుంభమేళాకు వెళ్తున్నాను. చెప్పుదామని కాల్ చేశాను."

"అలానా! సరేరా. నేను వచ్చి బస్టాండ్ లో డ్రాప్ చేస్తాను." ఉండు, నీ దగ్గరికే వస్తున్నాను.

బస్టాండ్‌కి చేరుకున్నాం. అప్పుడే రాజేష్ ఎక్కే బస్సు వచ్చింది.

"సరే గానీ... మళ్లీ ఎప్పుడు తిరిగి వస్తావు?" అని అడిగాను.

"ఏమోరా... చెప్పలేం. కాస్త సమయం పట్టొచ్చు."

"అదేం కుదరదు. మా మ్యారేజ్ డే కి ఇంకా పది రోజులు మాత్రమే ఉన్నాయి. అప్పటికి నువ్వు తప్పకుండా రావాల్సిందే."

"సరేలే రా... ట్రై చేస్తాను."

అంతలో బస్సు కదిలింది. రాజేష్ చేతి ఊపుతూ వెళ్లిపోయాడు. కాసేపటికే డ్యూటీకి బయల్దేరాను. అనన్య గురించి నేను ఎప్పుడైనా మాట్లాడగలిగే ఏకైక వ్యక్తి రాజేష్. అతను కూడా కొన్నాళ్లు దూరమవుతుండటంతో, నా మనసులో దాచుకున్న ఆ జ్ఞాపకాలు మళ్లీ నాలోనే బంధీ అయిపోయినట్టనిపించింది.

ఆ రోజు ఆఫీసు అంతా హడావిడిగా ఉంది. జోనల్ మీటింగ్ వల్ల అనేక బ్రాంచ్‌ల వాళ్లు ఇక్కడికి వచ్చారు. ప్రతి ముఖం, ప్రతి మాట అన్నీ గందరగోళమే. ఆ గందరగోళంలోనూ నా మనసు మాత్రం ఒక్క పేరే వెతుకుతోంది... అనన్య.



ఆమె గురించి తెలుసుకోవాలని ఎంత ప్రయత్నించానో నాకే తెలుసు. ఒక్కొక్కరిని అడిగాను. ఎవరో "రిజైన్ చేసి వెళ్లిపోయింది" అన్నారు. ఇంకెవరో "ఇప్పుడు రావడం లేదు" అన్నారు. ఎవరి మాటల్లోనూ స్పష్టత లేదు. నా మనసుకు మాత్రం ఏ సమాధానమూ సరిపోలేదు.

పన్నెండు సంవత్సరాలయ్యింది అనన్యను చూసి. ఒక్క ఫోన్ లేదు, ఒక్క సందేశం లేదు. అయినా ఆమె జ్ఞాపకం మాత్రం ఒక్క రోజూ నన్ను వదల్లేదు. ఆమె కోసం ఎంత వెతికానో నాకే తెలుసు. పాత పరిచయాలను, కామన్ ఫ్రెండ్స్‌ను, సోషల్ మీడియాలో పేర్లను వెతికాను. కానీ ఎక్కడా ఆమె జాడ దొరకలేదు. ఎందుకు నన్ను వదిలి వెళ్లిపోయిందో ఇప్పటికీ అర్థం కాలేదు. నా తప్పేమైనా ఉందా? లేక పరిస్థితులే ఆమెను దూరం చేశాయా? సమాధానం లేని ప్రశ్నగానే అది మిగిలిపోయింది.

ఇప్పుడు నాకు పెళ్లయింది. పిల్లలున్నారు. బాధ్యతలతో నిండిన జీవితం ఉంది. బయటకు చూస్తే అన్నీ సవ్యంగా ఉన్నట్టే కనిపిస్తాయి. కానీ లోపల మాత్రం ఇంకా ఆమె గురించే ఆలోచనలు. అనన్య చివరిసారి నన్ను చూసిన ఆ క్షణం ఇప్పటికీ కళ్లముందు నిలిచే ఉంది. ఆ రోజు ఎవరో నా లోపలి ప్రాణాన్ని తీసేసినట్టుగా అనిపించింది.

తనను ఎంతగా ప్రేమించానో మాటల్లో చెప్పలేను. ఆమెనే నా భవిష్యత్తుగా, నా భార్యగా ఊహించుకున్నాను. కానీ ఒక్కసారిగా తనకు ట్రాన్స్ఫర్ వచ్చిందని ఆమె వెళ్లిపోయింది. వెళ్లిపోయింది మాత్రమే కాదు పూర్తిగా నాకు కనిపించకుండా పోయింది. నేను కాల్ చేసి మళ్లీ కలవమని చెప్పేంతవరకు కలవద్దని నాతో ప్రామిస్ చేపించుకొని వెళ్ళిపోయింది. ఆ రోజు తర్వాత ఆమెను మళ్లీ ఎప్పుడూ చూడలేదు. ఫోన్ చేయడానికి కూడా అవకాశం లేకుండా, నన్ను నా జ్ఞాపకాలతోనే ఒంటరిగా వదిలేసింది.

కాలం గడుస్తోంది...జీవితం ముందుకు సాగుతోంది...కానీ నా మనసు మాత్రం ఇంకా అక్కడే ఆగిపోయింది, అనన్య నన్ను వదిలి వెళ్లిపోయిన ఆ క్షణంలోనే.

ఆ రాత్రి ఇంటికి చేరేసరికి పిల్లలు నిద్రలో ఉన్నారు. ఇంట్లో నిశ్శబ్దం. నిఖిల హాలులో కూర్చొని టీవీ చూస్తోంది. నన్ను చూసి మామూలుగా నవ్వింది. ఆ నవ్వులో తప్పేమీ లేదు. బాధ్యత ఉంది, నమ్మకం ఉంది, జీవితం ఉంది. కానీ నా మనసులో మాత్రం ఆ నవ్వు దాకా చేరే శక్తి లేదు.

"ఆఫీసులో మీటింగ్ ఎలా జరిగింది?" అని అడిగింది.

"బానే ఉంది" అన్నాను. అంతకన్నా ఎక్కువ మాట్లాడలేకపోయాను.

బెడ్‌రూమ్‌లోకి వెళ్లి పడుకున్నాను. కళ్లుమూసినా నిద్ర రాలేదు. గడియారపు టిక్‌టిక్ శబ్దం గుండె కొట్టుకునే శబ్దంతో కలిసిపోయింది. ఆ చీకటిలో, ఎక్కడినుంచో అనన్య స్వరం వినిపించినట్టుగా అనిపించింది.

"నన్ను నమ్ముతావు కదా?"

ఆమె చివరిసారి అడిగిన ప్రశ్న.

ఆ రోజు స్టేషన్‌లో ఆమె నిల్చుంది. చేతిలో చిన్న బ్యాగ్. కళ్లలో చెప్పలేని భయం.

"ఇది మనిద్దరికీ మంచిదే" అంది.

"నేనే కాల్ చేసే వరకూ నన్ను వెతకవద్దు. ప్లీజ్..."

ఆ మాట అనగానే నా గొంతు మూగబోయింది. ప్రశ్న అడిగే ధైర్యం కూడా లేకుండా తల ఊపాను. అదే ఆమె విషయంలో నేను చేసిన పెద్ద తప్పేమో ఇప్పటికీ తెలియదు. ఇప్పటికీ ఒక్కసారి అయినా ఆమె ఎందుకు అలా వెళ్లిపోయిందో తెలుసుకోవాలని ఉంది.

నన్ను కాపాడేందుకా?

లేదా తనను తాను శిక్షించుకునేందుకా?

సమాధానం తెలియని ప్రశ్నలతోనే నేను జీవిస్తున్నాను.

---

ఉదయం లేవగానే నిఖిల, పిల్లలతో కలిసి నా దగ్గరికి వచ్చింది. పిల్లల చేత కేక్ తయారు చేయించి, నా కోసం చిన్న సర్‌ప్రైజ్ కూడా ప్లాన్ చేసింది. "ఈసారి పోయిన సంవత్సరం కంటే ఎక్కువగా సెలబ్రేట్ చేద్దాం" అని పిల్లల కంటే ఎక్కువ ఉత్సాహంగా చెప్పింది. ఆమె ముఖంలో కనిపించిన ఆనందం చూస్తుంటే, ఈ ఇంటి సంతోషం కోసం ఎంత నిశ్శబ్దంగా కష్టపడుతుందో అర్థమైంది. నా జీవితంలో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఎన్నో మౌనాలను ప్రశ్నించకుండా భరించి, ఈ కుటుంబాన్ని ప్రేమతో నిలబెట్టింది నిఖిలే.

అంతలో ఫోన్ మోగింది. స్క్రీన్ మీద పేరు చూసి మనసు కాస్త ఊపిరి పీల్చుకుంది. అది రాజేష్.

"నేను వస్తున్నాను రా" అన్నాడు.

ఆ మాట విన్నాకే మనసుకి ఓ ధైర్యం వచ్చినట్టైంది. వాడు ఉంటే... నాకు తెలియని ఓ బలముంటుంది.

ఆ రోజు సాయంత్రం పార్టీ. చుట్టూ హడావిడి. బంధువులు, స్నేహితులు, పరిచయస్తులు... ఇంటంతా సందడిగా మారిపోయింది. ఏర్పాట్లలో మునిగి, సమయం ఎలా గడిచిపోయిందో కూడా తెలియలేదు.

పార్టీని అందరూ కలిసి ఎంజాయ్ చేశాం. నవ్వులు, మాటలు, ఫోటోలు... అలా అలా క్రమంగా రాత్రి అయింది. ఒక్కొక్కరుగా అతిథులు వెళ్లిపోవడం మొదలైంది.

అందరూ వెళ్లిపోయాక, నేను రాజేష్ ఇద్దరం డాబాపైకి వెళ్లాం. చల్లని గాలి, నిశ్శబ్దమైన ఆకాశం, చేతిలో గ్లాసులు. మందు సిప్ చేస్తూ పాత జ్ఞాపకాలు, చిన్నపాటి మాటలతో సమయం గడుస్తోంది.

అంతలో రాజేష్ ఒక్కసారిగా మౌనమయ్యాడు. తర్వాత నన్ను చూసి,

"లక్ష్మణ్... నీతో ఒక విషయం చెప్పాలి," అన్నాడు.

"ఏంటి?" అన్నట్టు అతని వైపు చూశాను.

"నేను ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లాను కదా... అక్కడ నాకు ఒక అద్భుతం జరిగింది," అన్నాడు.

"ఏం జరిగిందో చెప్పరా... తొందరగా," అన్నాను.

"నాకు అనన్య కనబడింది."

"జోక్ చేయకురా... ఫస్ట్ మందు తాగు," అన్నాను.

"లేదురా... నిజంగా చెప్తున్నాను. కావాలంటే చూడు. తనతో నేను దిగిన ఫోటో ఇది," అన్నాడు.

ఆ స్క్రీన్ వైపు చూడటానికి నాకు ధైర్యం చాలలేదు. ఆ ఫోటోలో ఉన్న ఆమె... నిజంగా అనన్యే.

"ఇది... ఎలా సాధ్యమైంది?" అని నా గొంతు నాకు వినిపించలేదు.

నా గుండె మరింత వేగంగా కొట్టుకుంటోంది. చెమటలు పట్టాయి. ఊపిరి బరువైంది. నా టెన్షన్ చూసి రాజేష్ నా భుజంపై చేయి వేసి, "కూల్ రా... కూల్‌గా ఉండు, ఇది... తను నీకు ఒక లెటర్‌ని ఇచ్చింది," అన్నాడు. ఆ లెటర్ తాకిన క్షణంలోనే నా వేళ్లలో వణుకు పుట్టింది. పన్నెండేళ్ల మౌనం... లెటర్‌ని తెరవడానికి ధైర్యం రావడం లేదు. చివరికి... నెమ్మదిగా లెటర్ తెరిచాను. అందులో ఆమె చేతిరాత.

ప్రియమైన లక్ష్మణ్‌కు, ఎలా ఉన్నావు? నీ భార్య, పిల్లలు అందరూ బాగున్నారని అనుకుంటున్నాను. నా విషయాలు నీ దగ్గర దాచినందుకు నాపై ఏమాత్రం కోపం పెట్టుకోకపోతే చాలు. ఈ లేఖ చదువుతున్నప్పుడు ఒక్క క్షణం నన్ను అర్థం చేసుకునే ప్రయత్నం చేయమని మాత్రమే కోరుకుంటున్నాను.

మా నాన్నగారు చనిపోయిన తర్వాతే నాకు ఆ ఉద్యోగం వచ్చింది. నాకు ముగ్గురు చెల్లెల్లు. నాన్న చివరి శ్వాస తీసుకుంటూ, "చెల్లెల్లను, అమ్మను చూసుకో" అని నా చేతిలో బాధ్యత పెట్టి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచే ఇంటి మొత్తం భారం నా భుజాల మీద పడింది. ఉద్యోగంలో చేరాను... బాధ్యతలు నన్ను పెద్దదాన్నిగా మార్చాయి, కానీ జీవిత ప్రయాణంలో మాత్రం అలసిపోయాను.

నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని చెప్పిన రోజుల్లోనే నాకు ఇంకో నిజం తెలిసింది. కొన్ని ఆరోగ్య పరీక్షల కోసం డాక్టర్ దగ్గరకు వెళ్లినప్పుడు, నా భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టే ఒక విషయం తెలిసింది. రాబోయే రోజులు ఎలా ఉంటాయో చెప్పలేమని, జీవితం నేను ఊహించిన దారిలో సాగకపోవచ్చని డాక్టర్లు చెప్పారు. ఆ క్షణంలోనే నా కలలన్నీ ఒక్కసారిగా ఆగిపోయినట్టనిపించింది. బయటకు నేను మామూలుగానే కనిపించినా, లోపల మాత్రం ఒక తెలియని భయం నన్ను నిత్యం వెంటాడసాగింది.



నిన్ను చూసిన మొదటి రోజే నా మనసులో తెలియకుండానే ప్రేమ పుట్టింది. నీవు నాతో ఎన్నోసార్లు "నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పావు. కానీ నా ఆరోగ్య పరిస్థితి తెలిసి ప్రేమ పేరుతో నీ భవిష్యత్తును చీకటిలోకి నెట్టే హక్కు నాకు లేదనిపించింది. అందుకే నిన్ను వదిలి వెళ్లాలని నిర్ణయించుకున్నాను. పరిస్థితులు నీ ప్రేమకు దగ్గరయ్యే ధైర్యాన్ని నాకు ఇవ్వలేదు. నీవు నా జీవితంలో అత్యంత ఆప్తమైన వ్యక్తివి. "లక్ష్మణ్... నేనూ నిన్నే ప్రేమిస్తున్నాను" అని చెప్పాలని కలలు కన్నాను. కానీ కాలం నాకు అనారోగ్యపు రూపంలో ఆ అవకాశం ఇవ్వలేదు.

ఎన్నాళ్లని నా కోసమే నువ్వు ఎదురు చూస్తావు? మీ ఇంట్లో పెళ్లి ఒత్తిడి పెరిగింది. ఆ పరిస్థితుల్లో నువ్వు పెళ్లి చేసుకున్నావు. నీ పక్కన ఇంకొక అమ్మాయిని ఊహించుకోవడమే నాకు కష్టం అనిపించింది. తట్టుకోలేకపోయాను. అందుకే నీకు చెప్పకుండా ట్రాన్స్ఫర్ పెట్టుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాను. నన్ను కలవద్దని, ఫోన్ చేయవద్దని నీ దగ్గర మాట తీసుకున్నాను ఎందుకంటే నీ స్వరం వింటే నేను తిరిగి నీ దగ్గరకు వచ్చేసేదాన్నేమో అన్న భయం.

ఆ తర్వాత చెల్లెల్ల పెళ్లిళ్లు అయ్యాయి. అమ్మ కూడా నన్ను వదిలి వెళ్లిపోయింది. ఇన్నాళ్లు నన్ను నడిపించిన బాధ్యతలన్నీ ముగిశాక, ఒకరోజు నిశ్శబ్దంగా కూర్చుని నా జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నాను. అప్పుడు నాకు తెలిసింది, కాలం ఎంతో దూరం తీసుకెళ్లినా, నా హృదయంలో మాత్రం ఒక జ్ఞాపకం చెక్కుచెదరకుండా నిలిచి ఉందని. అది నువ్వు. మన మధ్య దూరం పెరిగింది, జీవితాలు వేర్వేరు దారుల్లో నడిచాయి. అయినా నా మనసు మాత్రం నీ జ్ఞాపకాన్ని ఎప్పుడూ విడిచిపెట్టలేకపోయింది.

లక్ష్మణ్... నిన్ను వదిలేశానని అనుకోకు. నీ జీవితమైనా బాగుండాలని, మరొకరిని పెళ్లి చేసుకునేలా నిన్ను పురికొల్పి, నా కళ్లారా నీ పెళ్లిని చూసి వచ్చేశాను. ఆ రోజు నా గుండె ముక్కలైనప్పటికీ, నీ ముఖంలో కనిపించిన సంతోషమే నాకు ధైర్యాన్ని ఇచ్చింది. నువ్వు సంతోషంగా ఉంటే, అదే నా జీవితానికి అర్థం. కలిసి జీవించే అదృష్టం మనకు దక్కకపోయినా, నిన్ను ప్రేమించిన జ్ఞాపకం మాత్రం నా చివరి శ్వాస వరకు నాతోనే ఉంటుంది.

ఇప్పుడు దైవసన్నిధిలో ధ్యానం చేస్తూ రోజులను గడుపుతున్నాను. నువ్వు ఇప్పుడు ఒకరికి భర్తవు, ఇద్దరు పిల్లలకు తండ్రివి, నీ తల్లిదండ్రులకు ఒకే ఒక్క కొడుకువి. నీ జీవితానికి, నీ బాధ్యతలకు నేను దూరంగా ఉండటమే మంచిదని భావించాను. అందుకే ఇన్ని సంవత్సరాలు మౌనంగా ఉండిపోయాను. నీకు చెప్పకుండా, నీకు దూరంగా వెళ్లిపోయినందుకు నన్ను క్షమిస్తావని ఆశిస్తున్నాను. ఎక్కడ ఉన్నా... నువ్వు సంతోషంగా ఉంటే అదే నాకు చాలూ.

నీ... అనన్య.

పన్నెండు సంవత్సరాలుగా నన్ను వెంటాడిన ప్రశ్నకు సమాధానం దొరికింది. కానీ ఆ సమాధానం ఆనందాన్ని ఇవ్వలేదు. ఒక విచిత్రమైన ప్రశాంతతను మాత్రమే ఇచ్చింది. అనన్య నన్ను వదిలిపెట్టలేదు. ప్రేమించింది. అందుకే దూరమైంది.

లేఖ చదవడం పూర్తయ్యేసరికి నా కళ్లలో నీళ్లు ఆగలేదు. తన ప్రేమలో స్వార్థం లేదు, తన దూరంలో కూడా బాధ్యతే ఉంది. మా ఇద్దరి మార్గాలు వేరు అయినా, ఆ ప్రేమ వ్యర్థం కాలేదు. కలిసి జీవించకపోయినా, ఒకరి జీవితాన్ని మరొకరు నిలబెట్టిన అనుబంధంగా అది మిగిలిపోయింది. ఇక నా ప్రయాణం నేను సాగాలి... నేను నెమ్మదిగా ఇంట్లోకి వెళ్లి నిఖిలను చూశాను. ఆమె నవ్వులో నమ్మకం ఉంది. నా పిల్లల కళ్లలో భవిష్యత్తు ఉంది.

అనన్య నా గతం.

నిఖిల నా వర్తమానం.

ఈ రెండింటి మధ్యే నా జీవితం.

◆◆



# ఖాళీ కుర్చీ

జ్యోతి మువ్వల
9008083344




కాఫీ కప్పు రామ్మూర్తి చేతిలో స్వల్పంగా వణుకుతోంది. అది వయసు వల్లనా, వ్యాధి వల్లనా తెలియదు. కానీ కప్పు అంచు దాటి టేబుల్ మీద పడిన రెండు చుక్కలను లక్ష్మమ్మ మాత్రం అలవాటైన ప్రేమతో తన చీరకొంగుతో తుడిచేసింది. 'నువ్వు చిన్నప్పుడు పిల్లలకు అన్నం కలిపి పెట్టేవాడివి. ఇప్పుడు నేను నీకు కాఫీ తాపించాల్సి వస్తోంది' అంది నవ్వుతూ. రామ్మూర్తి కూడా నవ్వాడు. కానీ ఆ నవ్వు కళ్ల వరకూ చేరలేదు. అతని వయసు ఎనభై అయిదు. కొన్నేళ్లుగా ఆల్జీమర్స్ అతని జ్ఞాపకాల మీద మెల్లగా మబ్బులా కమ్ముకుంటోంది. కొన్నిసార్లు గతం మొత్తం నిన్న జరిగినట్టుగా గుర్తుంటుంది. మరికొన్నిసార్లు ఎదురుగా ఉన్నవాళ్లు ఎవరో కూడా గుర్తుకురారు. మలమూత్రాల మీద కూడా నియంత్రణ కోల్పోయాడు. తన భార్య లక్ష్మమ్మకు ఇప్పుడు భర్త రామ్మూర్తి పసిపిల్లాడిలా మారిపోయాడు.

వాళ్లకు ఇద్దరు పిల్లలు. కొడుకు అనిల్ బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు స్వాతి పెళ్లి చేసుకుని అమెరికాలో స్థిరపడింది. ఒకప్పుడు పిల్లల నవ్వులతో, పాఠశాల బ్యాగులతో, పండగల సందడితో కళకళలాడిన ఇల్లు ఇప్పుడు ఇద్దరి శ్వాసలతో మాత్రమే నిండిపోయింది. అలా సాగుతున్న జీవితంలో ఒకరోజు లక్ష్మమ్మ బాత్రూంలో జారి పడింది. తుంటి ఎముక విరిగింది. ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత ఆమెకు నడవడం కూడా కష్టమైపోయింది. కొన్ని నెలలు అనిల్ సెలవు పెట్టి, తల్లిదండ్రుల దగ్గరే ఉన్నాడు. కానీ సెలవులు ఎప్పటికీ కొనసాగవు. బెంగళూరులో ఉద్యోగం ఎదురుచూస్తోంది. అతని భార్య కూడా ఉద్యోగం చేస్తుంది. ఇద్దరు చిన్న పిల్లలు. ఇంటి అద్దె, పిల్లల చదువులు, బ్యాంకు ఈఎంఐలు. ప్రతి నెలా జీతం వచ్చేముందే ఖర్చులు వరుస కట్టేవి. రాత్రిళ్లు అందరూ నిద్రపోయాక అనిల్ ఒంటరిగా కూర్చుని లెక్కలు చూసేవాడు. ఒకవైపు తల్లిదండ్రుల వైద్య ఖర్చులు. మరోవైపు పిల్లల భవిష్యత్తు.

'ఇంకో మార్గం ఉంటే ఎంత బాగుండేది...' అని ఎన్నోసార్లు అనుకున్నాడు. తల్లిదండ్రులను చూసుకోవడానికి పనిమనుషులను పెట్టాడు.

కానీ రామ్మూర్తి పరిస్థితిని తట్టుకోలేక ఒకరి తర్వాత ఒకరు వెళ్లిపోయారు. చివరకు అనిల్ ఒక నిర్ణయం తీసుకున్నాడు. ఆ నిర్ణయం తీసుకున్న రాత్రి అతనికి నిద్ర రాలేదు. చాలాసేపు నిద్రపోకుండా పైకప్పు వైపు చూస్తూ గడిపాడు. తాను సరైనదే చేస్తున్నాడా? లేక తండ్రిని అన్యాయం చేస్తున్నాడా? అని ప్రశ్నించుకున్నాడు.

ఆ ప్రశ్నకు సమాధానం అతనికే దొరకలేదు.

• • •

నెల రోజుల తర్వాత. ఆకాశం మబ్బులతో నిండిపోయింది. చినుకులు పడుతున్నాయి. అనిల్ కారులో తల్లిదండ్రులను తీసుకెళ్తున్నాడు.

'ఎక్కడికి రా?' అని అడిగాడు రామ్మూర్తి.

'ఒక చోటికి నాన్న,' అన్నాడు అనిల్. కొద్దిసేపటికి కారు ఒక పెద్ద భవనం ముందు ఆగింది. బోర్డు మీద 'సంతోష వృద్ధాశ్రమం' అని ఉంది.

లక్ష్మమ్మకి ఒక్కసారిగా గుండె బరువైంది. రామ్మూర్తి మాత్రం బోర్డు వైపు చూస్తూ నిలబడ్డాడు. అతని ముఖంలో బాధ కనిపించింది. కానీ ప్రశ్న మాత్రం కనిపించలేదు. బహుశా సమాధానం ముందే తెలిసిపోయి ఉండొచ్చు. లోపలికి వెళ్లారు. అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. డాక్టర్, నర్సులు ఉన్నారు. వాతావరణం శుభ్రంగా ఉంది. భద్రత ఉంది. కానీ... అది ఇల్లు కాదు.

'నాన్న...' అనిల్ గొంతు వణికింది.

'నేను ఎంతో ప్రయత్నించాను. కానీ మిమ్మల్ని చూసుకోవడం నాకు కుదరటం లేదు.' రామ్మూర్తి మౌనంగా ఉన్నాడు.

'నేను చెడ్డ కొడుకుని కాదు నాన్న.' అనగానే అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. కొద్దిసేపు రామ్మూర్తి అతని వైపు చూశాడు. తర్వాత మెల్లగా అన్నాడు.

'నీకు చిన్నప్పుడు జ్వరం వస్తే రాత్రంతా నీ పక్కనే కూర్చునేవాళ్లం. కానీ ఇప్పుడు మేము నీకు భారమైపోయామా?' అన్న మాటలకు

అనిల్ తల వంచుకున్నాడు. ఆ మాటకు సమాధానం అతని దగ్గర లేదు.

అప్పుడే రామ్మూర్తి మనసులో ఒక జ్ఞాపకం మెరిసింది. అనిల్ మొదటిసారి స్కూల్‌కి వెళ్లిన రోజు. గేటు దగ్గర నిలబడి ఏడుస్తూ తన చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

'నాన్న... నువ్వు వెళ్లిపోవద్దు..'

అప్పుడు రామ్మూర్తి నవ్వుతూ, 'సాయంత్రానికి వచ్చేస్తాను రా,' అని చెప్పి అతని చేతిని వదిలించాడు.

ఇప్పుడు...ఏళ్ల తర్వాత...

తన చేతిని వదిలించుకుని వెళ్తున్నది అదే కొడుకు. రామ్మూర్తి కళ్లలో నీళ్లు మెరిశాయి. కానీ కొడుకు భుజం మీద చేయి వేసి,

'సర్లే రా...' అన్నాడు.

ఆ రోజు సాయంత్రం అనిల్ వెళ్లిపోయాడు.

కారు గేటు దాటి కనిపించకుండా పోయే వరకు రామ్మూర్తి చూస్తూనే ఉన్నాడు.

ఆ రాత్రి ఒక్కసారిగా నిద్రలేచి, 'మన ఇంటి వరండా లైట్ ఎందుకు ఆఫ్ చేశారు?' అని అడిగాడు.

లక్ష్మమ్మ గుండె పిండేసినట్టు అయింది. 'ఇది మన ఇల్లు కాదు' అని చెప్పడానికి ఆమెకు ధైర్యం రాలేదు.

ఆమె నిశ్శబ్దంగా అతని చేయి పట్టుకుంది.

రోజులు గడిచాయి.

• • •

స్వాతి అమెరికా నుంచి వీడియో కాల్స్ చేసేది. అనిల్ వారానికి ఒకసారి వచ్చేవాడు. మందులు ఉన్నాయి. డాక్టర్లు ఉన్నారు. జాగ్రత్తగా చూసుకునే వారూ ఉన్నారు. కానీ ఇంటి వాసన మాత్రం లేదు. రాత్రిళ్లు రామ్మూర్తి ఒక్కసారిగా లేచి,' మన ఇంటికి వెళ్దామా?' అని అడిగేవాడు.

లక్ష్మమ్మ సమాధానం చెప్పలేకపోయేది. ఆమె దిండుకింద దాచుకున్న ఇంటి తాళాలను అప్పుడప్పుడు చేతిలోకి తీసుకుని చూస్తుండేది. ఇల్లు గుర్తు చేసుకోవడానికి.

ఒక వర్షపు సాయంత్రం. అనిల్ వృద్ధాశ్రమానికి వచ్చాడు. రామ్మూర్తి అతని వైపు చూసి, 'నువ్వెవరు?' అని అడిగాడు. అనిల్ గుండె ఒక్కసారిగా బరువైంది. ఎంతో ప్రేమగా పెంచిన తండ్రి తనను గుర్తుపట్టలేకపోయాడు. ఆ రోజు ఇంటికి తిరిగి వెళ్తూ రోడ్డుపక్కన

తరువాయి 20పేజీలో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

(4వ పేజీ నుంచి)

# ఖాళీ కుర్చీ

కారు ఆపాడు. స్టీరింగ్ మీద తల వాల్చుకున్నాడు. ఎన్నో రోజులుగా ఆపుకున్న కన్నీళ్లు ఒక్కసారిగా బయటపడ్డాయి. కానీ వాటిని చూసేవాళ్లు ఎవరూ లేరు.

• • •

రోజులు నెలలయ్యాయి. ఆల్జీమర్స్ రామ్మూర్తిని పూర్తిగా తనలోకి లాక్కుంది. ఒక రాత్రి అతని ఆరోగ్యం ఒక్కసారిగా విషమించింది. లక్ష్మమ్మ మంచం పక్కనే కూర్చుంది. రామ్మూర్తి మెల్లగా కళ్లుతెరిచాడు. ఎన్నో రోజుల తర్వాత అతని చూపులో ఒక స్పష్టత కనిపించింది. చుట్టూ చూశాడు. తర్వాత అడిగాడు.

'అనిల్ వచ్చాడా?'..లక్ష్మమ్మ కళ్లలో నీళ్లు ఉబికాయి. ఎన్నో నెలల తర్వాత మొదటిసారి అతనికి తన కొడుకు గుర్తొచ్చాడు. అనిల్‌కు ఫోన్ చేశారు.

కానీ అతను చేరుకునేలోపే... రామ్మూర్తి చివరి శ్వాస విడిచాడు. అతని పెదవుల మీద మాత్రం చిన్న చిరునవ్వు మిగిలింది. బహుశా తన కొడుకు వస్తున్నాడని నమ్మకంతోనో, లేదా తన ఇంటికి తిరిగి వెళ్తున్నాననే భావంతోనో... ఎవరికి తెలియదు. అంత్యక్రియలు ముగిశాయి. జనం వెళ్లిపోయారు. ఇల్లు మళ్లీ నిశ్శబ్దమైంది. బయట వర్షం పడుతోంది. గోడ మీద రామ్మూర్తి ఫోటో ఉంది. లక్ష్మమ్మ మంచం మీద కూర్చుని ఉంది. అనిల్ ఆమె పక్కన కూర్చున్నాడు. కొద్దిసేపు ఇద్దరూ మాట్లాడలేదు.

'అమ్మా...' అనిల్ మెల్లగా పిలిచాడు.

'నన్ను క్షమించవా?' లక్ష్మమ్మ వెంటనే సమాధానం చెప్పలేదు. ఒకసారి గోడ మీద ఉన్న ఫొటో వైపు చూసింది. తర్వాత అతని వైపు తిరిగి మెల్లగా అడిగింది.

'నువ్వు నిన్ను నువ్వు క్షమించుకున్నావా?'

అనిల్ తలదించుకున్నాడు. సమాధానం లేదు. వరండాలో రామ్మూర్తి కూర్చునే కుర్చీ ఖాళీగా ఉంది. వర్షం మాత్రం పడుతూనే ఉంది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# పిల్లలు తెచ్చిన మార్పు

**నారంశెట్టి ఉమామహేశ్వరరావు**

ఆనందపురం ఒకప్పుడు చిన్న గ్రామం. పాతికేళ్లలో చాలా మార్పులు రావడంతో బాటు ఊరి జనాభా అనూహ్యంగా పెరగడంతో అదొక పట్టణం అయింది. ఒకప్పుడు అక్కడి వారు ఆనందంగా ఉండేవారు.

చుట్టూ పచ్చని పొలాలు, మామిడి తోటలు, స్వచ్ఛమైన లేని గాలి వీస్తుండేది. పక్షుల కిలకిలారావాలతో, సూర్యుని మునులతో కిరణాలతో ఊరు నిద్ర నుంచి మేల్కొనేది.

కానీ అదంతా గతం. ఇప్పుడా ఊరుకి పెద్ద శాపమై కూర్చుంది ఊరు చివర ఉన్న చెత్త నిలవ ప్రదేశం.

ఒకప్పుడది ఊరి చివరే ఉండేది. జనాభా పెరగడంతో పాటు ఇళ్ల పెరగడంతో చెత్త నిల్వ ప్రదేశం ఇప్పుడి ఊరి మధ్యలో ఉన్నట్టయింది.

ప్లాస్టిక్ కవర్లు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, కుళ్లిన పదార్థాలన్నీ అందులో కుప్పగా పోయడంతో ఒకప్పటి చెత్తకుప్ప ఇప్పుడు చెత్త కొండ అయింది. దానినుండి వచ్చే విషపూరితమైన మిథేన్ గ్యాస్ వల్ల అక్కడ తరచూ మంటలు రేగేవి. ఘాటైన దుర్వాసన వ్యాపించేది.

అక్కడికి దగ్గరలో 'స్నేహ నిలయం' అనాథాశ్రమం ఎప్పటి నుండో ఉంది. అక్కడి పిల్లలు తెలివైనవారు. చురుగ్గా ఆటపాటల్లో పాల్గొనేవారు. ఇప్పుడు వాళ్లకు కష్టాలు మొదలయ్యాయి. చెత్త కొండ నుంచి వచ్చే నల్లటి విషపూరిత పొగ స్నేహ నిలయం పిల్లల చిరునవ్వులను మింగేయడం మొదలుపెట్టింది.

ఒక శీతాకాలం రాత్రి పిల్లలంతా గాఢ నిద్రలో ఉండగా వ్యర్థాల నుండి మంటలు పుట్టాయి. దట్టమైన పొగ చుట్టూ వ్యాపించింది. అది స్నేహనిలయాన్ని చుట్టేసింది.

“అమ్మా! ఊపిరి ఆడటం లేదు!” అంటూ ఆశ్రమంలో ఒక్కసారిగా పిల్లల అరుపులు, కేకలు వినిపించాయి.

కళ్లు తెరిచి చూసేసరికి ఆశ్రమం అంతా తెల్లటి దట్టమైన పొగ ముంచెత్తింది. అక్కడున్న అందరికీ కళ్లు మండుతున్నాయి. గొంతులో మంట పుడుతోంది. ఒక్కో చిన్నారి భయంతో వణుకుతూ, “నాకు ఊపిరి అందడం లేదు, మనం చనిపోతామా?” అని ఏడవడం మొదలుపెట్టారు.

ఆశ్రమ నిర్వాహకురాలు సరస్వతి అమ్మ క్షణాల్లో అప్రమత్తమైంది. పిల్లలందరినీ ఒక గదిలోకి తీసుకెళ్లి తడిగుడ్డలు ముక్కులకు కట్టింది. “భయపడకండి. ఈ తడి గుడ్డల ద్వారా శ్వాస పీల్చండి. పొగ లోపలికి వెళ్లదు” అని ధైర్యం చెప్పింది.

అప్పటికే ఆలస్యం అయింది. రాజు అనే పిల్లాడికి తీవ్రమైన ఆస్తమా లాంటి దగ్గు మొదలైంది. ఊపిరి పీల్చుకోలేక, ముఖం నీలంగా మారి నేలపై కూలబడ్డాడు. పిల్లలు భయంతో వేస్తున్న కేకలకు దగ్గర్లోని ఇండ్ల నుండి పరుగున కొందరు వచ్చి పిల్లలను ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

ఆ రాత్రి ఆనందపురంలో పిల్లల దగ్గుల చప్పుడు, అంబులెన్స్ సైరన్ మోతలు ఎక్కువ వినిపించాయి.

ఆసుపత్రికి తీసుకెళ్ళిన పిల్లల్ని ఊపిరితిత్తుల నిపుణుడు డాక్టర్ రాజీవ్ పరీక్షించారు.

ఆయన సరస్వతి అమ్మతో “పిల్లలు పీల్చింది మామూలు పొగ కాదు. ప్లాస్టిక్, రసాయనాలు కాలడం వల్ల 'డయాక్సిన్లు', 'ఫ్యూరాన్లు' లాంటి భయంకరమైన విషవాయువులు విడుదలవుతున్నాయి.

ఇవి ఊపిరితిత్తులను పాడు చేయడమే కాకుండా క్యాన్సర్‌కు దారితీస్తాయి. ఇలాగే వదిలేస్తే పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుంది. వాళ్ళ ఆరోగ్యాలు చెడిపోతాయి. స్నేహ నిలయం కాస్త శ్మశానంగా మారుతుంది” అన్నారు.



ఆమెతో బాటు ఆసుపత్రికి వచ్చిన నరగామస్థులు కూడా డాక్టర్ చెప్పింది విన్నారు. అయితే వాళ్లు ఆ విషయాన్ని తీవ్రంగా తీసుకోలేదు. సరికదా “డాక్టర్‌గారూ! చెత్త అక్కడ కాకపోతే ఎక్కడ వేస్తారు? ఇంత కాలం లేనిది ఇప్పుడేమవుతుంది?”

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

అన్నారు తేలిగ్గా. ఆ మాటలు ఆశ్రమం పిల్లలైన రాజు, సితారల మనసును గాయపరిచాయి.

“ఊరివాళ్లు స్వార్థంతో, నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలి” అన్నాడు రాజు ఆవేదనగా.

సితార “వాళ్లకు మాటలతో చెప్తే అర్థం కాదు. కళ్లకు కట్టేలా చూపిద్దాం!” అంది.

పిల్లలంతా ఒక సైన్యంగా ఏర్పడ్డారు. పర్యావరణంపై అవగాహన కోసం ఏం చేస్తే బాగుంటుందో బాగా ఆలోచించారు. తన పాత ఫోన్‌తో చెత్త నిల్వ ప్రదేశం దుస్థితిని, ప్లాస్టిక్ వల్ల పశువులు చనిపోతున్న దృశ్యాలను, ఆసుపత్రిలో శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న స్నేహ నిలయం పిల్లల బాధలను వీడియోలు తీశాడు రాజు.

సితార, అర్జున్ కలిసి రసాయన పొగ వల్ల ఊపిరితిత్తులెలా నల్లగా మారిపోతాయో చార్టులపై చిత్రాలు గీశారు. అర్జున్ ఒక పెద్ద బ్యానర్ తయారు చేశాడు “ఈరోజు మీరు కాల్చే ప్లాస్టిక్ రేపు మీ పిల్లల శ్వాసను తోడేస్తుంది!” అని రాసాడు.

ప్రతి గురువారం అక్కడకి దగ్గర్లో గ్రామ సంత జరుగుతుంది. అలా జనమంతా సంతలో గుమిగూడి ఉన్నప్పుడు స్నేహ నిలయం పిల్లలు ఒక వీధి నాటకం ప్రారంభించారు. అర్జున్ నల్లటి ముసుగు వేసుకుని “నేను ప్లాస్టిక్ రాక్షసుడిని.. నన్ను కాల్చితే నేను విషంగా మారి మీ రక్తాన్ని తాగుతాను” అంటూ గర్జించాడు.

మరోవైపు చిన్ని అనే అమ్మాయి దగ్గుతూ, ఊపిరి ఆడక నేలపై పడిపోతున్నట్లు నటించింది.

ఆ దృశ్యం ఎంత సహజంగా ఉందంటే, అక్కడ ఉన్న తల్లుల కళ్లలో నీళ్లు తిరిగాయి. పెద్దల గుండెల్లో పశ్చాత్తాపం మొదలైంది. ఆ నాటకాన్ని ఒక పత్రికా విలేకరి వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది వైరల్ అయ్యింది.

తాను పనిచేసే పత్రికలో కూడ ఈ విషయం గురించి రాయడంతో కలెక్టర్ గారికి తెలిసింది. ఆయన స్వయంగా అక్కడకి వచ్చి సమస్యను తెలుసుకున్నారు. పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

అదలా ఉండగా.. ఒక రాత్రి ఆశ్రమం కిటికీ గుండా బయటకు చూస్తున్న రాజుకి ఏదో జరగకూడనిది జరుగుతున్న అనుమానం వచ్చింది. పక్కనే ఉన్న అర్జున్‌కి అటు వైపు చూపించాడు.

అదేమిటంటే డంపింగ్ యార్డ్ వైపు పెద్ద కంటైనర్ లారీ వెళ్లడం, కొందరు వ్యక్తులు కొన్ని డ్రమ్ములను



దింపి, చెత్తలో కలిపి నిప్పు పెట్టడం గమనించారు. ఆ మంటల నుండి వింతైన రంగుల పొగ రావడం వారికి కనబడింది.

రాజు “అర్జున్, అది మన ఊరి చెత్త కాదు. ఎక్కడో ఉన్న ఫ్యాక్టరీ తాలూకు రసాయనాల వ్యర్థాలు!” అని గుసగుసగా చెప్పాడు. ఇద్దరూ ధైర్యం చేసి చీకట్లోనే లారీ నంబర్, వాళ్లు చేస్తున్న పనిని చిత్రించే దృశ్యాలను వీడియో తీశారు.

తెల్లారిన తరువాత తాము తీసిన వీడియోను సరస్వతి అమ్మకి చూపించారు రాజు, అర్జున్.

జిల్లా కలెక్టర్ గారిని కలిసి ఆ వీడియోని అందించి ఫిర్యాదు చేసింది సరస్వతి అమ్మ. ఆమె ఫిర్యాదుతో అక్రమ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేసి, భారీ జరిమానా విధించారు. డంపింగ్ యార్డ్‌లో చెత్త కాల్చడాన్ని చట్టరీత్యా నేరంగా ప్రకటిస్తూ బోర్డులు పెట్టారు.

కలెక్టర్ ఆదేశాలు, పిల్లల స్ఫూర్తితో ఆనందపురం రూపురేఖలు కొద్దికొద్దిగా మారడం ప్రారంభమైంది. ప్రతి ఇంటికి తడి చెత్త, పొడి చెత్త అని రెండు బుట్టలు ఇచ్చారు. ఊరిలో ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించి, బట్ట సంచులను వాడటం మొదలుపెట్టారు. తడి చెత్తను గ్రామ శివార్లలో ప్రకృతిసిద్ధమైన ఎరువుగా మార్చి, పొలాలకు వాడుకోవడం ప్రారంభించారు. అన్నిటికంటే ముఖ్యంగా పిల్లల ఆధ్వర్యంలో “ఒక బిడ్డ ఒక మొక్క” అనే ఉద్యమం మొదలైంది. ఒకప్పుడు విషపు పొగలు చిమ్మిన ఆ చెత్త కొండను పూర్తిగా అక్కడి నుంచి తొలగించి, ఊరుకి దూరంగా కొండల మధ్యకి తరలించారు. చెత్త ఉండే స్థలంలో మైదానం తయారు చేశారు. అక్కడ పిల్లలంతా కలిసి వందలాది వేప, రావి, చింత, మామిడి మొక్కలు నాటారు.

కొన్నాళ్లు గడిచేసరికి అక్కడొక పచ్చని ఉద్యానవనం తయారైంది. అక్కడ సీతాకోకచిలుకలు తిరుగుతుండగా, మొక్కలకు నీళ్లు పోస్తున్న చిన్ని చేతుల్ని గాల్లోకి చాచి ఎంతో హాయిగా శ్వాస తీసుకుంది.

పక్కన ఉన్న సితారతో “అక్కా.. ఇక్కడ ఒకప్పుడు విషపు పొగ ఉండేది.. ఇప్పుడు పూల సువాసనలు వస్తున్నాయి. ఇలా చూస్తూ ఆడుకోవడం ఎంత బాగుందో కదా” అంది.

దూరం నుండి చూస్తున్న సరస్వతి అమ్మ కళ్లలో ఆనందబాష్పాలు మెరిశాయి. ఆమె “పర్యావరణాన్ని రక్షించడానికి పెద్ద చదువులు అక్కర్లేదు, స్వచ్ఛమైన సంకల్పం ఉంటే చాలు. సృష్టిని మార్చేయవచ్చు!” అనుకుంది.

ఆకాశంలో తెల్లటి మేఘాలు స్వేచ్ఛగా కదులుతుంటే, ఆనందపురంలో పిల్లల స్వచ్ఛమైన నవ్వులు మళ్లీ మారుమోగాయి. ■

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

పి.ఎల్.ఎన్. మంగారత్నం
9701426788

మినీ కథ



# కాదేదీ వేడుకకు అనర్హం

అవి పదవ తరగతి రిజల్ట్స్ వచ్చిన రోజు. ఊరంతా ఏదో తెలియని ఉత్సాహం. ఉల్లాసం రంగరించుకున్న వాతావరణం. పుల్లారెడ్డి స్వీట్ల దుకాణం వాళ్ళకి గిరాకీ ఉన్న రోజు. పాస్ అయిన పిల్లల తల్లిదండ్రులు ఉత్సాహంగా సంబరాలు జరుపుకుంటున్న సందర్భం. అన్నీ చూస్తున్న జ్ఞానేశ్వర్ మాత్రం దిగులుగా ఉన్నాడు. అతనికి ఆ పేరు పెట్టినందుకో ఏమో! జ్ఞానం అనేది కొద్దిగా అయినా లేకుండా పోయింది.

'ఏమిట్రా! ఏం మార్కులు ఇవీ.. మరీ రెండు మార్కులా? నా సబ్జెక్టులో నేను ఇలాగే పాఠం చెబుతున్నానా? మిగిలిన వాళ్ళకూ ఇలాగే వస్తున్నాయా మార్కులు? కాస్త జ్ఞానం తెచ్చుకుని చదవరా బాబూ!' అంటూ మొత్తుకునే వారు తెలుగు మాష్టారు జానకి రామయ్య పంతులు. అతను రెండవ తరగతిలో ఉన్నప్పుడే. నిజానికి అదే కొరవడింది జ్ఞానేశ్వర్‌కి. అయితే, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. ఏం ఆలోచిస్తాడో! ఎవరికీ తెలీదన్నట్లు.

ప్రస్తుతం సెవెంతు క్లాసులో కామన్ పరీక్షలు తీసేయ్యడంతో.. అటెండెన్సు సహాయంతో నిరాటంకంగా ఎనిమిదిలోకి అడుగుపెట్టాడు. ఏదోలా పదిలోకి వచ్చాడు. సంవత్సరం చివరాఖరున పెద్ద పరీక్షలు కూడా రాసేసాడు. అయితే, ఫెయిల్ అయ్యాడు.

ఏ ఒక్క సబ్జెక్ట్.. రెండు సబ్జెక్ట్‌లో కాదు.. మొత్తం అన్ని సబ్జెక్ట్‌లోనూ.

రిజల్ట్స్‌తో పాటు వచ్చిన మార్కుల లిస్టు చూసి దిగులుపడ్డాడు. అమ్మానాన్నా ఏమంటారోనని భయపడ్డాడు. చరిత్రలో ఇదే మొదటి ఫలితం కావచ్చు.

'ఎంత చదివినా గుర్తు ఉండకపోవడం తన తప్పుకాదు. అయితే ఏం చెయ్యాలి?' అని ఆలోచిస్తున్నాడు.

'ఆత్మహత్య చేసుకోవాలా! చేసుకుంటే.. ఎలా చేసుకోవాలి? ఉరి వేసుకోవాలా? నదిలో దూకాలా? ఇల్లు వదిలి వెళ్ళిపోవాలా?' ఇలా ఎన్నో ఆలోచనలు జ్ఞానేశ్వర్‌ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఏదో ఒకటి చెయ్యకపోతే పరీక్ష ఫలితాలకు ఫలితం ఏముంది?

అయితే, తనని అమ్మానాన్నలు ఏమీ అనలేదు. కనీసం ముఖం చిట్లించనూ లేదు.

పైగా ఇంటి ముందు షామియానా వేసి.. క్లాసులో ఉండే పిల్లల్ని అందర్నీ పిలిచి, కేకు కట్ చేయించి మరీ ఖుషీ చేసుకున్నారు. అది చూసి పత్రికల వాళ్ళు కూడా వచ్చారు. దాంతో వేడుక మరింత రక్తి కట్టింది. అయోమయంగా చూసాడు జ్ఞానేశ్వర్.

'ఇలాక్కూడా జరుగుతాయా?' అన్నట్లు.

'ఆంటీ గారూ! ఏమిటి? ఈ ఫంక్షను? మీ అబ్బాయి జ్ఞానం ఏ సబ్జెక్ట్‌లోనూ పాస్ కాలేదు కదా!. క్లాసు మొత్తానికి ఏ సబ్జెక్ట్ పాస్ కానిది .. ఒక్క మన జ్ఞానం మాత్రమే కదా! ఇలాంటివాటికి కూడా డబ్బు ఖర్చు చేసి వేడుక చేస్తారా? ఎవరైనా?' ఆశ్చర్యంగా అడిగారు పిల్లలు.

'ఎవరి సంగతో మాకు ఎందుకయ్యా! పాస్ అయితేనే ఫంక్షన్లు చేసుకోవాలా? పరీక్ష ఫెయిల్ అయినవాళ్ళు మాత్రం చేసుకోకూడదా? సంతోషం ఎవరికైనా సంతోషమే. మా జ్ఞానం ఇప్పుడు కాకపోతే.. వచ్చేసారి పాస్ అవుతాడు. అనగననగ రాగామతిశయించునుండు .. తినగతినగ వేము తియ్యనుండు అన్నట్లు .. చదవగా .. చదవగా వాడే పాస్ అవుతాడు' గట్టిగా సమాధానం చెప్పాడు జ్ఞానం తండ్రి.

'అందుకు.. వెంటనే సంప్లిమెంటరీ పరీక్షకు కట్టి చదువుతాడు. వాడు ఆనందంగా ఉండడమే మాకు కావలసింది' చెప్పింది తల్లి.

శ్రీ జ్ఞాన ప్రసూనాంబ కొడుక్కి దిశానిర్దేశం చేస్తున్నట్లు. అప్పుడు బుర్ర వెలిగింది జ్ఞానేశ్వర్‌కి. ముఖం వికసించింది. అవును. 'నేను మళ్ళీ పరీక్ష ఫీజు కడతాను.. రాస్తాను. ఇక ఆత్మహత్యతో పనేముంది? ఇంట్లో నుంచి వెళ్ళిపోవలసిన పని ఏమిటీ?' అనుకున్నాడు.

'వార్తల్లో వార్తగా.. రేపు పత్రికలో ఇదీ రావాలి' చెప్పాడు తండ్రి జ్ఞానానందరావు.

'అలాగే' అన్నట్లు తలూపాడు విలేకరి గుర్నాథం. అందుకు సంబధించిన పొటోలు ముందే తీసుకోవడంతో.. జ్ఞానం తేలికపడ్డాడు.

తన తోటివాళ్ళలాగే రేపు తన పేరు కూడా పత్రికల్లో వస్తున్నందుకు.

---

## చివరి మాట

చివరి క్షణాల గడపపై నిలబడి
నీతో ఒక మాట చెప్పాలని ఉంది...
మనసు మూలల్లో దాచుకున్న
చిన్న కోరికను వినిపించాలని ఉంది...

నా మాట నీ హృదయాన్ని చేరకపోయినా,
నా భావం నీ మనసును కదిలించకపోయినా,
నా కోరికకు నీ సమ్మతి లభించకపోయినా,
ఫర్వాలేదు...
కొన్ని కోరికలు నెరవేరకపోయినా
మనిషి బతకగలడు, కానీ
కొన్ని బంధాలు దూరమైతే
మనసు ఒంటరైపోతుంది.

అందుకే...నీ ముందుంచే నా కోరికకు
అంగీకారం లభించకపోయినా,
నా మాటను నువ్వు మౌనంగా వదిలేసినా,
మన మధ్య ఆత్మీయంగా నడిచిన రోజుల్ని
ఎప్పటికీ మార్చేయకు.

స్నేహమనే అందమైన పుస్తకంలో
ఒక పేజీ నచ్చలేదని
మొత్తం పుస్తకాన్నే మూసేయకు.
మన స్నేహాన్ని దూరం చేసే హక్కు
కాలానికైనా ఇవ్వకు....

వెళ్లేముందు చివరి మాట..
రేపు నేను జ్ఞాపకంగా మిగిలిపోయినా,
ఈరోజులాగే నన్ను స్నేహితుడిగానో,
చిరకాల ఆత్మీయుడిగానో గుర్తుంచుకోమని...
మన మధ్య ఈ అనుబంధం
ఎప్పటికీ ఇలాగే కొనసాగుతుందని...
ఈ చిన్న హామీ ఇస్తావుగా..

కంచర్ల [illegible]బాబు
9[illegible]9231

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

సింగిల్ పేజీ కథ

# సంధ్య

సంధ్య మూడవ కోడలుగా ఆ ఇంట్లో అడుగు పెట్టింది. సులోచన, విజయ మొదటి, రెండో కోడళ్ళు. మామగారు కాలం చేశారు. ఇంటి పెత్తనమంతా కాంతం గారిదే. ఇద్దరి కొడుకులకి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. సులోచన, విజయ మాత్రం డియస్సి చదువుతున్నారు. చిన్న కొడుకు రామంది ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్ ఉద్యోగం. సంధ్య ఇంటర్ గట్టెక్కింది. ఈ లోపు అబ్బాయి మంచోడు అని పెళ్ళి చేశారు. సంధ్యకు మాత్రం తమ బావల మాదిరి నా భర్తకు ఉద్యోగం లేదనే బాధ ఉండేది.

రామం తన భార్య ఇంటి పనులు చేసుకుంటే చాలు అనుకునేవాడు. ఇద్దరు కోడళ్ళు చదువుతుండడంతో పని భారం సంధ్య, కాంతం మీదనే పడేది. కాలేజీ దగ్గర ఉండడంతో రామం ఇంటికి వచ్చి భోజనం చేసేవాడు. మొదట్లో వంటింట్లో సంధ్యకు చేదోడు వాదోడుగా ఉండేది కాంతం. "మీరు పడుకోండి అత్తయ్యా, నేను చేసుకుంటాను" అని చెప్పేది సంధ్య. దాంతో వంటింట్లోకి రావడం మానేసింది కాంతం. ఉదయమే విజయకు, సులోచనకు, అత్తగారికి తరువాత బావలకు కాఫీ ఇచ్చేది. కనీసం కాఫీ గ్లాసులు సింక్‌లో వేసేవారు కాదు తోడికోడళ్లు. కాంతం మాత్రం ఆయాసపడుతూ కాఫీగ్లాస్ సింక్‌లో వేస్తే "మీకు శ్రమ.. నేను వచ్చి తీసుకుంటానత్తయ్యా" అనేది. "నువ్వు ఒక్కదానివే కష్టపడుతుంటే కనీసం కాఫీ గ్లాస్‌లు అయినా తీసుకోకపోతే ఎలా" అని విజయ, సులోచనలపై మండిపడేది. కాల చక్రం గిర్రున తిరుగుతోంది. ఆ రోజు రిజల్ట్స్ వస్తాయి. విజయ, సులోచన ఇద్దరూ గుడికి వెళ్ళారు. మాటవరసకు కూడా సంధ్యను రమ్మని పిలవలేదు. అది కాంతం మనసును నొప్పించింది. వీళ్లకు ఇంత సర్వీస్ చేస్తోంది. కనీసం మాట వరుసకయినా పిలవ లేదు అనుకుంది. విజయ, సులోచనలకు ఉద్యోగం రాలేదు. దాంతో వాళ్ల భర్తలు "ఇక ఇంటి పనులలో ఒకరికీ ఒకరు సహాయంగా వుండండి" అన్నారు. "వీళ్లకు ఉద్యోగం వస్తుందనే నమ్మకం ఏనాడూ లేదన్నయ్య" అన్నాడు కృష్ణ. "నీ మాదిరి వాళ్ళకు వయసు లేదు" అన్నాడు రామం. "అన్నట్లు సంధ్యను టిటీసి రాయించు" అన్నాడు పెద్దన్నయ్య కుమార్.

"చూస్తా అన్నయ్య" అన్నాడు రామం. "మాకే రాలేదు. ఈవిడకు కానీ రాదు" అనుకున్నారు ఇద్దరు కోడళ్ళు మనసులో. "పెద్ద అన్నయ్య, చిన్న అన్నయ్య మీకో శుభవార్త మా కొలీగ్ కాశీ టూర్ వేశాడు. మీరు వదినెలు, అమ్మ వెళ్ళండి" అన్నాడు. "మరి నువ్వు, సంధ్య" అన్నాడు కుమార్.



"నేను రావడం లేదు. సంధ్యకు అదే రోజు టిటీసి పరీక్ష ఉంది" అన్నాడు.

అమ్మ.. అని రామం నోటిలో నుంచే మాట వచ్చింది. కానీ పెద్ద కొడుకులు, కోడళ్ళు, "అత్తగారిని కాశీకి పిలుచుకుపోతాం" అనలేదు.

కాంతం పరిస్థితి అంతా గమనిస్తోంది. కాశీ ట్రిప్‌కు ఇద్దరు కొడుకులు, కోడళ్ళు మాత్రమే వెళ్ళారు. వాళ్ళు వెళ్లిన నాలుగు రోజులకే సంధ్యకు పరీక్ష. ఇంటిపని అయిపోగానే శ్రద్ధగా చదువుకునేది. అత్త గారు పిలిస్తే వెళ్ళి ఆవిడకు కావాల్సిన మందులు ఇచ్చేది. భోజనం కాగానే పండ్లు ఇచ్చేది.

"నాకు ఉద్యోగం వస్తే మనం వెళదాం అత్తయ్య కాశీకి" అంది సంధ్య. "అలాగే" అంది కాంతం.

అప్పుడే రామం కాలేజీ నుంచి ఇంటికి వస్తూ ఆ మాట విన్నాడు. "ఎక్కడికో పోదాం అంటున్నారు అత్త, కోడళ్ళు" అన్నాడు. "టీచర్ ఉద్యోగం వస్తే మన ముగ్గురం కాశీకండి" అంది సంధ్య అత్త గారి గది నుంచి వస్తూ. "వెళదాం, వెళదాం ముందు ఉద్యోగం రానీ" అన్నాడు. "సంధ్యకు తప్పకుండా వస్తుంది" అంది కాంతం. "రావాలనేగా కోరుకునేది, ముందు భోజనం పెట్టు కాలేజీకి వెళ్ళాలి. రేపే నీ పరీక్ష" అన్నాడు టేబులు ముందు కూర్చుంటూ.

ఆ రోజు పెందలకడనే లేచి భర్త పాదాలకు, అత్త గారి పాదాలకు నమస్కరించి స్నానం చేసి దేవుని దగ్గర దండం పెట్టుకుని "వస్తాను అత్తయ్య, వస్తానండి" అని చెప్పి వెళ్ళింది సంధ్య. సంధ్యకు ఉద్యోగం రావాలని మనసులో అనుకుంది కాంతం. కాశీకి వెళ్ళిన అన్నయ్యలు, వదినెలు ఆ రోజు వచ్చారు. ఆ రోజే టీ.టీ.సి ఫలితాలు.

సంధ్య పరీక్షలో విజయం సాధించింది. అది తెలిసి నివ్వెరపోయారు సులోచన, విజయ. "ఉద్యోగంలో చేరడానికి చాలా టైం ఉంది. అత్తయ్యను పిలుచుకుని మనం కాశీకి వెళదాం" అంది రామంతో. "అలాగే వెళదాం అమ్మ కూడా ఎప్పటినుంచో కాశీకి వెళ్ళాలి అనుకుంటోంది. మనకు పెద్ద దిక్కు కూడా" అన్నాడు రామం.

ఒక కడుపులో పుట్టిన కొడుకులలో ఇంత వ్యత్యాసమా! అనుకుంది కాంతం. కోడళ్ళలో కూడా సంధ్య మాదిరి ఎవ్వరూ పిలువలేదు. అందుకేనేమో వాళ్ళకు ఉద్యోగం రాలేదు అనుకుంది మనసులో. ఒక శుభముహూర్తాన కాశీకి వెళ్ళారు కాంతం, సంధ్య, రామం. "మా కుటుంబం ఎప్పుడూ వేరుపడకుండా చూడు స్వామీ. మా కోడళ్ళకు, కొడుకులకు మంచి బుద్ధి ప్రసాదించు" అని కాశీ విశ్వేశ్వరుణ్ణి వేడుకుంది కాంతం.

– కనుమ ఎల్లారెడ్డి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథాకళి FEED ME A STORY

● మల్లాది వెంకట కృష్ణమూర్తి

# పిలవని అతిథి

హైద్రాబాద్‌లోని మారేడ్‌పల్లిలో రెండువేల చదరపు గజాల విస్తీర్ణంలోని అదొక్కటే అతి పాత ఇల్లు. చుట్టుపక్కల ఇళ్ళన్నీ పడగొట్టి అపార్ట్‌మెంట్ బిల్డింగ్స్ కట్టారు. కాని కింద ఆరు గదులు, పైన ఆరు గదులున్న ఆ పెద్ద ఇల్లు మాత్రం ఏ మార్పులూ లేకుండా ఉంది. అది 1970లలో బాలానగర్‌లో లేత్ మెషిన్స్ తయారు చేసే ఓ పారిశ్రామికవేత్తది. ఆ ఇంటికి వారసురాలైన ఆయన భార్య సిద్ధిధాత్రి ఆ ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది.


ఎనభై రెండేళ్ళ ఆవిడకి నలుగురు పిల్లలు. కూతురికి పెళ్ళై కలకత్తా వెళ్ళిపోయింది. ముగ్గురు కొడుకుల్లో ఒకడు కరోనా సమయంలో పోయాడు. మిగిలిన ఇద్దరిలో ఒకరు డెహ్రాడూన్‌లో టీ పరిశ్రమ నడుపుతున్నారు. మూడో కొడుకు ఇంగ్లండ్‌లో స్థిరపడ్డాడు.

ఆ సాయంత్రం ఆవిడ వంటగదిలోకి వెళ్ళి షెల్ఫ్ తలుపు తెరిచి చూసింది. ఆవిడకి ఆ షెల్ఫ్‌లో కాఫీ పొడి సీసాని కుడివైపు, చక్కెర సీసాని ఎడమవైపు ఉంచటం అలవాటు. కాని అవి అటుదిటు, ఇటుదటు కనిపించడంతో తను వాటిని అలా ఎప్పుడు పెట్టిందా అని ఆలోచించింది. మరో రోజు ఆవిడ పలాస నుంచి తెప్పించుకున్న పొట్టు జీడిపప్పు అరకిలో పాకెట్‌ని సీసాలో పోస్తే అది నిండింది. ఆ అరకిలో ఆవిడకి మూడు వారాలు వస్తుంది. ఆవిడ ఆరోగ్యం కోసం రోజుకి ఏడు పప్పులు తింటుంది. కాని అవి సరిగ్గా సగం రోజుల్లో ఖాళీ అవడం ఆవిడకి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఓ రాత్రి అన్నం తిన్నాక సాంబార్ గిన్నెను ఆవిడ సింక్‌లో పడెయ్యలేదు. దాన్ని డైనింగ్ రూమ్‌లో పింగాణీ డిష్‌లోకి మార్చాక, వేడి పోవాలని డైనింగ్ టేబిల్ మీదే గుర్తుగా ఉంచి మర్చిపోయింది. కాని మర్నాడు ఉదయం అది సింక్‌లో కనిపించింది.

ఇంకో రోజు తోటలోని తాజా మెట్టతామర పూలు ఫ్లవర్ వేజ్‌లో ప్రత్యక్షం అవడంతో సిద్ధిధాత్రి తుళ్ళిపడింది. చూస్తే వాటిని తెంపిన కత్తెర టీవీ కింద కేబినెట్లో కుడి డ్రాయర్‌లో బదులు ఎడమ డ్రాయర్లో కనిపించింది. అది అల్జైమర్స్ లక్షణం అని స్ఫురించగానే తనకి అనుకోని అతిథిగా అల్జైమర్స్ వస్తోందా అని ఆవిడకి భయం వేసింది.

ఆ రాత్రి ఆవిడకి మృదువుగా ఈల వినిపించడంతో మెలకువ వచ్చి లేచి కూర్చుంది. అది పై అంతస్తులోంచా లేక తోటలోంచా? ఆవిడకి బోధపడలేదు. అంతలోనే ఆవిడకి నిద్రపట్టింది. మర్నాడు ఉదయం ఆవిడకి ఆ ఈల గుర్తొచ్చి కలై ఉంటుంది అనుకుంది. మర్నాడు రాత్రి కూడా ఆవిడకి ఈలతో మెలకువ రావడంతో ఇల్లంతా వెతికింది. ఎవరూ కనిపించలేదు. తన భర్త మరణించిన మంచం మీదే నిద్రించే సిద్ధిధాత్రికి దెయ్యాల మీద నమ్మకం లేదు. తనకి అనుకోని అతిథిగా అల్జైమర్స్ రావటం కాదని, ఇంట్లోనే ఏదో జరుగుతోందని ఆవిడకి అనిపించింది.

ఆ తర్వాత కొన్ని రోజుల దాకా ఈల శబ్దం వినిపించలేదు. ఓ రాత్రి పెద్ద చప్పుడికి మెలకువ వచ్చి లేచి హాల్లోకి పరిగెత్తుకు వచ్చింది. డైనింగ్ టేబుల్ మీది అన్నం గిన్నె నేల మీద కనిపించింది. పిల్లి అంత పెద్ద గిన్నెని నేల మీదకి నెట్టలేదు. వెంటనే ఆవిడ పోలీసులకి ఫోన్ చేసింది. పావుగంటలో వాళ్ళు వచ్చారు.



''ఏం జరిగింది?'' ఆవిడ వెంట లోపలకి నడుస్తూ ఎస్.ఐ. ప్రశ్నించాడు.

''ఇంట్లో దొంగ పడ్డాడు. ఇది ఆ దొంగ పని. ఇంట్లో నాకు తెలీకుండా ఎవరో మసలుతున్నారు.'' ఆవిడ నేల మీది ఆ గిన్నెని చూపించి చెప్పింది.

ఆవిడ సాంబారు గిన్నె గురించి, జీడిపప్పు, కాఫీ, చక్కెర సీసాల గురించి చెప్పింది. ఆ ఇంట్లో ఆవిడ ఒక్కతే ఉంటుందని తెలిసిన పోలీసులు ఇల్లు, తోట వెతికారు. ఎవరూ కనపడలేదు. తలుపులు, కిటికీలు మూసే ఉన్నాయి.

''ఈ ఇంట్లోకి ఇంకెవరో వచ్చి వెళ్తున్నారు. పైన గెస్ట్ రూమ్‌లో దుప్పట్లు పరిచి గుర్తుగా ఓవైపు అంగుళం ఎక్కువ కిందకి జార్చాను. కాని అది మర్నాడు సమానంగా కనిపించింది. ఓ తెల్లవారుఝామున అతిథుల బాత్‌రూంలోకి వెళ్తే అది తడిగా ఉంది.''

ఎస్.ఐ., హెడ్ కానిస్టేబుల్ ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు. అది గమనించిన ఆవిడ చెప్పింది.

''నేనేం పిచ్చిదాన్ని కాను.''

''రాత్రుళ్ళు మా పెట్రోల్ కారు వాళ్ళని మీ ఇంటివైపు వచ్చి ఓకన్నేసి ఉంచమని చెప్తాను.'' ఎస్.ఐ. చెప్పాడు.

మర్నాడు ఉదయం సిద్ధిధాత్రి ఎప్పటిలా మరో మనిషి ఉనికి కోసం షెల్ఫ్‌లోని కాఫీ సీసాని గమనించింది. అది యథాస్థానంలో లేదు. కావాలని ఆవిడ దాని కింది కాగితం చుట్టూ బాల్ పెన్‌తో గుండ్రం గీసింది. కాఫీ పొడి సీసా ఆ గుండ్రంలో లేదు. ఆవిడ మేడ మెట్లు ఎక్కి పై భాగంలోకి వెళ్ళి గెస్ట్ రూమ్ తలుపు తెరుచుకుని మంచం దగ్గరికి వెళ్ళింది. దాని మీద ఆవిడకి ఓ కాగితం కనిపించింది. దాన్ని అందుకుని చదివింది.

మేడం సిద్ధిధాత్రి,

ఈ ఇంట్లో మీతో పాటు నేనూ ఉంటున్నాను. చిరుద్యోగినైన నేను పగలు ఉద్యోగానికి ఫ్యాక్టరీకి వెళ్ళి, రాత్రి మీరు నిద్రపోయాక టెర్రేస్ తలుపులోంచి లోపలికి వస్తున్నాను. మీకు ఎలాంటి కీడు చేయను. కేవలం రాత్రుళ్ళు ఆశ్రయం, స్నానం, కాఫీలని, ఆకలేసినప్పుడు స్నాక్స్‌ని మాత్రమే తీసుకుంటున్నాను. ఇది మీకు ఇష్టం లేకపోతే ఈ ఉత్తరాన్ని తీసుకోండి. ఓ అపరిచితుడికి సహాయం చేద్దామనుకుంటే దీన్ని ఇక్కడే ఉంచండి. ఈ అర్ధరాత్రి మంచం మీద ఇది కనపడకపోతే ఇక ఎప్పటికీ మీ ఇంటికి రానని మాట ఇస్తున్నాను.

దాన్ని చదివాక ఆవిడ కొద్దిసేపు ఆలోచించింది. ఆ ఉత్తరంతో బయటకి నడిచి మెట్లు దిగింది. మధ్యాహ్నం సిద్ధిధాత్రి దాని కింద 'నువ్వు ఈల మాత్రం వేయకు' అని రాసి మళ్ళీ అతిథి గదిలోకి వెళ్ళి మంచం మీద ఆ ఉత్తరాన్ని ఉంచి బయటకి నడిచింది. ●

**'ఫన్‌డే'లో ప్రచురితమయ్యే**

**ఈ శీర్షికలో మల్లాది కథలు రాయడమే కాదు, మిమ్మల్ని కూడా భాగస్వాములను చేస్తున్నారు. మీరైతే ఈ కథకు ఏ పేరు పెడతారో ఈ కింది మెయిల్‌కు పంపండి.**


**kathakalisakshi@gmail.com**

**14 వ పేజీలో.. 14-6-2026 సంచిక 'కథాకళి'కి పేరు సూచించిన పాఠకుల పేర్లు**

కథానిధి (21.6.26) సమీక్ష :

# కాలపుగాయాలకు అక్షరాల సాంత్వన

భూక్యా గోపి నాయక్, 99891 59196




సాహిత్యం కేవలం కాగితం మీద అక్షరాల కూర్పు కాదు. అది నిరంతరం రక్తం స్రవించే సామాజిక గాయాలకు అద్దే కాలపు లేపనం. మనిషి తన చుట్టూ ఉన్న ప్రపంచంతో, తనలోని అంతరంగంతో, తాను సృష్టించుకున్న కృత్రిమ కుడ్యాలతో చేసే నిరంతర ఘర్షణే కథ. ఒక జాతి ఆత్మను, ఆ జాతి అనుభవిస్తున్న వర్తమాన సంక్షోభాలను, పతనమవుతున్న మానవ సంబంధాల దైన్యాన్ని అర్థం చేసుకోవాలంటే, ఆ కాలపు కథలను మనం అత్యంత నిశితంగా అధ్యయనం చేయాలి. ఆధునికత పేరిట మనిషి ఒక ఒంటరి ద్వీపంగా మారుతున్న ఈ తరుణంలో కథ, ముఖ్యంగా తెలుగు కథ, ఎప్పటికప్పుడు తనను తాను పునరావిష్కరించుకుంటూ, సామాన్యుడి అంతరంగంలోని సూక్ష్మమైన ప్రకంపనలను సైతం ఒడిసిపట్టుకుంటోంది.

ఈ నేపథ్యంలో, 21 జూన్ 2026 నాడు వెలువడిన వివిధ దినపత్రికల ఆదివారం అనుబంధాల కథలను 'కథానిధి' పేరిట కె.ఎ.మునిసురేష్ పిళ్లై ఒక చోట చేర్చడం తెలుగు సాహితీ లోకానికి ఒక గొప్ప ఉపశమనం. ఈ 47 పేజీల సంకలనం, కేవలం 11 పెద్దల కథలు, 11 బాలల కథల సమూహం మాత్రమే కాదు. ఇది మన కాలపు దైన్యానికి, అహానికి, పితృస్వామ్య క్రౌర్యానికి, మత విద్వేషాలకు, సాంకేతిక ఆధిపత్యానికి, మరియు అరుదుగా వికసించే మానవీయతకు నిలువుటద్దం. పితృ దినోత్సవం (ఫాదర్స్ డే) సందర్భంగా వచ్చిన కథలతో పాటు, సమకాలీన సామాజిక ఇతివృత్తాలతో వెలువడిన ఈ విశిష్ట కథలను తాత్త్విక, సామాజిక, మానసిక కోణాల నుంచి సుదీర్ఘంగా విశ్లేషించుకుందాం.

## 1. పితృత్వపు లోతుల్లోని నిశ్శబ్ద రుధిరం: వ్యక్తమవ్వని ప్రేమ, తరాల అంతరాలు

పితృత్వం అనేది ఒక మూగ రోదన. బయటికి కఠినంగా, గంభీరంగా కనిపిస్తూ, లోపల కుటుంబం కోసం కరిగిపోయే మైనం లాంటి తండ్రుల అంతరంగాన్ని ఈ వారపు కథలు అద్భుతంగా ఆవిష్కరించాయి.

సలీం 'నాన్న' (ఈనాడు ఆదివారం): మనుషుల మధ్య, ముఖ్యంగా కన్నవారికీ పిల్లలకూ మధ్య భావవ్యక్తీకరణ లేమి ఎలా తీరని అగాధాలను సృష్టిస్తుందో సలీం ఈ కథలో

గుండెను పిండేసేలా చిత్రించారు. అరవై ఎనిమిదేళ్ల వయసులో భార్య అపర్ణను కోల్పోయి, కొండచిలువ లాంటి ఒంటరితనంలో విలవిలలాడుతున్న ఒక రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి కథానాయకుడు. అమెరికాలో స్థిరపడిన అతని కూతురు శ్రీలేఖ, తండ్రితో మాట్లాడటం పూర్తిగా

ఈ సమీక్ష వ్యాసాన్ని పీడీఎఫ్ కాకుండా, టెక్ట్స్ రూపంలో చదవదలచుకున్న వారు.. ఈ కింది వెబ్ సైట్ ను విజిట్ చేయండి.
www.adarsini.com (click చేయండి)
ఆడియో వినదలచుకున్న వారు ఇక్కడ క్లిక్ చేయండి

మానేస్తుంది. భార్య చనిపోయినప్పుడు అమెరికా నుంచి వచ్చిన శ్రీలేఖ, "మీరెప్పుడైనా నన్ను ప్రేమగా చూశారా? నాకు తండ్రి ప్రేమ ఎలా ఉంటుందో తెలియకుండా అభాగ్యురాలిగా పెంచారు" అని కన్నీళ్లతో వేసిన ప్రశ్న ఆ తండ్రి ఆత్మను నిలువునా కోస్తుంది.

ప్రేమకు కంటికి కనిపించే రుజువులు అడిగే ఈ ఆధునిక కాలంలో, ఆ తండ్రి తన గతపు పొరల్లోకి వెళ్తాడు. శ్రీలేఖ పుట్టినపుడు ఆమెకు 'ఏ నెగెటివ్' అనే అత్యంత అరుదైన రక్తం అవసరమైనప్పుడు, అర్ధరాత్రి పూట ఆటోలు దొరక్క, సికింద్రాబాద్ రోడ్లపై వొళ్లంతా చెమటతో తడిసి, కిందపడి కాళ్లు దోక్కుపోయినా లెక్కచేయకుండా రక్తం బాటిల్స్ కోసం పరుగులు తీసిన క్షణాలు అతని స్మృతిపథంలో మెదులుతాయి. చిన్నప్పుడు ఆమెకు జబ్బు చేసినప్పుడు డాక్టర్ కాళ్లు పట్టుకుని, "నా కూతుర్ని ఎలాగైనా బతికించండి" అని బతిమాలిన క్షణాలు అతనికి గుర్తున్నాయి. కానీ అవన్నీ తండ్రిగా తన కనీస బాధ్యతలని భావించి అతను ఏనాడూ భార్యకు గానీ, కూతురికి గానీ వాటిని ప్రచారం చేసుకోలేదు.

"ప్రేమ ప్రచారం చేసుకునే విషయం కాదుగా. తండ్రి ప్రేమను అర్థం చేసుకోవాల్సింది పిల్లలే కదా." అని ఆ తండ్రి పడే అంతర్మథనం ప్రతి పాఠకుడి కంటతడి పెట్టిస్తుంది. చివరగా, "కుటుంబం కోసం ఎంత చేసినా తగిన గుర్తింపు తెచ్చుకోవడంలో నాన్నెందుకో పాపం బాగా వెనకపడ్డాడు" అన్న కవితా వాక్యాలు పితృత్వపు నిస్సహాయతను ఒక ఆర్ద్రమైన కావ్యంగా మలిచాయి.

**జి. ఉమామహేశ్వర్ 'నాన్న నాన్నే' (ఆంధ్రజ్యోతి ఆదివారం):** సలీం కథలో తండ్రి ప్రేమ ఒక త్యాగమైతే, జి. ఉమామహేశ్వర్ కథలో భారతీయ పితృస్వామ్యపు హిపోక్రసీ (ద్విముఖ ధోరణి) అత్యంత సహజంగా, వ్యంగ్యాత్మకంగా వ్యక్తమైంది. సుధాకర్ ఉదయాన్నే హైదరాబాద్ వెళ్లి తన కూతురిని, అల్లుడిని చూసి వస్తాడు. కూతురు మాధాపూర్‌లోని ఆరొందల అడుగుల చిన్న పోర్షన్‌లో ఉంటూ, ఒకవైపు జర్మనీ క్లయింట్లతో ఆఫీసు పని చేసుకుంటూనే, అత్తమామలకు సేవలు చేస్తూ పడుతున్న కష్టాన్ని చూసి అతను కరిగిపోతాడు. భార్య మాధవితో మాట్లాడుతూ, "అవసరమైతే నెలకు ఒక పదివేలు పంపుతాను, వేరే ఎక్కడైనా మంచి అపార్ట్‌మెంట్‌లో ఇల్లు చూసుకోమని చెప్పాను" అని తన ఉదారతను చాటుకుంటాడు. "మన పాప ఇంత చేస్తుంది కదా, అయినా అల్లుడు ఏ రోజూ నోరు తెరిచి ఒక్కసారి కూడా తన శ్రమను మెచ్చుకోలేదట" అని వాపోతాడు.

కానీ ఈ మాటలు వింటున్న మాధవి అంతరంగంలో సుడులు తిరిగే గతం మరొకటి ఉంది. పెళ్లయిన కొత్తలో ఆదోనిలోని ఓ ఇరుకు సందులో, ముగ్గురు ఆడపడుచులు, అత్తమామలతో ఇరుకు గదిలో ఆమె గొడ్డుచాకిరీ చేస్తున్నప్పుడు, మాధవి తండ్రి వచ్చి "వెయ్యి రూపాయలు నేను పంపిస్తాను, వేరే ఇంట్లో ఉండమని అల్లుడికి చెప్తాను" అని అడిగితే, ఇదే సుధాకర్ రోషపడి "మీ నాన్నకు డబ్బు ఎక్కువైతే దానధర్మాలు చేసుకోమను" అని వెటకరించిన విషయం ఆమెకు స్పష్టంగా గుర్తుంది. తాను స్కూల్ టీచర్‌గా పనిచేస్తూ, రాత్రి పగలు కుట్టుమిషన్ కుడుతూ పిల్లల ఫీజులు కడుతూ సంసారాన్ని ఈదినప్పుడు ఏనాడూ తన శ్రమను మెచ్చుకోని భర్త, తనను కేవలం ఒక పనిమనిషిలా చూసిన భర్త... ఇవాళ కూతురి కష్టం చూసి కరిగిపోవడం మాధవికి అంతులేని నవ్వు తెప్పిస్తుంది. ఒక తండ్రిగా ఉన్న ఆర్ద్రత, భర్తగా ఎందుకు లోపిస్తుంది అన్న తాత్విక ప్రశ్నను మాధవి నిశ్శబ్ద హాస్యం ద్వారా, ఆమె కట్టలు తెంచుకున్న నవ్వు ద్వారా రచయిత అత్యంత ప్రతిభావంతంగా సంధించారు.

## 2. యంత్రమేధ వర్సెస్ సృజనాత్మకత: ఒక తాత్విక, అస్తిత్వ పోరాటం

**ప్రసేన్ 'త్రిపుర రాయని కథ' (సాక్షి ఫన్డే):** ఈ కథ రాబోయే కాలపు (మరియు నేటి) రచయితల అస్తిత్వ సంక్షోభాన్ని కళ్లకు కడుతుంది. పాపులర్ రచయితగా పేరున్న రఘుపతి, సీరియస్ సాహిత్య లోకం తనను గుర్తించలేదనే వెలితితో ఒక గొప్ప కథ రాయాలని కూర్చుంటాడు. ఆ కథకు ముగింపు దొరక్క పది రోజులుగా తర్జనభర్జన పడుతుంటాడు. భార్య కల్యాణి సలహా మేరకు అతను తన అహాన్ని చంపుకుని, అయిష్టంగానే తన కథను ఏఐ (AI) కి ప్రాంప్ట్‌గా ఇచ్చి ముగింపు అడుగుతాడు. ఏఐ కేవలం నాలుగు సెకన్లలో అతను ఊహించని, అత్యంత అద్భుతమైన, అతని సాహిత్య జీవితంలో నుంచే తీసిన ముగింపును ఇస్తుంది.

పది రోజులుగా తన మేధస్సుకు తట్టని ముగింపు, ఒక నిర్జీవ కంప్యూటర్ తనకంటే గొప్పగా ఎలా ఆలోచించిందని రఘుపతి ఏఐతో వాదనకు దిగుతాడు. ఆ సంభాషణ అత్యంత మేధోపరంగా, తాత్వికంగా సాగుతుంది:

* ఏఐ నిర్మొహమాటంగా రఘుపతిని విమర్శిస్తుంది: "నీ రచనల్లో ప్రధాన లోపం నిజాయితీ. నీ ఉద్వేగ ప్రకటనలన్నీ నాటకాలు. నువ్వు జనం కోసం రచన చేస్తున్నట్టు నటిస్తూ పేరు కోసం చూస్తావు. నాకు ఇటువంటి హిపోక్రసీ ఉండదు."

* దానికి రఘుపతి దెబ్బతిన్న అహంతో

వాదిస్తాడు: "నీ దగ్గర ఉన్నది సమాచారం, నా దగ్గర ఉన్నది అనుభవం. ఒక ప్రేమ విఫలమైనప్పుడు వచ్చే కన్నీటి చుక్క తడి లోపలి వేడి నీ ప్రాసెసర్‌కు ఎప్పటికీ తెలియదు."

* అప్పుడు ఏఐ ఇచ్చే సమాధానం ఈ కథకే హైలైట్: "నేను నొప్పి అనుభవించలేదు. కానీ నొప్పి ఎలా ప్రవర్తిస్తుందో శిక్షణ పొందాను. నాది పరిమితి, నీది అపరిమితి. నేను సమాధానం, నువ్వు ప్రశ్న. నేను ఫలితం, నువ్వు పరిణామం."

చివరకు "యంత్రం రచనను అనుకరిస్తుంది. మనిషి మాత్రమే తనను తాను మళ్లీ మళ్లీ సృష్టించుకుంటాడు" అని రఘుపతి గ్రహించడం మానవ సృజనాత్మకత గొప్పదనాన్ని చాటిచెబుతుంది. ఏఐ అనేది కేవలం ఒక సాధనం మాత్రమేనని, కీర్తి కాంక్షను వీడి, నటించకుండా నిజాయితీగా రాయడమే రచయిత అసలైన ధర్మమని ఈ కథ హెచ్చరిస్తుంది.

## 3. కుడ్యాలు కూలుతున్న వేళ:
## మత, కుల విద్వేషాలపై మానవతా విజయం

**బట్టేపాటి జైదాస్ 'మరో గాలివాన' (నమస్తే తెలంగాణ బతుకమ్మ):** ఈ కథ కరడుగట్టిన కుల దేహంపై, స్వచ్ఛమైన మానవత్వం సాధించిన విజయానికి అద్భుతమైన ప్రతీక. కూనవరంలో నివసించే కరడుగట్టిన కుల అహంకారి వీర్రాఘవయ్య. తన కొడుకు వీరా, "మనుషుల గుణగణాలు ముఖ్యం కానీ కులమతాలు కాదు" అని చెప్పి, అమెరికాలో కులం లేని పిల్లను పెళ్లి చేసుకున్నాడని పంతంతో వాడిని దూరం పెట్టి ఒంటరిగా బతుకుతుంటాడు. ఆ సమయంలో అతని ఇంట్లో కనకం అనే దళిత వర్గానికి చెందిన అనాథ వితంతువు పనిమనిషిగా చేరుతుంది. ఆమె అప్పుడే పుట్టిన పసిబిడ్డకు పాలిచ్చే తల్లి.

ఒక రాత్రి ఊహించని విధంగా గోదావరికి భయంకరమైన వరదలు వచ్చి, గాలివాన తుఫానుతో ఊరంతా జలమయమవడంతో వీర్రాఘవయ్య, కనకం మేడపై చిక్కుకుపోతారు. వీర్రాఘవయ్య భోజనానికి ముందే షుగర్ మాత్రలు వేసుకోవడం వల్ల, రాత్రికి ఆకలికి అతని షుగర్ లెవెల్స్ పడిపోయి కోమాలోకి జారుకునే పరిస్థితి వస్తుంది. ఆ చిమ్మచీకటి గాలివానలో ప్రాణాలు కాపాడేందుకు ఏమీ దొరకని స్థితి. ఆ సమయంలో, కనకం ఏమాత్రం సంకోచించకుండా, కుల భేదాలను పక్కనబెట్టి, తన రవికను పైకి లాగి తన స్తన్యాన్ని అతని నోటికి అందించి పాలిచ్చి కాపాడుతుంది. ఒక మనిషి ప్రాణం నిలబెట్టడానికి ఒక తల్లి చేసిన అత్యున్నత త్యాగం అది.

వరద ముగిసాక రెస్క్యూ టీం వస్తుంది. కనకం చేసిన ఆ మహత్కార్యంతో వీర్రాఘవయ్యలోని కుల జాడ్యం కూకటివేళ్లతో కొట్టుకుపోతుంది. తన కొడుకుకు ఉత్తరం రాస్తూ... "కనకం నాకు మరో జన్మనిచ్చిన తల్లి. నేనింతకాలం కడుపులో దాచుకొని కాపాడిన కులమాలిన్యాన్ని తన పాలతో కడిగి అభిషేకం చేసిన బంగారు తల్లి. ఒరే అబ్బాయ్! మనిషన్నవాడికి ఏది ఉన్నా లేకపోయినా కారుణ్యమనే కులం, మానవత్వమనే మతం ఉంటే చాలు" అని పశ్చాత్తాపపడతాడు.

**సయ్యద్ ముజాహిద్ అలీ 'శిథిలస్వప్నం' (నవతెలంగాణ సోపతి):** భారతదేశంలో అడపాదడపా చెలరేగుతున్న మతకల్లోలాలు, 'బుల్డోజర్ న్యాయం' సృష్టించిన భయానక వాతావరణం వల్ల సామాన్య ముస్లిం కుటుంబాలు ఎలాంటి మానసిక క్షోభకు గురవుతున్నాయో ఈ కథ అత్యంత ధైర్యంగా, నిజాయితీగా చర్చిస్తుంది.

ఇమ్రాన్ అనే ఒక సివిల్ ఇంజనీర్ గాంధీ నగర్‌లోని 'ఆంధ్రా కెఫె'లో తన మిత్రుడు అభినవ్ చౌదరితో చాయ్ తాగుతుండగా, టీవీలో వస్తున్న ఇళ్ల కూల్చివేతల వార్త చూసి బాధపడతాడు. పక్క టేబుల్ వద్ద ఉన్న కురచ బొట్టు పెట్టుకున్న వ్యక్తి, ముస్లింలను "జిహాదీలు, ల్యాండ్ జిహాద్ చేసేవాళ్లు, దేశద్రోహులు" అని అత్యంత క్రూరంగా దూషిస్తూ, బుల్డోజర్ దాడులను సమర్థిస్తాడు. తన సొంత దేశంలో, పుట్టిన ఊరిలో తన ఉనికికి రక్షణ లేదనే భయంతో, తన పిల్లల భద్రత కోసం అతను తన వృద్ధ తల్లిదండ్రులను, భార్య జైనబ్‌ను తీసుకుని ఇండోనేషియా (జకార్తా) కు వలస వెళ్ళిపోవాలని నిర్ణయించుకుంటాడు.

రంజాన్ పండుగ నాడు జైనబ్ ప్రేమగా బిర్యానీ తీసుకెళ్తే, పొరుగింటి రాజ్యలక్ష్మి మత విద్వేషంతో "బయటి తిండి ఎందులో ఎవరు ఏం కలుపుతున్నారో" అని చీదరించుకుంటూ మొహం మీదే తలుపు వేస్తుంది. కానీ, ఇమ్రాన్ కుటుంబం దేశం వదిలి వెళ్లేటప్పుడు, వారి ఇంట్లో ఎన్నో ఏళ్లు పనిచేసిన యాదమ్మ అనే పేద వృద్ధురాలు పరిగెత్తుకుంటూ వచ్చి, "బిడ్డా.. మీ ప్రాణాలకు నా ప్రాణం అడ్డేసైనా కాపాడుకుంటా.. ఈ ముసల్దాని మాట ఇని ఎల్లకుండ్రి బిడ్డా.." అని కారు పట్టుకుని గొల్లుమంటుంది. ఇండోనేషియాలోని నుసంతారా నగర నిర్మాణంలో ఒక గొప్ప ఇంజనీర్‌గా ఎదిగినా, ఒక కారు ప్రమాదంలో చావు అంచుల దాకా వెళ్లొచ్చిన ఇమ్రాన్ మనసు భారతదేశంలోని తన పాత ఇంటి వైపే లాగుతుంది. "అక్కడే నిలబడాల్సిందా?" అని

అతను కుమిలిపోవడం, వలస బతుకుల అంతర్గత శూన్యానికి ప్రతీక.

## 4. అసమానతల చీకట్లో వెలుగురేఖలు: సామాజిక బాధ్యత, విద్యా వికాసం

**కొరికాన ఆనంద్ 'పార్కు' (ప్రజాశక్తి స్నేహ):** పట్టణీకరణ నేపథ్యంలో ధనవంతులు ప్రభుత్వ స్థలాలను ఎలా తమ గుప్పెట్లోకి తీసుకుంటున్నారో ఈ కథ వాస్తవికంగా చిత్రించింది. నేషనల్ హైవే పక్కన ఉన్న గ్రీన్ బెల్ట్‌ను కొంతమంది ధనవంతులు వాకర్స్ అసోసియేషన్ పేరుతో తమ వాకింగ్ పార్కుగా మార్చుకుంటారు. డబ్బులు వసూలు చేస్తూ, నిరుపేదల పిల్లలను లోపలికి రానివ్వకుండా వాచ్ మెన్‌ను పెడతారు.

ఆ పార్కు బయట ముళ్ల కంచె దగ్గర నిలబడిన ఒక పేద, పోలియో బాధిత తల్లి, తన ఆరేళ్ల కొడుకు ఆడుకోవడానికి వీలుగా నేలమీద వంగి, తన నడుమునే ఒక అడ్డంకిగా మారుస్తుంది. ఆ పిల్లాడు వాళ్ల అమ్మ నడుము మీదుగా ఎగురుతూ పకపకా నవ్వుతుంటాడు. ఆ దృశ్యం చూసి వృద్ధుడైన కథానాయకుడు చలించిపోతాడు. "పేదవాళ్ల ఇంట్లో పుట్టిన పసిబిడ్డల కలలు చిద్రమై పోకుండా ఉండాలంటే.. ఇలాంటి కష్టాలు ఎన్నో పడాలిగా" అని ఆ తల్లి ఇచ్చిన సమాధానం దేశ అసమానతలపై ఒక చెంపదెబ్బ. "కొడుకు కోర్కె తీర్చలేకపోతున్న ఆ తల్లి కళ్ళు.. దైన్యాన్ని మోస్తున్న దేశ దారిద్ర్యంలా ఉంది" అన్న రచయిత వాక్యం అత్యంత ఆర్ద్రమైనది.

**మొలకలపల్లి కోటేశ్వరరావు 'ఉత్తమ గ్రంథం' (ప్రజాశక్తి స్నేహ):** వ్యవసాయ కార్మికుని బిడ్డగా పుట్టి, తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారి, కేవలం తన కృషితో నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ కాలేజీలో, సెంట్రల్ యూనివర్సిటీలో చదివి, ఐఏఎస్ సాధించి, నేడు కేంద్ర ప్రభుత్వ సంస్థ 'నాఫెడ్' ఎండీగా ఎదిగిన శ్యామ్ కథ ఇది.

తన హోదాను పక్కనబెట్టి, 14 ఏళ్ల తర్వాత తన ఊరికి వచ్చిన శ్యామ్, తన చిన్ననాటి స్నేహితుడు శంకరయ్య ఇంటికి వెళ్తాడు. చిన్నప్పుడు తన హోదా చూసుకుని శ్యామ్‌ను అకారణంగా కొట్టిన శంకరయ్య, నేడు వ్యవసాయం దెబ్బతిని అప్పులపాలై ఆందోళన చెందుతుంటాడు. శ్యామ్ తన గతాన్ని మర్చిపోయి, శంకరయ్య ఇద్దరు పిల్లలకు (జాహ్నవి మరియు కొడుకు) తన సంస్థలో ఉద్యోగాలు ఇప్పించి ఆదుకుంటాడు. "ప్రస్తుత సమాజంలో చదువుని మించిన సంపద లేదు. శ్యామ్ జీవితం ఒక ఉత్తమ గ్రంథం" అని శంకరయ్య అనడం ద్వారా, విద్య యొక్క అసలైన విజయాన్ని రచయిత నిరూపించారు.

**అచ్యుతుని రాజశ్రీ గారి 'బడిబాట' (వార్త):** కరోనా కష్టకాలంలో తల్లిని, ఆ తర్వాత భర్త రామును పిడుగుపాటుకు కోల్పోయి, పాచిపనులు చేసుకుంటూ బతికే పేద వితంతువు సీత. ఆమె కొడుకు రవి, గురుకుల పాఠశాలలో చేరి బాగా చదువుకుని, మాతృభూమికి సేవ చేయాలని కలలు కంటాడు. "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అని తన టీచర్ చెప్పిన మాటలను తల్లికి చెబుతూ, చదువుతోనే తమ తలరాతలు మారుతాయని నమ్ముతాడు. పేదరికపు చీకట్లను చీల్చే వెలుగు కిరణం బడిబాట అని ఈ కథ ఆశావహ దృక్పథాన్ని అందిస్తుంది.

## 5. వియోగపు నీడలు: ఆధునిక కుటుంబాల్లోని శూన్యం, కమ్యూనికేషన్ లేమి

**యలమర్తి అనూరాధ 'రెక్కలొచ్చిన పక్షి' (విశాలాంధ్ర):** పిల్లల భవిష్యత్తు కోసం సర్వస్వం ధారపోసిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో మిగిలే రిక్తతను ఈ కథ హృదయ విదారకంగా స్పృశించింది. ఉపాధ్యాయుడిగా పనిచేసి హెడ్ మాస్టర్‌గా ఎదిగిన శరత్ చంద్ర, తన ఏకైక కొడుకు ధర్మతేజను కంటికి రెప్పలా పెంచుతాడు. కొడుకు తాను ప్రేమించిన, స్కూల్ వాచ్ మెన్ కూతురిని పెళ్లి చేసుకుంటానని పట్టుబడితే ఆ ప్రేమవివాహానికి అంగీకరిస్తారు.

కానీ పెళ్లయ్యాక ఆ కొడుకు భార్యతో కలిసి అమెరికా ప్రయాణమవుతాడు. రిటైర్మెంట్ వయసులో, ఆరోగ్యం సహకరించని రోజుల్లో కొడుకు అండ కావాలనుకున్న తల్లిదండ్రులకు ఈ వియోగం అంతులేని వేదనను మిగుల్చుతుంది. "రెక్కలొచ్చిన పక్షి గూడు వదిలిపోదా?" అని అంతరంగంలో సర్దిచెప్పుకున్నా, విమానాశ్రయంలో కొడుకు వెళ్లిపోతుంటే ఆ తండ్రి చాటుగా కన్నీళ్లు తుడుచుకోవడం, ఆ తల్లి గుండెను ఎవరో పిండేస్తున్నట్లు అనుభవించడం నేటి విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థకు సాక్ష్యాలు.

**బొల్లిముంత వెంకటరమణారావు 'చీలిన దారులు' (వార్త):** ప్రేమలో చిన్న చిన్న అపార్థాలు ఎలా జీవితాలను విడదీస్తాయో చెప్పే ఆర్ద్రమైన కథ ఇది. అర్జున్, మీరా ప్రాణానికి ప్రాణంగా ప్రేమించుకుంటారు. అర్జున్ పుట్టినరోజు దగ్గర పడుతుంటే, మీరా అతనికి ఎప్పుడూ అందుబాటులో ఉండాలని అతని ఫోన్‌కు అన్‌లిమిటెడ్ రీచార్జ్ చేస్తుంది. అదే సమయంలో అర్జున్, వాలెంటైన్స్ డేకి మీరాకు ఒక అందమైన సిల్వర్ పెండెంట్ బహుమతిగా ఇవ్వడానికి డబ్బుల్లేక తన ఫోన్‌నే

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

అమ్మేస్తాడు.

మీరా అతనికి ఫోన్ చేసినప్పుడు, ఫోన్ కొన్న వ్యక్తి "ఈ ఫోన్ ఈ రోజే అమ్మేశారు" అని చెప్పడంతో మీరా తీవ్రంగా అపార్థం చేసుకుంటుంది. అటు అర్జున్ మీరా అడ్రస్ లేక, వేరే ఫోన్ నుంచి చేస్తే ఆమె "రాంగ్ నంబర్" అని కట్ చేయడంతో ఇద్దరి దారులు శాశ్వతంగా విడిపోతాయి. ఏళ్ల తర్వాత ఒక రైల్వే స్టేషన్‌లో కుటుంబాలతో ఉన్న వారిద్దరూ ఎదురుపడతారు. అతను తన జేబులో దాచుకున్న ఆ సిల్వర్ పెండెంట్ తీసి "ఇది నీకు ఇవ్వలేకపోయాను" అని చూపిస్తాడు, ఆమె నవ్వుతూ కన్నీళ్లు రాలుస్తుంది. "కలవని ప్రేమ కూడా ప్రేమే.. అది మాటలకందని మౌనంగా మన లోపల శాశ్వతంగా జీవిస్తుంది" అన్న వాక్యాలు కథకు ప్రాణం పోశాయి.

## 6. విషాదంలోంచి వికసించిన హాస్యం: బతుకుపై ఆశ

**మల్లాది వెంకటకృష్ణమూర్తి గారి 'సదారోగి' (సాక్షి ఫన్డే):** ప్రముఖ రచయిత మల్లాది తనదైన శైలిలో సాగిన ఈ కథ, రోగాలను కూడా ఎలా హాస్యంగా స్వీకరించవచ్చో తెలియజేస్తుంది. అగ్నిలింగం అనే వ్యక్తికి బాల్యం నుంచీ మలేరియా, టైఫాయిడ్, డయాబెటిస్, గ్లకోమా, ఆర్థరైటిస్, సయాటికా వంటి సకల రోగాలు వస్తాయి. అతను తన రోగాల మీదే జోకులు వేసుకుంటూ, "రోగాలు నా అతిథులు, వాటికి మందులనే ఆహారం పెట్టి గౌరవిస్తుంటాను" అని నవ్వుతూ బతుకుతాడు.

ఒకరోజు అతనికి తీవ్రమైన హార్ట్ ఎటాక్ వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యలో ఆ అంబులెన్స్ రోడ్డు మీద ఉన్న ఒక పెద్ద గుంతలో పడి ఎగిరి పడుతుంది. ఆ కుదుపుకు అతని గుండె మళ్లీ కొట్టుకోవడం మొదలవుతుంది, అంతేకాదు అతని కిడ్నీలో ఉన్న స్టోన్స్ కూడా బయటికి వచ్చేస్తాయి. కాంట్రాక్టర్ వేసిన చెత్త రోడ్డు గుంత వల్ల తన ప్రాణాలు దక్కాయని, భార్య ఆ కాంట్రాక్టర్ ఫోటోను దేవుడి గదిలో పెట్టుకుందనే పోస్ట్ స్క్రిప్ట్ తో ఈ కథ పొట్టచెక్కలయ్యేలా నవ్విస్తూనే, మన రోడ్ల దుస్థితిని ఎండగడుతుంది.

## 7. రేపటి సమాజపు పునాదిరాళ్లు: బాలల కథల తాత్విక పరిశీలన

పెద్దల కథలు సమాజంలోని సంక్షోభాలను, దైన్యాన్ని ఆవిష్కరిస్తే, బాలల కథలు ఆ సమాజానికి అవసరమైన ఔషధాన్ని, నైతికతను అందజేశాయి. చిన్న చిన్న ముగింపుల్లో, పసి మనసులకు అర్థమయ్యే సరళమైన భాషలో ఇవి గొప్ప తాత్విక సత్యాలను బోధించాయి.

### పితృత్వపు నిరంతర ప్రతిబింబం

**'నాన్నంటే కొండంత ధైర్యం' (డా. పురాణపండ వైజయంతి):** పితృ దినోత్సవం నేపథ్యంలో సాగిన ఈ కథ కన్నవారికీ పిల్లలకూ మధ్య ఉండే నిశ్శబ్ద అనుబంధాన్ని ఆవిష్కరించింది. వర్షంలో తన కొడుకు తడిసిపోతాడని గొడుగుతో పరుగెత్తే రంగయ్యతో వృద్ధ తండ్రి పరంధామయ్య సంధించిన వాక్యం పితృత్వపు ఔన్నత్యానికి ప్రతీక: "నీ కొడుకు తడిసిపోతాడని నువ్వు గొడుగు తీసుకు వెళ్తున్నావు. మరి నా కొడుకైన నువ్వు తడిసిపోతుంటే నాలోని తండ్రి మనసు బాధపడదా?". పిల్లలు ఎంత పెద్దవారైనప్పటికీ, తండ్రికి మాత్రం వారు ఎప్పుడూ చిన్నపిల్లలుగానే కనిపిస్తారనే సత్యాన్ని ఈ కథ ఎంతో ఆర్ద్రంగా చిత్రించింది.

### చదువు విలువ, తల్లిదండ్రుల త్యాగాలు

**కె.వి. లక్ష్మణరావు రచించిన 'అమ్మ చెప్పింది'** కథ బాలల్లో చదువు విలువను, తల్లిదండ్రుల త్యాగాలను ప్రతిబింబించే ఒక చక్కని సందేశాత్మక కథ. వేసవి సెలవులు ముగిసి నాల్గవ తరగతికి వెళ్తున్న అజయ్‌కు అతని తల్లి ఒక కథను చెబుతుంది. చిన్నప్పుడు చదువులో ఎంతో ప్రతిభ చూపి, క్లాస్ ఫస్ట్ వచ్చిన 'లక్ష్మి' అనే అమ్మాయిని, తండ్రి బలవంతంగా చదువు మాన్పించి పెళ్లి చేస్తే ఆమె జీవితంలో ఎలాంటి కష్టాలు పడిందో వివరిస్తుంది. చివరకు ఆ లక్ష్మి మరెవరో కాదు, తన తల్లే (మహాలక్ష్మి) అని అజయ్ గ్రహిస్తాడు.

స్త్రీ విద్య ఆవశ్యకతను, చదువు లేకపోతే జీవితంలో ఎదురయ్యే చీకట్లను తల్లి తన సొంత జీవిత అనుభవం ద్వారా కొడుకుకు నేర్పుతుంది. బాలల హృదయాల్లో చదువు పట్ల బాధ్యతను, కృతజ్ఞతను పెంచే ఉత్తమ కథ ఇది.

### ఆత్మవిశ్వాసం, ఐక్యతల చైతన్యం

**'కోతి చెప్పిన రహస్యం!' (పైడిమర్రి రామకృష్ణ):** శారీరక భంగిమ వెనుక దాగివున్న మనోబలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఈ కథ చర్చిస్తుంది. వెన్నుముక నిటారుగా ఉంచి, తల ఎత్తి గంభీరంగా నిలబడితే భయం దానంతట అదే పారిపోతుందని ఏనుగు, ఎలుగుబంతులకు కోతి నేర్పిన రహస్యం పిల్లల మానసిక ధైర్యానికి దిక్సూచిలా నిలుస్తుంది.

**'జ్ఞానవనంలో స్నేహోత్సవం' (డా. కటుకోఝ్వల రమేష్):** చిట్టి చిలుక పాత్ర ద్వారా సాగిన ఈ కథలో "ఒక్కరి శక్తి పరిమితం, అందరి ఐక్యత అపరిమితం" అనే సమిష్టి కృషి సందేశాన్ని, వినయమే నిజమైన గొప్పతనమనే తాత్విక సత్యాన్ని రచయిత పిల్లల మనసుల్లో బలంగా నాటారు.

**అహంకారంపై కారుణ్యపు విజయం**

**'గర్విష్ఠి గజరాజు' (అవ్యాన్) & 'కవి తెచ్చిన మార్పు' (డా. గంగిశెట్టి శివకుమార్):** వలలో చిక్కుకున్న గర్విష్ఠి గజరాజును ఒక చిన్న కుందేలు కాపాడటం ద్వారా "బలం శరీరంలో కాదు, చేసే సాయంలో ఉంటుంది" అని నిరూపిస్తుంది. అపకారికి కూడా ఉపకారం చేయాలనే గుణాన్ని ఇది నేర్పుతుంది. అలాగే, యుద్ధ విజయాల కన్నా శాంతిలోనే శాశ్వత ఆనందం ఉందని పాలకునికి ఒక కవి తన కావ్యం ద్వారా కనువిప్పు కలిగించడం సమాజ హితాన్ని కోరే అక్షర శక్తికి సజీవ సాక్ష్యం.

**శాస్త్రీయ దృక్పథం, సామాజిక స్పృహ**

**'మూఢనమ్మకం' (తోకల రాజేశం) & '"గేదె" మన తల్లి!' (ప్రవళి వెలుగు):** స్మశానంలోని మంటలు దయ్యాలు కావని, అది ఫాస్పరస్ గాలిలోని ఆక్సిజన్ తో చర్య జరపడం వల్ల మండే రసాయనిక ప్రక్రియ అని ఉపాధ్యాయుడు నిరూపించి పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని రగిలిస్తాడు. అలాగే ప్రవళి వెలుగు రాసిన వ్యాసం బాహ్య సౌందర్యం (తెల్లని ఆవు) కన్నా అంతర్గత గుణం (నల్లని గేదె) గొప్పదనే తార్కిక, విమర్శనాత్మక ఆలోచనను రేకెత్తిస్తుంది.

**'జ్ఞానానికి అవమానం' (పల్లా వెంకట రామారావు) & 'దానగుణం' (పి.జ్యోతి):** పరీక్షలు కాగానే పుస్తకాలు చించే వంశీకి తాతయ్య అక్షర గౌరవాన్ని, పర్యావరణ స్పృహను నేర్పగా, మన్వంత్ తన లంచ్ బాక్స్ లోని అన్నాన్ని ఆకలితో ఉన్న వృద్ధుడికి ఇచ్చి దానగుణాన్ని, తోటి మనిషి బాధ పట్ల సానుభూతిని చాటుతాడు. ఇందులో సంగనభట్ల చిన్న రామకిష్టయ్య గారి 'మంచి మనసు' కథలోని రాము కూడా తన ఆపిల్ పండును జ్వరం వచ్చిన మిత్రుడికి ఇచ్చి త్యాగ నిరతిని చాటడం గమనార్హం.

**21 జూన్ 2026 నాటి ఈ 'కథానిధి' సంకలనం** తెలుగు సాహిత్యపు లోతులను, వైశాల్యాన్ని మరొక్కసారి నిరూపించింది. సలీం, ప్రసేన్, జైదాస్, ఉమామహేశ్వర్ వంటి రచయితలు తమ కలాల ద్వారా అస్తిత్వపు వేదనను, వర్గ పోరాటాలను ఒక గొప్ప తాత్విక చట్రంలో బంధించారు.

మల్లాది వారి కథ హాస్యంలోంచి జీవన సత్యాన్ని చెబితే, మొలకలపల్లి కోటేశ్వరరావు గారి కథ పేదరికంపై చదువు సాధించిన విజయ శంఖారావాన్ని పూరించింది. ఈ కథలు కేవలం చదివి వదిలేసేవి కావు. ఇవి మనల్ని ఆలోచింపజేసేవి, మన అహాన్ని ప్రశ్నించేవి, మనలోని కులమత జాడ్యాలను కడిగేసేవి. అక్షరం సజీవంగా ఉన్నంత కాలం, సమాజపు గాయాలకు ఇలాంటి సాంత్వన లభిస్తూనే ఉంటుంది.

అస్తిత్వ పోరాటంలో మనిషి ఏకాకి కాదని, కథ ఎప్పుడూ తోడుంటుందని ఈ సంకలనం ఘంటాపథంగా చెబుతోంది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# ఈ నాలుగు పనులు చేయకు...




**బంగారు కుదువ బెట్టకు**
**సంగరమున పారిపోకు సరసుడవైనన్**
**అంగడి వెచ్చములాడకు**
**వెంగలితో చెలిమి వలదు వినురా సుమతీ**

నువ్వు సంతోషంగా ఉండాలనుకుంటే, నా నీతి ఆలకించు. బంగారం తాకట్టు పెట్టకు. యుద్ధంలో పలాయనం చేయొద్దు. ఇంటికి కావలసిన చిల్లర సరుకులు దుకాణంలో అరువుకు కొనొద్దు. యుక్తాయుక్త జ్ఞానం లేనివారితో స్నేహం చేయొద్దు అంటున్నాడు..సుమతీ శతకకారుడు బద్దెన.

బద్దెన చెప్పిన ఈ నాలుగు సూత్రాలను అనుసరిస్తే మానవ జీవితం సంతోషంగా ఉంటుంది అని తెలుస్తుంది. మనుషుల దగ్గర ఉండే వస్తువులలో బంగారం అతి విలువైన వస్తువు. ఒకప్పుడు అవసరార్థం ఇంట్లో ఉండే ఇత్తడి పాత్రలను, రాగి పాత్రలను, కొన్ని ఖరీదైన వస్తువులను తాకట్టు పెట్టి డబ్బు తెచ్చుకునేవారు. సాధారణంగా మనకు పరిచయం ఉన్నవారు, మిత్రులు, బంధువులు మొదలైనవారు మనం అప్పు అడగ్గానే మన మీద ఉండే నమ్మకంతో అప్పు ఇస్తారు. ఆ అప్పును మనం సమయానికి తీర్చేస్తే, మరోసారి అడిగినా కూడా అప్పు ఇస్తారు. అప్పట్లో ఇటువంటివి సర్వసాధారణంగా జరుగుతుండేవి. అందువల్ల తాత్కాలిక ఇబ్బందులు తీరేవి. అలాగే బద్దెన కూడా అవతలి వ్యక్తికి మన మీద విశ్వాసం కలిగేలా చూసుకుని, చేబదులుగా అవసరానికి మాత్రమే అప్పు తీసుకుని, తిరిగి ఇచ్చేయడం ఉత్తమం. అంతేకాని ఆస్తులను తాకట్టు పెట్టే పరిస్థితి తెచ్చుకోవద్దని హితబోధ చేస్తున్నాడు.

**అదేవిధంగా..**

ఇంటిలో కావలసిన చిల్లర సరుకులను దుకాణంలో అరువుకు కొనొద్దని కూడా చెప్తోంది ఈ పద్యం. తిండికి సంబంధించి రెండు రకాలు ఉంటాయి. ఒకటి ఆకలి తీరటానికి తినేది. రెండోది జిహ్వా చాపల్యానికి తినేది. ఆకలి తీరటం కోసం కిరాణా కొట్టులో అరువు చేయడం తప్పు కాదు. జిహ్వా చాపల్యం కోసం అప్పు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. మనకు వచ్చే ఆదాయం ఎంతో లెక్క చూసుకుని, ఆదాయంలో ముందుగా ఆహారానికి అవసరమైన సరుకుల కోసం డబ్బు కేటాయించుకోవాలి. అప్పుడు తిండి కోసం అప్పు చేయవలసిన అవసరం రాదు. సాధారణంగా డబ్బులు ఇచ్చి కొనే సరుకులు తక్కువ ధరకు లభిస్తాయి. అరువు పెట్టి కొంటే వడ్డీ జత చేసి, అధిక ధరకు అమ్ముతారు. అందుకే శక్తికి మించిన ఖర్చు కారణంగా హెచ్చు ధర చెల్లించవలసి వస్తుంది. అందువల్ల ఎప్పుడూ అప్పులో ఉండిపోవడమే కాకుండా, మనకు కావలసిన మేలిమి సరుకును ఎంపిక చేసుకునే అవకాశం కూడా ఉండదు. ఎక్కువ సొమ్ము చెల్లించి కూడా, వారి ముందు దీనంగా నిలబడాలి. అందువల్ల చిల్లర సరుకులను అరువుకి కొనరాదని చెప్తున్నాడు బద్దెన.

**ఇక మరో విషయం**

యుద్ధంలో పారిపోకూడదు. పిరికితనం వల్లే పారిపోతారు. పిరికితనం ఎన్నడూ ప్రశంసనీయం కాదు. పౌరుషం క్షత్రియధర్మం. విజయనగర సామ్రాజ్యానికి - బహమనీ సుల్తానులకూ రక్కస తంగడి దగ్గర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో మోసంతో అళియరామరాయల తల నరికి, ఈటెకు గుచ్చి పైకెత్తి చూపారు సుల్తానులు. అది చూడగానే.. విజయనగర సేన తమ నాయకుడు చనిపోయినందుకు బెదిరి పారిపోయింది. వారు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ పిరికితనం కారణంగా వారు పారిపోయారు. దాంతో విజయనగరం ధ్వంసమైపోయింది. పిరికితనం వహించక నిలబడి ఉంటే, విజయనగర చరిత్ర మరోలా ఉండేది.

రామాయణంలో రాముడు తాటకిని చంపడానికి రెండడుగులు వెనుకకు వేసినప్పుడు, విశ్వామిత్రుడు యుద్ధనీతి బోధించి, తాటకిని సంహరింపచేశాడు.

**నాలుగో అంశం**

జ్ఞానం లేని వెంగలివానితో స్నేహం చేయకుండా ఉండటం. మూర్ఖత్వం కలిగినవాడు, వివేకశూన్యుడు..ఒకరు చెప్తే వినడు. వానికి తోచదు. ఇటువంటి వారు తాము నాశనమైపోవటమే కాకుండా, వారిని నమ్ముకున్న వారిని కూడా నట్టేట ముంచుతారు.

**రామాయణంలో**

రావణుడి మూర్ఖత్వం కారణంగానే పుత్రులను, అనేక మంది బంధువులను, వీరులను పోగొట్టుకున్నాడు. లంకానగర పౌరుల వినాశనానికి కారణమయ్యాడు. ఇక మహాభారతంలో దుర్యోధనుడు తనను నమ్ముకున్న కర్ణుడు మొదలుగా, తమ్ములనందరినీ కోల్పోయాడు. కురు, గురు వృద్ధుల మరణానికి కారణభూతుడయ్యాడు. వారి మూర్ఖత్వమే వారి నాశనానికి కారణమైంది. అంతేకాదు.. ఆ మూర్ఖత్వమే వారి మిత్రులను, బంధువులను కూడా నశింపచేసింది. కనుకనే వెంగలివానితో స్నేహం పనికిరాదంటున్నాడు బద్దెన.

- డా. పురాణపండ వైజయంతి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# నెమలీక

## మనమంతా ఒక్కటే


- కూచిమంచి నాగేంద్ర, 9182127880

యమునా నదీ తీరం లో వున్నా ఓ చిన్న వనం అది. అక్కడ పెద్ద పెద్ద చెట్లు తో పాటు దానిమ్మ, బత్తాయి, నారింజ, జామ లాటి మొక్కలు వున్నాయి.

అప్పుడే సాయం సంధ్యా సమయం అవుతోంది. పక్షులు ఒక్కొక్కటిగా గూటికి చేరుకుంటున్నాయి. మందారం అనే పిచ్చుక చెదిరిన తన గూడు సరి చేసుకుంటోంది. పక్కనే కొమ్మ మీద వున్నా కాకి " ఓ మందారం ఎప్పుడు ఎదో పనేనా ఒక్కసారైనా మాతో మాట్లాడేది ఉందా!" అంది. "ఎందుకు మాట్లాడను చీకటి పడుతోంది అని గూడు బాగు చేసుకుంటున్నా!" అంది. "ఆ పొట్టి ముక్కుతో ఏం పనిచేస్తావులే" అంది కాకి వెటకారంగా. ఆ పక్క నున్న ముసలి గ్రద్ద "కాకమ్మా ఎవరి అవసరాన్ని బట్టి ఈ సృష్టిలో శరీరాలు ఏర్పడ్డాయి. మందారం చిన్నది కనుక దాని ముక్కు కూడా చిన్నదే. అదే ఆ కొంగని చూడు చేపలు పట్టేందుకు వీలుగా పొడవైన మెడ అలాగే పొడవైన ముక్కు. ఇక ఈ చిలుకమ్మ కాయలు పండ్లు కోరికేందుకు వీలుగా దాని ముక్కు వంకరిగా కొనదేరి వుంటుంది." అంది. "ఏమిటీ ముక్కుల గోల" అంటూ కాకి వంక చూసింది వడ్రంగి పిట్ట, అదా సంగతి, కాకమ్మ ముక్కుకి ముక్కెర పెట్టింది అందుకే ముక్కు గురించి మాట్లాడడం మొదలు పెట్టింది." అంది. అన్ని పక్షులు కాకి వంక చూసాయి. కాకి మరింత వయ్యారం పోతూ ముక్కు అటు ఇటు తిప్పింది. ఆ హడావిడిలో దాని ముక్కెర కిందనున్న పుల్లల మద్యన పడి పోయింది. అయ్యో అని కాకి బాధ పాడడం చూసి , మందారం ఆ పుల్లల మద్యన దూరి ఆ ముక్కెర తెచ్చి ఇచ్చింది. నిన్ను అనవసరంగా మాటలన్నాను నన్ను క్షమించు మందారం. నేనైతే ఆ పుల్లల మద్యన దూరలేను" అంది కాకి. ఒకరికి ఒకరు సహాయం, చేసుకోవడంలో మనమంతా ఒకటే అంది ముసలి గ్రద్ద. అన్ని సంతోషించాయి.

◆◆





### లెక్కించండి

పండ్లను లెక్కపెట్టి పక్కనే వున్న బాక్సులో ఆ నెంబరును వేయండి.



### తప్పు ఎక్కడ?

ఈ బొమ్మలో ఒక తప్పు వుంది. అది ఏంటో కనిపెట్టండి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# అసలైన శిల్పి



సింహగిరిని నరేంద్రుడు పాలించేవాడు. మహారాణికి కానుకగా కోట పక్కన ఉన్న ఉద్యానవనంలో రామాలయం, కృష్ణాలయం నిర్మించి ఇవ్వాలని తలచి పక్క రాజ్యాల నుంచి సుధాముడు, వీరయ్య అనే ఇద్దరు పేరున్న శిల్పులను పిలిపించి వారికి బాధ్యతలు అప్పగించాడు రాజు. వారికి, సహాయ శిల్పులకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేశాడు మంత్రి. వీరయ్య, సుధాముడు తమకు సహాయ శిల్పులుగా పదేసి మందిని తమతోపాటు తీసుకొచ్చారు. ఏడాదిలోగా వీరయ్య కృష్ణ మందిరం పూర్తి అయ్యింది. ఒక శుభ ముహూర్తాన ఆ మందిరాన్ని రాజుకు అప్పగించాడు. తనకు సాయపడ్డ పదిమంది శిల్పులను కోట నుంచి పంపించివేశాడు. రాజు "మీ సహాయ శిల్పులు ఎక్కడ?" అని అడిగాడు. 'మహారాజా! వారికి మరో చోట పని పురమాయించాను' అని చెప్పాడు వీరయ్య. "మీకు, మీ సహాయ శిల్పులకు కలిపి ఇవిగో ఇరవై వేల వరహాలు" అని వీరయ్యకు ఇచ్చి సన్మానించాడు రాజు. తరువాత వీరయ్య తన దగ్గర పని చేసినవారికి అందరికీ కలిపి వెయ్యి వరహాలు మాత్రమే ఇచ్చాడు. అప్పటికి రామ మందిరం నిర్మాణం సగం మాత్రమే అయ్యింది. "వీరయ్య మందిరం పూర్తి చేసి ఇచ్చాడు నీకు ఎందుకు ఆలస్యం అవుతోంది" అని అడిగాడు రాజు. "మహారాజా! శిల్పంలో కళ ఉట్టిపడాలి. అందుకు తగిన సమయం పడుతుంది" అన్నాడు సుధాముడు. "అవును మహారాజా! సుధాముడు చెప్పింది అక్షర సత్యం" అన్నాడు మంత్రి. "సరే మీరు తగినంత సమయం తీసుకోండి" అన్నాడు రాజు. మరో ఆరు మాసాలకు రామ మందిరం పూర్తి అయ్యింది. ప్రతి రాతి స్తంభముతో పాటు ఎటు చూసినా శిల్పకళ జిరా అనిపించేలా ఉంది. మందిరంలో రామయ్య విగ్రహం నిజంగా జీవం పోసుకునేలా మలచబడి ఉంది. రాజు, రాణి, మంత్రితో సహా చూసిన ప్రతి ఒక్కరూ సుధాముడి శిల్పకళను మెచ్చుకున్నారు కృష్ణ మందిరం కంటే రామ మందిరం అపురూపంగా ఉందని చూసిన వారు అన్నారు. రాజు సుధాముణ్ణి ఎంతగానో మెచ్చుకున్నాడు. "రాజా! ఇది నా గొప్పతనం కాదు నాకు సాయం చేసిన శిల్పులది" అన్నాడు సుధాముడు ఎంతో వినమ్రంగా. సుధాముడి కోరిక ప్రకారం రాజు సుధాముడితో సహా మిగతా శిల్పులందరికీ రెండు వేల వరహాల చొప్పున ఇచ్చి ఘనంగా సన్మానించాడు. వీరయ్యకు, సుధాముడికి ఉన్న తేడాను గమనించాడు రాజు. సుధాముడు తన దగ్గర ఉన్న సహాయ శిల్పులకు సమానంగా వరహాలు ఇప్పించిన విషయం వీరయ్య దగ్గర పని చేసే శిల్పులకు తెలిసి, వారు వీరయ్య దగ్గర పని మానేసి సుధాముడి దగ్గర పనిచేయడానికి సిద్ధపడ్డారు. సుధాముడి పనితనం ఇతర రాజ్యాల వారు కూడా గుర్తించారు. తప్పు తెలుసుకున్న వీరయ్య మనసులోనే పశ్చాత్తాపపడ్డాడు.

- యు. విజయశేఖర రెడ్డి

balajyothy
బాలజ్యోతి

# ప్రయత్నం

అడవిలో ఒక బుజ్జి ఎలుగుబంటి, బుల్లి కోతి స్నేహంగా ఉండేవి. ఎలుగుబంటి లావుగా, ముద్దుగా ఉండేది. కానీ దానికి సోమరితనం ఎక్కువ. అన్నింటికి వాళ్ల అమ్మ మీదే ఆధారపడేది. ఆహారం తెచ్చిపెడితేనే తినేది. ఇలా అయితే ఎలా బతుకుతుందో ఏమో అని తల్లి బాధపడేది.

అడవిలోకి వెళ్దాం పద అని కోతి అడిగితే 'అమ్మో! నేను నడవలేను, నా వల్ల కాదు' అని అనేది. కోతి మాత్రం 'హుషారుగా ఉండాలి మిత్రమా' అంటూ చెట్ల పైకి గెంతుతూ ఉండేది.

ఒకరోజు అడవిలో తినడానికి పండ్లు ఏమీ దొరక్కపోయేసరికి, దూరంగా ఉన్న కొండపైకి వెళ్దామని కోతి అడిగింది. 'అంత దూరం నేను రాలేను బాబోయ్!' అని ఎలుగుబంటి కింద కూర్చుండిపోయింది.

అప్పుడు కోతి 'మిత్రమా! నీలో చాలా శక్తి ఉంది, నువ్వు బలవంతుడివి తెలుసా' అంది.

'నిజంగానా? నేను అంత బలవంతుడినా!' అని ఎలుగుబంటి ఆశ్చర్యంగా అడిగింది.


'అవును! వెళ్దాం పద!' అని కోతి ఎలుగు బంటిని నడిపించింది.

అలా వెళ్తుంటే దారిలో ఒక పెద్ద లోయ అడ్డొచ్చింది. అక్కడ ఒక కర్ర మాత్రమే వంతెనలా ఉంది. 'వామ్మో! పడిపోతే నా ఎముకలు విరిగిపోతాయి' అని ఎలుగుబంటి వణికిపోయింది.

కోతి నవ్వుతూ 'భయపడకు మిత్రమా, నీ కాళ్లకు మంచి పట్టు ఉంటుంది. ధైర్యంగా అడుగు వెయ్యి' అంది.

'సరే.. ప్రయత్నిస్తాను' అంటూ ఎలుగు బంటి మెల్లగా అడుగులు వేసింది. చకచకా లోయ దాటేసి, 'హమ్మయ్య! నేను పడిపోలేదు, నాకు భయం పోయింది!' అని గంతులు వేసింది.

కొంచెం దూరం వెళ్యాక చెట్టుపైన ఒక పెద్ద తేనెపట్టు కనిపించింది. 'నాకు తేనె అంటే ఇష్టం. కానీ అంత ఎత్తు నేను ఎక్క లేను' అని ఎలుగుబంటి నీరసపడిపోయింది.



'ప్రయత్నించకుండానే రాదు అని ఎలా చెప్తావు? నీ పదునైన గోళ్లతో చెట్టును పట్టుకో' అని కోతి చెప్పింది.

'సరే, నువ్వు చెప్పినట్టే ఎక్కుతాను!' అంటూ ఎలుగుబంటి కష్టపడి పైకి పాకింది. తేనెపట్టును కిందకు తీసుకొచ్చి రుచి చూస్తూ 'అబ్బా! కష్టపడి తెచ్చిన తేనె ఎంత తియ్యగా ఉందో చూడు' అంది.

'చూశావా? ప్రయత్నిస్తే ఏదైనా దొరుకుతుంది' అని కోతి మెచ్చుకుంది.

'మిత్రమా! నాలో ఇంత శక్తి ఉందని నేను ఎప్పుడూ ఊహించలేదు తెలుసా?' అంది.

'అవును! నువ్వు చాలా బలవంతుడివి. కానీ నీ మీద నీకు నమ్మకం లేదు. అంతే' అంది కోతి.

'ఇక మీదట నేను సోమరిగా ఉండను, నా పనులు నేనే చేసుకుంటా' అని ఎలుగుబంటి అంది.

'అదే అసలైన జీవితం అంటే! ఎవరి సాయం కోసం చూడకూడదు' అని కోతి చెప్పింది.

అప్పటి నుంచి ఎలుగుబంటి నడకలో భయం పోయి రాజసం వచ్చింది. 'నాకు ఆపదలు వచ్చినా పర్వాలేదు, అవి నాకు కొత్త విషయాలు నేర్పుతాయి. ఇతరులపై ఆధార పడటం మానేస్తే వచ్చే తృప్తి చాలా బాగుంది' అంది ఎలుగుబంటి.

'నిరంతర ప్రయత్నమే నీ ఆయుధం' అని కోతి నీతి చెప్పింది.

'ధన్యవాదాలు మిత్రమా! నా జీవితాన్ని మార్చేశావు' అని ఎలుగుబంటి కోతిని కౌగిలించుకుంది. అప్పటి నుంచి బుల్లి ఎలుగుబంటి తన సొంత బలంతో అడవిలో హాయిగా, ధైర్యంగా జీవించసాగింది.

- పైడిమర్రి రామకృష్ణ

## పదాల పజిల్

ఇచ్చిన ఆంగ్ల పదాలు పజిల్‌లో ఎక్కడున్నాయో వెతకండి.


| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| B | P | O | O | L | U | V | G | W | G |
| A | G | O | L | F | S | O | B | U | Z |
| S | P | S | B | F | O | L | A | Z | X |
| K | O | R | O | O | C | L | S | T | C |
| E | L | S | W | O | C | E | E | E | R |
| T | O | Q | L | T | E | Y | B | N | I |
| B | C | U | I | B | R | B | A | N | C |
| A | C | A | N | A | I | A | L | I | K |
| L | R | S | G | L | V | L | L | S | E |
| L | L | H | C | L | Y | L | U | W | T |

POOL
CRICKET
SOCCER
TENNIS
BASKETBALL
FOOTBALL
GOLF
SQUASH
BASEBALL
POLO
BOWLING
VOLLEYBALL

## దారి చూపండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి




# మంచి గుణం

• పైడిమర్రి రామకృష్ణ

పిల్లల కథ

ఒక అడవిలో ఎలుగుబంటి నివసించేది. అది అడవిలోని జంతువులన్నింటికీ వైద్యం చేసే గొప్ప వైద్యుడు. రకరకాల ఆకులు, వేర్లు, మూలికలతో అది అద్భుతమైన మందులు తయారు చేసేది. తనకు కావాల్సిన కొన్ని అరుదైన ఔషధాల కోసం ఎలుగుబంటి తరచుగా పొరుగున ఉన్న అడవికి వెళ్తుండేది. అక్కడ తన మిత్రుడైన కోతిని కలుసుకోవడం దానికి ఎంతో ఇష్టం.

ఆ కోతి కూడా గొప్ప వైద్యుడు కావడంతో, తన ఇంటి వెనుక ఒక పెద్ద ఔషధ వనాన్ని పెంచుతోంది. ఆ తోటలో లేని మొక్క అంటూ లేదు. ఒకరోజు ఎలుగుబంటికి అత్యవసరంగా కొన్ని మూలికలు అవసరమయ్యాయి. వెంటనే అది బయలుదేరి కోతి ఇంటికి చేరుకుంది. మిత్రుడిని చూడగానే కోతి ఎంతో సంతోషించింది.

‘మిత్రమా! ఏమైంది? విచారంగా ఉన్నావు ఎందుకు? నా సహాయం ఏమన్నా కావాలా?’ అని కోతి అడిగింది. దానికి ఎలుగుబంటి ‘మిత్రమా! మా అడవిలో ఒక వ్యాధి వ్యాపిస్తోంది. దానికి కొన్ని ప్రత్యేకమైన మూలికలు కావాలి’ అని కోరింది. కోతి నవ్వుతూ, ‘దానిదేముంది! మన తోటలో నీకు కావాల్సినవన్నీ ఉన్నాయి. వెళ్లి నీకు నచ్చినవి తీసుకో’ అని చెప్పింది.

కానీ ఎలుగుబంటి తోటలోకి అడుగు పెట్టగానే దిగ్భ్రాంతికి గురైంది. అక్కడ మొక్కలన్నీ ఎవరో తొక్కినట్లు నలిగిపోయి ఉన్నాయి. చిన్న చిన్న మొక్కలన్నీ నేలమట్టమై ఉన్నాయి. ఎలుగుబంటి తిరిగి వచ్చి కోతికి ఈ విషయం చెప్పింది. కోతి పరిగెత్తుకుంటూ వెళ్లి తన తోటను చూసుకుని కన్నీళ్లు పెట్టుకుంది.

‘అయ్యో! నా ప్రాణం కంటే మిన్నగా పెంచుకున్న మొక్కలన్నీ ఇలా అయిపోయాయే! ఎవరో క్రూరులు కావాలనే నా తోటను నాశనం చేశారు’ అని కోతి ఏడ్చింది. ఎలుగుబంటి అక్కడి నేలను నిశితంగా పరిశీలించింది. నేలపై ఉన్న పెద్ద అడుగుజాడలను చూసి అది ఒక నిర్ణయానికి వచ్చింది.

‘మిత్రమా, ఏడవకు. ఈ అడుగుజాడలను చూస్తుంటే ఇది ఒక ఏనుగు చేసిన పని అని అర్థమవుతోంది’ అని ఎలుగుబంటి చెప్పింది. కానీ కోతి ఆ మాటలను అస్సలు ఒప్పుకోలేదు. ‘కాదు మిత్రమా! మా అడవిలోని ఏనుగు చాలా మంచిది. అది అందరికీ సహాయం చేస్తుంది. అది ఇంతటి అన్యాయం ఎప్పటికీ చేయదు’ అని వాదించింది.

నిజం తెలుసుకోవడానికి అవి రెండూ కలిసి అడవిలోకి బయలుదేరాయి. అవి నది ఒడ్డుకు చేరుకోగానే అక్కడ ఏనుగు నీళ్లు తాగుతూ కనిపించింది. ఏనుగు కాళ్లకు నలిగిపోయిన ఆకులు, పువ్వులు అతుక్కుని ఉండటం కోతి గమనించింది. తన తోటలోని ఔషధ మొక్కలన్నింటినీ తొక్కి నాశనం చేసింది, తొండంతో పీకింది ఏనుగేనని కోతి, ఎలుగుబంటి గ్రహించాయి.

అప్పుడు ఎలుగుబంటి కోతి వైపు తిరిగి గంభీరంగా ఇలా అంది, ‘చూడు మిత్రమా! ఒకరిలో ఒక మంచి గుణం ఉన్నంత మాత్రాన, వారిలో చెడు గుణాలు ఉండవని అనుకోవడం మన పొరపాటే.’

దూరంగా నది ఒడ్డున ఒక కొంగ ఏకాగ్రతతో తపస్సు చేస్తున్నట్లు నిలబడి వాటికి కనిపించింది. ఎలుగుబంటి ఆ కొంగను చూపిస్తూ, ‘ఆ కొంగను చూడు, అది ఎంత శాంతంగా కనిపిస్తోంది! కానీ లోపల క్రూరమైన ఆలోచనతో చేపల కోసం వేచి చూస్తోంది’ అని చెప్పింది.

అదే సమయంలో ఒక చిన్న కుందేలు ఏడుస్తూ అక్కడికి వచ్చింది. ఏనుగును చూసి భయపడుతూనే, ‘గజరాజా! నిన్న నువ్వు నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు నీ భారీ పాదాల కిందపడి మా ఇల్లు కూలిపోయింది. మా పిల్లలు తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. నువ్వు కనీసం వెనక్కి కూడా చూడకుండా వెళ్ళిపోయావు’ అని ఫిర్యాదు చేసింది.

కుందేలు మాటలు విన్న ఏనుగుకు ఒక్కసారిగా తలవంపులయ్యింది. తన శక్తి.. బలంతో ఇతరులను రక్షిస్తున్నానన్న గర్వంలో, తన కదలికల వల్ల ఇతరులకు కలుగుతున్న నష్టాన్ని తాను గమనించలేదని ఏనుగు గ్రహించింది. అజాగ్రత్త కూడా ఒక పెద్ద తప్పేనని దానికి అర్థమైంది.

వెంటనే ఏనుగు కోతి దగ్గరకు నడుచుకుంటూ వచ్చింది. ‘నన్ను క్షమించు మిత్రమా! నేను కావాలని నీ తోటను నాశనం చేయలేదు. కానీ నా నడక వల్ల నీకు ఇంత నష్టం జరుగుతుందని నేను ఊహించలేదు. నా అజాగ్రత్త వల్ల జరిగిన ఈ తప్పుకు నేను ఎంతో విచారిస్తున్నాను’ అని వేడుకుంది.

కోతి ఏనుగు పశ్చాత్తాపాన్ని చూసి మనసు మార్చుకుంది. ఎలుగుబంటి చెప్పినట్లు ఎవరినీ గుడ్డిగా నమ్మకూడదని, లోపల ఉండే అసలు గుణం బయటపడే వరకు ఎవరినీ అంచనా వేయకూడదని గ్రహించింది. ఆ రోజు నుండి ఏనుగు అడవిలో నడుస్తున్నప్పుడు ప్రతి అడుగు జాగ్రత్తగా వేయడం ప్రారంభించింది.

## హితవచనం

అలముదకేన తృణైర్వా మనస్వినా ప్రాణధారణా కార్యా
నాసంస్కృతశ్చ పురుషః ప్రాకృతసత్త్వః ప్రణయితవ్యః

ఆత్మాభిమానం ఉన్నవాడు ఆకులు అలములు తినిగాని, కేవలం మంచినీళ్లు తాగిగాని ప్రాణాలు నిలబెట్టుకుంటాడే తప్ప నీచులను సంతోషపెట్టడానికి ప్రయత్నించడు.

# అల్లరి
ALLARI



## చెప్పుకోండి

- తిరిగే దీపం. గాలి-వానకు ఆరని దీపం. చమురులేని దీపం. పిట్టల దీపం?

  **- మిణుగురు పురుగు**

- నీరు తగిలితే గుప్పెడవుతుంది. ఎండ తగిలితే గంపెడవుతుంది?

  **- దూది**

- అన్నదమ్ములు ముగ్గురు. తిరిగితే ముగ్గురూ తిరుగుతారు, మానితే ముగ్గురూ మానుతారు?

  **- ఫ్యాన్**

## పెద్దల మాట



ఓటు, సత్యాగ్రహం.. ఈ రెండూ ప్రజలచేతిలోని ఆయుధాలు.

**- మహాత్మా గాంధీ.**

## నీడలు కనుక్కోండి

**ఈ బొమ్మ సరైన నీడ ఏదో కనుక్కోండి.**



## టంగ్ ట్విస్టర్స్

The poor boar pours batter over his putter


## మీకు తెలుసా?

భూమిని ఉత్తరార్ధ గోళం, దక్షిణార్ధ గోళం అని రెండుగా విభజించారు. అయితే, దక్షిణాదితో పోలిస్తే.. ఉత్తరార్ధంలోనే మనుషులు మనుగడ సాగించడానికి ఎక్కువ అనుకూలంగా ఉంటుందట. అందుకే, ప్రపంచ జనాభాలోని దాదాపు 90శాతం మంది.. ఉత్తరార్ధ గోళంలోనే జీవిస్తున్నారు.

# కోడి కూర

**కొత్త** కోడలు అత్తగారింటికి వచ్చింది. 'వంటలేమైనా వచ్చా?' అని అడిగింది అత్త. వచ్చని చెబితే అన్ని పనులూ చేయాల్సి వస్తుందని.. 'అన్నం వండటం కూడా రాదత్తయ్యా' అని చెప్పింది కోడలు. 'బియ్యం ఉడకబెట్టడం కూడా చేతకాకపోతే ఎలా?' అని అరుద్దామనుకుంది అత్త. కానీ, కొత్త కోడలితో కొట్లాట ఎందుకని గమ్మున ఉండిపోయింది. ఆదివారం వచ్చింది. కోడలి నోరు మసాలా తిండి కోసం ఆరాటపడసాగింది. అయితే, వంటింట్లోంచి ఘుమఘుమ వాసనలేవీ రాలేదు. మెల్లగా నడుచుకుంటూ అత్త దగ్గరికి వచ్చి నిలబడింది. ఏమి కావాలన్నట్లుగా చూసింది అత్త. ప్రతి ఆదివారం మాంసాహారం లేనిదే గొంతులోకి ముద్ద దిగదని చెప్పింది కోడలు. వెంటనే ఆ గడసరి అత్త.. 'అయ్యో కోడలా! నాకు కోడిగుడ్డు ఉడకబెట్టడం కూడా చేతకాదు' అని చేతులు తిప్పుతూ చెప్పింది. మాంసం వంటలు చెయ్యడం తెలుసని చెప్పకపోతే ఆదివారం నాడు కూడా పప్పన్నమే తినాల్సి వస్తుందని గ్రహించింది కోడలు. 'మాంసం వంటలు చేయడం నాకు తెలుసత్తయ్యా' అని మెత్తమెత్తగా చెప్పింది. 'అలా రా దారికి' అనుకుంది అత్త. తలుపు చాటున దాగి ఉన్న కొడుకు అంతా విన్నాడు. పరుగున వెళ్లి కోడిని పట్టుకొచ్చాడు. అందరూ కలిసి కోడికూర చేసుకుని 'జ్యాం జ్యాం' అని తిన్నారు.

... ✍ ఆర్సీ కృష్ణస్వామి రాజు



## అమర్చండి

**బొమ్మను చూసి, అక్షరాలను సరైన క్రమంలో అమర్చండి.**






## పూరించండి

**బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.**



_lou_berry



j_ic_

## పద్యం - భావం

**తెలియని కార్యమెల్లఁగడతేర్చుట కొక్కవివేకి జేకొనన్**
**వలయునట్లైన దిద్దుకొనవచ్చుఁబ్రయోజనమాంద్యమేమియుం**
**గలుగదు ఫాలమందు దిలకం బిడునప్పుడు చేతనద్దమున్**
**గలిగిన జక్క జేసికొనుగాదె నరుం డది చూచి భాస్కరా!**

తాత్పర్యం: మనుషులు నుదుటిపైన బొట్టు పెట్టుకొంటూ, చేతిలోని అద్దం సాయంతో ఆ బొట్టు వంకర టింకర లేకుండా సరిచేసుకుంటారు. అలాగే తెలివిగలవాడు కూడా నేర్పరి దగ్గరికి వెళ్లి, పనులను చక్కదిద్దుకొని.. సంతోషంగా ఉంటాడు అని భావం.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

బాలల కథ



# చిగురించిన స్నేహం

కూచిమంచి నాగేంద్ర
91821 27880

తరగతి గది. నాలుగు కిటికీలు, ఒక పెద్ద ద్వారం. గోడకు నల్ల రంగు వేసిన బోర్డు. డయాస్ మీద ఒక పెద్ద టేబుల్. కింద వరుసగా డెస్కులు, వాటి వెనుక బెంచీలు. 'ఎంత పెద్ద తరగతి గది! మా ఊర్లో ఉన్న పాకబడిలో బల్లలే లేవు. అంతా కింద కూర్చోవడమే. పాపం మాస్టారు నిలబడే పాఠం చెప్పాలి. ఆయన కూర్చోవడానికి ఒక చిన్న బల్ల ఉంటుంది అంతే..' అని శ్రీను ఆలోచిస్తుండగా, 'ఏయ్.. నిన్నే..' అనడంతో వాస్తవంలోకి వచ్చాడు. 'నీ పేరు ఏంటి?' అడిగాడు అప్పుడే లోపలికి వచ్చిన ఒక అబ్బాయి.

'నా పేరు శ్రీను. పక్కనున్న సరిపల్లె నుంచి వచ్చాను' అన్నాడు నెమ్మదిగా. 'ఓ.. పల్లెటూరి పిల్లాడివా? ఎప్పుడూ ఇలాంటి బడి చూసి ఉండవు' అన్నాడు అతను వెటకారంగా. 'అవును, మాది పాకబడి' అన్నాడు శ్రీను. 'నీ పేరు?' అని అడిగాడు. 'నా పేరు శేఖర్. నేను మొదటి నుండి ఇక్కడే చదువుతున్నాను. క్లాసు ఫస్ట్ కూడా నేనే' అన్నాడు. ఇలా వీళ్లు మాట్లాడుతుండగానే మిగతా విద్యార్థులు వచ్చారు. అందరికీ అలవాటేమో, ఎవరి బెంచీల్లో వాళ్లు కూర్చున్నారు. శ్రీను అక్కడ నుంచి లేచి, వెనుక కూర్చున్నాడు. బెల్ కొట్టగానే మాస్టారు క్లాసులోకి వచ్చారు. 'కొత్తగా జాయిన్ అయింది ఎవరు?' అని అడిగారు. 'నేను సార్, నా పేరు శ్రీను' అన్నాడు. 'శ్రీను ఏంటి? పూర్తి వివరాలు చెప్పు' అన్నారు మాస్టారు. 'నా పేరు పొన్నగంటి శ్రీనివాస్ సార్. నేను ఇక్కడికి దగ్గరగా ఉన్న సరిపల్లె నుంచి వచ్చాను. మా అమ్మ పేరు లక్ష్మి' అన్నాడు శ్రీను. 'మరి మీ నాన్నగారి పేరు?' అడిగారు మాస్టారు.

'నాకు నాన్న లేడు సార్' అన్న శ్రీను మాటకి, 'అయ్యో.. సరే కూర్చో. బుద్ధిగా చదవాలి' అన్నారు. 'సరే సార్' అన్నాడు శ్రీను. ఒకరిద్దరు శ్రీను వంక చూసినా, శేఖర్ వారించడంతో ఎవరూ శ్రీనుతో మాట్లాడలేదు. కానీ శ్రీను ఎప్పుడూ చదువుకుంటూ ఉండేవాడు. వారం గడిచింది.

ఒకరోజు హెడ్ మాస్టారు క్లాసులోకి వచ్చారు. "డియర్ స్టూడెంట్స్, ఈరోజు ఒక లెక్క ఇస్తాను. మీలో ఎవరు చేయగలరో చూద్దాం" అంటూ బోర్డు మీద ఒక లెక్క ఇచ్చారు. శేఖర్, శ్రీను తప్ప మిగతా ఎవరూ ఆ లెక్క చేయడానికి ముందుకు రాలేదు. ముందుగా లెక్క చేయడానికి వెళ్లాడు శేఖర్. బోర్డు మీద సగం చేసిన తర్వాత ఆలోచనలో పడ్డాడు. హెడ్ మాస్టారు చెప్పగానే శ్రీను ఆ లెక్కను సాధించాడు. క్లాసు అంతా చప్పట్లు కొట్టారు. శేఖర్ ముఖం వాడిపోయింది. ఆ రోజు నుండి శ్రీను మీద మరింత కోపం పెంచుకున్నాడు శేఖర్. ఎప్పుడూ శ్రీను గురించే ఆలోచించడం మొదలుపెట్టాడు. దానితో అతను చదువులో కొద్దిగా వెనుకబడ్డాడు. కానీ శ్రీను అలా కాదు, శేఖర్‌ని ఒక స్నేహితునిగా భావించాడు. మొదటి యూనిట్ టెస్టులో శ్రీనుకు ఎక్కువ మార్కులు రావడం, శేఖర్ రెండవ స్థానంలో నిలవడం జరిగింది.

దానితో శేఖర్ డీలా పడిపోయాడు. శేఖర్ తల్లి శాంతి స్కూలుకు వచ్చింది. ఎప్పుడూ క్లాసు ఫస్ట్‌గా ఉండే తన కొడుకు సెకండ్ ప్లేస్ రావడమే కాకుండా, ఎప్పుడూ అన్యమనస్కంగా ఉండటానికి కారణం తెలుసుకోవాలని అనుకుంది. 'నమస్తే ఆంటీ!' అంటూ శాంతిని పలకరించాడు శేఖర్ స్నేహితుడు సత్యం.

'సత్యం, ఇలా రా!' అంటూ ఒకచోట కూర్చోబెట్టి శేఖర్ గురించి అడిగింది శాంతి. 'ఆంటీ, ఈ మధ్య మా స్కూల్లో శ్రీను అనే అబ్బాయి జాయిన్ అయ్యాడు. చాలా మంచివాడు, బాగా చదువుతాడు. శేఖర్ తనకు వాడు పోటీ అని అతని మీద కోపం పెంచుకుంటున్నాడు. మమ్మల్ని కూడా అతనితో మాట్లాడనివ్వడం లేదు. ఎప్పుడూ వాడి ఆలోచనే, పాఠాలు కూడా శ్రద్ధగా వినడం లేదు' అని చెప్పాడు సత్యం. విషయం తెలుసుకున్న శాంతి, తన కొడుకు సమస్యకు కారణం అర్థమై, ఇంటికి వెళ్లిపోయింది.

మరుసటి రోజు ఆదివారం శేఖర్ అమ్మ ఇచ్చిన జంతికలు తింటూ టీవీలో ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ చూస్తున్నాడు. మ్యాచ్‌లో అప్పుడే ఒక ఫీల్డర్ క్యాచ్ పట్టడంతో అందరూ అతని దగ్గరకు వచ్చి అభినందించారు. 'శేఖర్ చూశావా?' అంది శాంతి. 'చూశానమ్మా.. చాలా బాగా క్యాచ్ పట్టాడు' అన్నాడు. 'అవును, కానీ అతను క్యాచ్ పట్టినందుకు అందరూ అభినందించారు తప్ప, ''నా కంటే బాగా క్యాచ్ పట్టాడు'' అని అతనిపై ఎవరూ కోపం పెంచుకోలేదే' అంది.

'అదేంటమ్మా! అలా అంటావు? అంతా కలిసి ఆడితేనే కదా ఆ టీమ్‌కి, ఆ రాష్ట్రానికి పేరు వచ్చేది' అన్నాడు శేఖర్. 'కదా! మరి నువ్వు మీ క్లాసులో నీ కంటే కొద్దిగా బాగా చదివిన శ్రీనుపై ఎందుకు కోపం పెంచుకుంటున్నావు? మీరంతా బాగా చదివితేనే కదా మీ క్లాసుకి, మీ స్కూల్‌కి పేరు వచ్చేది'. అంది. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు శేఖర్. ఆ తర్వాత తల దించుకున్నాడు. 'తల దించుకున్న శేఖర్‌ని నేను ఎప్పుడూ చూడలేదు. నా కొడుకు ఎప్పుడూ ఒకరి ఎదుగుదలను చూసి ఓర్వలేనివాడు కాకూడదు. వారితో సమానంగా పోటీ పడి, గెలిచేవాడు కావాలి. అలాగే అందరితో స్నేహంగా మెలిగేవాడు కావాలి' అంది. 'తప్పు చేశానమ్మా! నన్ను క్షమించు. ఇకపై శ్రీనుతో స్నేహంగా ఉంటాను' అన్నాడు శేఖర్. 'గుడ్! ఇదీ శేఖర్ అంటే..' అంటూ తల నిమిరింది తల్లి శాంతి. మరుసటి రోజు స్కూల్లో పిల్లలు మొక్కలు నాటుతున్నారు. శ్రీను కూడా గుంట తీసి, మొక్క నాటాడు. గుంట తీయడానికి కష్టపడుతున్న శేఖర్‌ని చూసి 'నేను సహాయం చేయనా?' అన్నాడు శ్రీను. 'చేస్తావా?' అన్నాడు శేఖర్ ఆశ్చర్యంగా. అంతే, శ్రీను చక్కగా గుంత తీసి, శేఖర్ వేయవలసిన మొక్కను కూడా నాటాడు. తర్వాత ఇద్దరూ ఆ మొక్కకి నీరు పోశారు. 'మనం వేసిన ఈ మొక్కలు మన స్నేహంలాగే ఎదగాలి, మంచిపువ్వులు పూయాలి' అన్నాడు శేఖర్. 'భలే!' అన్నాడు శ్రీను. వాళ్లని అలా చూసిన మిగిలిన మిత్రులు ఆనందంగా వాళ్ల దగ్గరకు చేరారు.

SUNDAY
విశాలాంధ్ర
ఆదివారం అనుబంధం
8 | 28 ఆదివారం, జూన్ 2026

మనిషి సంభాషణా చాతుర్యం అలవర్చుకోవాలంటే అందుకు కావలసింది మౌనం, వినయం.
- మౌంటెన్









# విచక్షణ అవసరం!

మహామంత్రి విష్ణుశర్మ, సేనాధిపతి విక్రమభట్టు సహకారంతో కీర్తివర్మ విజయపురి రాజ్యాన్ని ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నాడు. అలాగే పొరుగురాజ్యాలతో సైతం చక్కని మైత్రిబంధం కొనసాగిస్తుండటంతో కీర్తివర్మ తన రాజ్యంలోని ప్రజలదృష్టిలోనే కాదు పొరుగు రాజ్యాలలో కూడా మంచి పాలనాదక్షుడుగా పేరు సంపాదించుకున్నాడు. కీర్తివర్మ కుమారుడు విజయవర్మ, మహామంత్రి కుమారుడు భాస్కరశర్మ, సేనాధిపతి ఇద్దరు కుమారులు మాధవ, మోహన భట్టు. వీరంతా ప్రాణ స్నేహితులు. ఆ నలుగురిలో చిన్నవాడైన మాధవభట్టు అంటే మిగిలినవారికి ఎంతో ఇష్టం. అయితే చిన్నవాడు కావడంతో కొంచెం తుంటరిపనులు చేస్తుంటాడు. వీరంతా గురుకులంలో విద్యాభ్యాసం పూర్తిచేసుకుని రాజధానికి బయలుదేరారు. అలా మిత్రులందరూ చుట్టుపక్కల వింతలు, విశేషాలను పరిశీలిస్తూ రాజధానిలోకి ప్రవేశించేచోట ఉన్న మామిడి తోటలో కాసేపు విశ్రాంతి తీసుకుందామని ఆ తోటలోకి ప్రవేశించారు. తోటమాలి వారికి విశాలమైన పందిరిని చూపించి అక్కడ విశ్రాంతి తీసుకుని వెళ్ళవచ్చునని, మంచినీరు, తినేందుకు ఏమైనా కావాలంటే చేసిపెట్టమని అక్కడ ఉన్న వృద్ధ దంపతులకు చెప్పి ఓ ఇద్దరిని వారికి సహాయకులుగా ఉంచి తను కూలీలతో పాటు తోటలోని మరోవైపు వెళ్లాడు.

అప్పటివరకు గురుకులంలో గురువుల క్రమ శిక్షణలో మెలిగిన వారికి ఒక్కసారిగా పంజరంలో చిలుకకు స్వేచ్ఛ వచ్చినరీతిన వారికి స్వేచ్ఛ వచ్చినట్లయింది. కాసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం తోటలోపలికి ప్రవేశించారు. అక్కడి చెట్లకున్న మామిడిపండ్లను చూసి మాధవ భట్టు 'మిత్రమా విజయ! ఈ మామిడిపండ్లు నన్ను తినమని నోరూరిస్తున్నాయి. రండి కోసుకుందాం!' అన్నాడు మిగిలినవారివైపు చూస్తూ.

దానికి యువరాజు 'ఇప్పుడు వద్దులే మాధవా! రాజ్యానికి వెళ్లినతర్వాత నీకు కావలసినన్ని తినేలా నిన్ను మామిడిబుట్టల మధ్యనే కూర్చో బెట్టిస్తాలే' అన్నాడు నవ్వుతూ. అయితే అతనికి వాటిని తినాలనిఉన్నా భాస్కరుడు ఏమంటాడో అని అతని వంకచూస్తూ. మిత్రుని ఆంతర్యం గ్రహించిన భాస్కరశర్మ మాధవుడి వైపుచూస్తూ 'మనం ఎవరో తెలియకపోయినా బాటసారులుగా విశ్రాంతి తీసుకునేందుకు ఈ తోటలోకి అను మతించారు. తోట యజమాని, కాపలావారిని అడిగి కోసు కోవడం ధర్మం. ముందు ఆ పనిచేయి' అన్నాడు.

'యువరాజుగా విజయునికి ఏదైనా చేయగల అధికారం ఉంది' అన్నాడు మిత్రుని ఉత్సాహ పరుస్తూ. కొంతసేపటికి యువరాజు ఒప్పు కున్నాడు. అయితే భాస్కరుడు మాత్రం 'మిత్రులారా! నా మనసుకు అది తప్పనితోస్తున్నది. మీరెళ్ళిరండి. నేను ఇక్కడే ఉంటా. యువరాజు జాగ్రత్త' అన్నాడు. 'నీకు అతిజాగ్రత్త ఎక్కువ మిత్రమా' అని భాస్కరుని వైపుచూసి నవ్వుతూ ముగ్గురు మిత్రులు తోటంతా కలియతిరుగుతూ అక్కడివారు మా యజమాని తిడతాడు వద్దని వారిస్తున్నా వినక తోటలో చాలా భాగాన్ని తమ ఉత్సాహంతో చిందరవందరచేసి కాసేపటి తర్వాత అందరూ కలిసి రాజధాని చేరారు. ఆ మరునాడు ఆ ఊరి పెద్దకు వారిపై ఫిర్యాదుచేశాడు తోట యజమాని. అప్పటికే వారి గురించి తెలుసుకున్న ఆ ఊరిపెద్ద తోట యజమానికి వారెవరో చెప్పడంతో ఏమి చేయాలో తెలియక మిన్నకుండిపోయాడు. అయితే ఆ మిత్రుల భద్రతరీత్యా వారికి తెలియకుండా అనుసరించిన రాజుగారు పంపిన గూఢచారుల ద్వారా జరిగింది తెలుసుకున్నారు మహారాజు, మహామంత్రి, సేనాధిపతి.

భవిష్యత్‌లో పాలకులుగా, రాజ్యాన్ని ప్రశాంతంగా ఉంచవలసినవారు అటువంటి పనిచేయడం వల్ల ప్రజల్లో వారిపై సదభిప్రాయం కలగదు. వారిలా ఇంకొందరు అలాగే ప్రవర్తించే అవకాశం ఉంటుంది. అది రాజ్యానికి, ప్రజలకు క్షేమంకాదు. అని వారు ఒక నిర్ణయానికి వచ్చారు.

మహారాజు అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి తోట యజమానిని, అక్కడివారిని పిలిపించి విచారించాడు. అప్పుడు మాధవభట్టు 'దీని కంతటికి కారణం నేనే ప్రభూ! మిత్రుడు భాస్కరుడు వద్దని, తోటవారిని అడగమనిచెప్పినా నేనే యువరాజును రమ్మని ప్రోత్సహించాను. తోట యజమానికి, అక్కడివారికి, మీకు మనస్తాపం కలిగేలా ప్రవర్తించినందుకు నన్ను శిక్షించండి ప్రభూ' అన్నాడు వినమ్రంగా. అప్పుడు యువరాజు 'క్షమించండి. మహారాజా! మా సరదా ఇంతలా పరిణమిస్తుందనుకోలేదు. యువరాజుగా ఇందుకు బాధ్యత నాదే! మిత్రుడు భాస్కరుడు చెప్పినా ఆ సమయంలో నా మనసు విచక్షణకంటే వినోదానికే మొగ్గుచూపింది. ముందుగా నాకు మంచిని చెప్పినా నేను విననందుకు మిత్రుడు భాస్కరుని క్షమాపణ అడుగుతున్నాను. మా వల్ల నష్టపోయిన, ఇబ్బందిపడ్డ తోట యజమాని, అక్కడి పనివార లను మనఃస్ఫూర్తిగా క్షమించమని కోరుకుంటున్నా. మహారాజుగారికి, మహామంత్రి, సేనాధిపతికి మావల్ల మనస్తాపం కలిగించినందుకు క్షమించమని వేడుకుంటూ భవిష్యత్‌లో ఇది పునరావృతంకాదని విచక్షణ, బాధ్యతతో మెలగుతా మని పెద్దలఎదుట వాగ్దానం చేస్తున్నాం' అన్నాడు. యువరాజుతో పాటు మిగిలినమిత్రులు క్షమాపణలు చెప్పారు.

అప్పుడు తోటమాలి మహారాజుకు నమస్కరిస్తూ 'యువకులూ, గురుకులం కట్టడిమధ్య ఇంతకాలం ఉండటంతో వారు తెలియక చేసిన పొరపాటుగా భావించి వారినందరిని క్షమించమని' కోరాడు. అనంతరం మహారాజు తోట యజమానికి, పని వారలకు నష్టపరిహారం చెల్లించాడు. తర్వాత ఆ మిత్రులతో 'తొలి తప్పుగా భావించి క్షమించి వదిలేస్తున్నాం. రాజ్యాన్ని, ప్రజల్ని కాపాడవలసిన



బాధ్యత కలిగినవారు విచక్షణ మరచి, బాధ్యతలను విస్మరించి అధికారదర్పాన్ని చూపించడం తప్పు. క్రమశిక్షణ, నిజాయితీ, ప్రజాసంక్షేమమే ప్రథమకర్తవ్యం. పాలకులు, వారి అనుయాయులు ప్రజలకు సేవకులుగా వారి సంక్షేమాన్ని చూడాలి. అది పాలకుల కర్తవ్యం. నిత్యం మనం ప్రజా సేవకులమన్నది గుర్తుంచుకుని నడచుకుంటే ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం లభిస్తుంది. అలాకాకుండా అధికారాన్ని, అహాన్ని ప్రదర్శించేలా నడుచుకుంటే అది పతనానికి దారితీస్తుంది. అనునిత్యం గుర్తుంచుకోవలసిన విషయమది' అన్నాడు.

ఆ తర్వాత అటువంటి తప్పు ఎన్నడూ తిరిగి జరగలేదు. క్రమంగా వారు స్నేహంలోనే కాదు, పాలనలోనూ తండ్రులకు తగ్గ తనయులుగా పేరు సంపాదించారు.


పి.వి.కె.

## తేడాలను గుర్తించండి!

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో కొన్ని తేడాలున్నాయి. అవేమిటో గుర్తించండి!



ఇక్కడ కనిపిస్తున్న ముగ్గురు చిన్నారులు ఈ గజిబిజి దారి గుండా ఎలా ఇంటికి చేరుకుంటారో ఆ దారి కనుక్కోండి!



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# సమయస్ఫూర్తి

ఓ గ్రామంలో రామయ్య అనే నిరుపేద రైతు నివసించేవాడు. తనకున్న కొద్దిపాటి పొలంలోనే పంటలు పండించేవాడు. ఒకసారి వరుసగా రెండు యేళ్లు కరువు రావడంతో రామయ్య సాగు కోసం చేసిన ఖర్చులు భారమయ్యాయి. ఆ పరిస్థితుల్లో తన కుటుంబాన్ని గట్టెక్కించడానికి అదే గ్రామంలో ఉండే రంగయ్య అనే వడ్డీ వ్యాపారి దగ్గర కొంత అప్పు తీసుకున్నాడు. రంగయ్య ఊరిలో పేరున్న ధనవంతుడైనా, అతని మనసు మాత్రం చాలా కపటమైనది. రామయ్య అప్పు తీర్చలేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, ఎలాగైనా ఆ చిన్న పొలాన్ని తన పరం చేసుకోవాలని రంగయ్య ఒక పన్నాగం పన్నాడు.

ఒకరోజు సాయంత్రం రంగయ్య రామయ్యను ఊరి రచ్చబండ దగ్గరకు పిలిచాడు. అక్కడ ఊరి జనం కూడా ఉన్నారు. రంగయ్య గొంతు "రామయ్యా, నీ అప్పు రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇప్పుడు నీకు ఒక అవకాశం ఇస్తున్నాను. మన పూర్వీకులు చెప్పినట్లు ఇది విధి నిర్ణయం. ఇక్కడ ఒక సంచిలో ఒక నల్లటి రాయి, ఒక తెల్లటి రాయి వేస్తాను. నువ్వు చూడకుండా ఒక రాయిని తీయాలి. ఒకవేళ నువ్వు నల్లటి రాయి తీస్తే నీ పొలం నా వశమవుతుంది, నీ అప్పు పూర్తిగా మాఫీ చేస్తాను. అదే నువ్వు తెల్లటి రాయి తీస్తే నీ పొలం నీ దగ్గరే ఉంటుంది, నీ అప్పు కొట్టేస్తాను" అన్నాడు.



రామయ్య సరే అన్నాడు. రంగయ్య వంగి రెండు రాళ్లను తీసి సంచిలో వేయడం రామయ్య నిశితంగా గమనించాడు. రంగయ్య తెలివిగా రెండు నల్లటి రాళ్లనే సంచిలో వేశాడని రామయ్యకు అర్థమైపోయింది. ఇప్పుడు ఏ రాయి తీసినా రామయ్య తన జీవనాధారమైన పొలాన్ని కోల్పోతాడు. రంగయ్య మోసాన్ని అందరి ముందు నిలదీస్తే, అతను అప్పు వెంటనే కట్టమని వేధిస్తాడని రామయ్యకు తెలుసు. ఆ నిమిషంలో రామయ్య కంగారు పడకుండా తన సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు.

రామయ్య సంచిలో నుండి ఒక రాయిని బయటకు తీశాడు. అది ఎవరూ చూడకముందే తడబడుతున్నట్లు నటిస్తూ తన చేతిలో నుండి రాయి కింద పడేలా చేశాడు. ఆ రాయి నేలపై ఉన్న వేలాది రాళ్లలో కలిసిపోయింది. రామయ్య "అయ్యో! రాయి కింద పడిపోయింది. ఇప్పుడు నేను ఏ రాయి తీశానో ఎలా తెలుస్తుంది?" అన్నాడు. వెంటనే తేరుకుని, "సంచిలో ఇంకా ఒక రాయి ఉంది కదా! అది ఏ రంగులో ఉందో చూస్తే, నేను తీసిన రాయి ఏ రంగుదో సులభంగా తెలిసిపోతుంది" అన్నాడు. రంగయ్య బిత్తరపోయాడు. సంచిలో రెండో నల్లటి రాయి ఉంది. అంటే రామయ్య తీసిన మొదటి రాయి తెల్లటిదే అని ఊరి జనం నమ్మారు. రంగయ్య తన మోసం బయట పడకూడదని, తను రెండు నల్ల రాళ్లే వేశానని ఒప్పుకోలేక మౌనంగా ఉండిపోయాడు. అలా రామయ్య సమయస్ఫూర్తితో తన పొలాన్ని కాపాడుకున్నాడు. "నిజాయితీగా బతికే వారికి దేవుడు ఏదో ఒక రూపంలో దారి చూపిస్తాడు. ఆపద సమయంలో గుండె ధైర్యం వీడకుండా ఆలోచించడమే మనల్ని రక్షిస్తుంది" అని రామయ్య అక్కడున్న వారందరితో అన్నాడు.

– సి.హెచ్.ప్రతాప్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

సూర్య
28.6.2026
ఆదివారం అనుబంధం

# బుడత



## బాలల కథ

# వ్యాపారి లౌక్యం



- పల్లా వెంకట రామారావు ,9949043019

ఆంజనేయులు ఊరిలో పెద్ద వ్యాపారి. డబ్బుకు కొదవ లేదు కానీ, రూపాయి విలువ తెలిసిన మనిషి. ఒకసారి ఆయన తన నలుగురు స్నేహితులతో కలిసి ఓ వారం రోజుల పాటు విహార యాత్రకు ప్లాన్ చేశాడు. అందరూ కలి ఊరు దాటి, కొత్త ప్రదేశాలు చూడటానికి బయలుదేరారు.

యాత్రలో ఆంజనేయులు ఎక్కడా వెనకాడలేదు. మంచి హోటళ్లలో బస ఏర్పాటు చేశాడు, స్నేహితులకు నచ్చిన రుచికరమైన వంటకాలు తినిపించాడు, ఎక్కడికెళ్లినా టిక్కెట్లు, ఖర్చులు తనే చూసుకున్నాడు. స్నేహితులు అడగకముందే అన్నింటికీ చేతినిండా ఖర్చు పెట్టాడు. ఆయన ఉదారత చూసి స్నేహితులు మనసులోనే మురిసిపోయారు.

యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఓ రైల్వే స్టేషన్‌కు చేరుకోవాల్సి వచ్చింది. అప్పుడు ఒక ఆటో నడుపుకునే వ్యక్తి దగ్గరకు వెళ్లి, "స్టేషన్‌కు ఎంత అవుతుంది?" అని అడిగారు.

ఆ ఆటో డ్రైవర్ వీరంతా కొత్తవాళ్లు, పైగా ధనవంతుల్లా ఉన్నారని గమనించి, "నూట యాభై రూపాయలు అవుతుంది బాబు" అన్నాడు. నిజానికి అక్కడ రెగ్యులర్ ఛార్జ్ నూరు రూపాయలు మాత్రమే.

ఆంజనేయులు వెంటనే, "అబ్బే! చాలా ఎక్కువ చెప్తున్నావ్. వంద ఇస్తాం, వస్తావా?" అంటూ గీచి గీచి బేరం ఆడాడు. చాలా సేపు వాదన జరిగిన తర్వాత ఆటో అతను కాసేపు ఆలోచించి, "సరే రండి బాబు" అన్నాడు.

ఆటోలో కూర్చున్నాక స్నేహితులకు ఒక సందేహం వచ్చింది. వారిలో ఒకరు నవ్వుతూ, "ఏంటి ఆంజనేయులు! యాత్ర మొదలైనప్పటి నుండి హోటళ్లకు, తిండ్లకు వేల రూపాయలు నీళ్లలా ఖర్చు పెట్టావు. కానీ ఇక్కడ ఈ పేద ఆటోవాడి దగ్గర యాభై రూపాయల కోసం అంతగా బేరం ఆడావు? యాభై అంటే మనిషికి పది రూపాయలే కదా,ఆ మాత్రం ఎక్కువ ఇస్తే ఏమవుతుంది? ఒకరికి సహాయం చేసినట్టు ఉండేది కదా!" అన్నారు. మిగిలిన ముగ్గురు కూడా అవునన్నట్టు తలాడించారు.

ఆంజనేయులు ప్రశాంతంగా నవ్వి ఇలా చెప్పాడు:

"మిత్రులారా! మనం ఉన్న ఊరిలో ఉన్నంత సేపు మంచి వసతుల కోసం, నాణ్యమైన సేవల కోసం ఎంత ఖర్చు పెట్టినా తప్పు లేదు. ఎందుకంటే దానికి తగ్గ విలువ మనకు దక్కుతుంది. కానీ ఇక్కడ ఆటో అతను అడిగింది సరైన ధర కాదు. మన దగ్గర డబ్బు ఉంది కదా అని వాడు అడిగినంత ఇస్తే, అతనికి అది అలవాటయిపోతుంది."

ఆయన ఇంకా కొనసాగిస్తూ...

"రేపు పొద్దున మనలాంటి ధనవంతులు కాకుండా, ఒక సామాన్యుడో లేదా డబ్బుల్లేని పేదవాడో అత్యవసరంగా ఈ ఆటో ఎక్కాల్సి వస్తే, ఆటో అతను వారి దగ్గర కూడా ఇంతే ఎక్కువ డిమాండ్ చేస్తాడు. వాళ్లు అంత ఇచ్చుకోలేక ఇబ్బంది పడతారు. మన దగ్గర డబ్బు ఉంది కదా అని మనం వ్యవస్థను, ధరలను పాడు చేయకూడదు. ఎక్కడ ఎంత ఖర్చు చేయాలో అంతే చేయాలి. అనవసరంగా ఎక్కువ ఇస్తే, అది లేనివారికి శాపంగా మారుతుంది" అని వివరించాడు.

ఆంజనేయులు మాటల్లోని అంతరార్థాన్ని, సమాజం పట్ల ఆయనకున్న బాధ్యతను తెలుసుకుని స్నేహితులు ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయారు. డబ్బు ఖర్చు పెట్టడంలో 'ఉదారత' ఎంత ముఖ్యమో, సమాజ హితం కోసం 'విచక్షణ' చూపడం కూడా అంతే ముఖ్యమని వారందరికీ అర్థమైంది.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 2 | | 5 | | | | 6 |
| | | | | | 4 | | 7 | |
| 1 | | 8 | | 9 | | | | |
| | | | 7 | | 6 | | 8 | |
| 7 | | 6 | | | | 2 | | 4 |

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 5 | | 7 | | | |
| | | 2 | 4 | | 6 | 3 | | |
| | 9 | | | 1 | | | 2 | |
| 2 | 7 | | | | | | 6 | 8 |
| | | 3 | | | | 1 | | |